thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 60 | కరీంనగర్ ఆదివారం, 11 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## నాలుగు రాష్ట్రాలకు సింధు జలాల మళ్లింపు

న్యూఢిల్లీ : నాలుగు రాష్ట్రాల అవసరాలు తీర్చుకునేందుకు సింధు నదీ జలాలను మళ్లించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. రాజస్థాన్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ అవసరాలకు సింధు జలాలను వినియోగించుకోవాలని, దీని అమలుకు అవసరమైన మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు కేంద్ర జలశక్తి శాఖ పనిచేస్తోందని ఏఎన్ఐ వర్గాలు తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌తో సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన సంగతి తెలిసిందే.

ఈ క్రమంలోనే చుక్క నీటిని కూడా పాకిస్థాన్‌కు పోనివ్వకూడదని కేంద్రం భావిస్తోంది. సింధు జలాల వినియోగంపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గంట పాటు జరిగిన ఈ సమావేశంలో జలాల మళ్లింపుపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిసింది.

## భారత్, పాక్ మధ్య శాంతి ఒప్పందం..

# సరిహద్దుల్లో శాంతి శంఖారావం




శాంతి ఎప్పుడూ యుద్ధం కన్నా గొప్పదే...కానీ కొన్నిసార్లు శాంతి సాధించడానికి కూడా ధైర్యం, సంకల్పం కావాలి. ఈ క్రమంలో శనివారం సాయంత్రం, భారత్, పాక్ మధ్య తారస్థాయికి చేరిన పరిస్థితులకు తాత్కాలికంగా ముగింపు లభించింది. శనివారం సాయంత్రం భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. భారత సైన్యం సమాధానం కారణంగా పాకిస్తాన్ ఎట్టకేలకు వెనక్కి తగ్గింది.

చివరకు అమెరికాను రాయబారం కోసం వేడుకోగా, ట్రంప్ చర్చలతో భారతదేశం కాల్పుల విరమణకు అంగీకరించింది. విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపిన వివరాల ప్రకారం పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ ఈరోజు మధ్యాహ్నం 15:35 గంటలకు భారత DGMOకి ఫోన్ చేశారు. భారత ప్రామాణిక సమయం ప్రకారం సాయంత్రం 17.00 గంటల నుంచి భూమి, వాయు, సముద్రంపై కాల్పులు, సైనిక చర్యలను ఇరుపక్షాలు నిలిపివేయాలని ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఒప్పందాన్ని అమలు చేయాలని ఈరోజు రెండు పార్టీలకు ఆదేశాలు అందాయన్నారు. ఈ క్రమంలో డైరెక్టర్ జనరల్ మిలిటరీ ఆపరేషన్స్ మే 12న మధ్యాహ్నం 12 గంటలకు మళ్లీ చర్చించనున్నట్లు వెల్లడించారు.

**దృఢంగా ఉన్న భారత్...** కాల్పుల విరమణను ధృవీకరిస్తూ, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సైతం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. భారతదేశం, పాకిస్తాన్ ఈరోజు కాల్పులు, సైనిక చర్యలను నిలిపివేయడానికి అంగీకరించాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం నిరంతరం దృఢమైన, అచంచలమైన వైఖరిని ఇలాగే కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

**ధైర్యమైన నిర్ణయం...** పాకిస్తాన్ దాడుల విషయంలో కేవలం ప్రతిసారీ మౌనంతో సాధ్యపడదని భారత్ ఇటీవల దాడులతో నిరూపించింది. ఈ క్రమంలోనే భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. భారత్, తన శక్తిని మౌనంగా చూపించకుండా, స్పష్టంగా వ్యూహాత్మకంగా పాకిస్తాన్ దురుద్దేశాలకు గట్టి కౌంటర్ ఇచ్చింది. ఈ ప్రతిస్పందనతో పాక్ చివరికి వెనక్కి తగ్గింది. అమెరికా మధ్యవర్తిత్వంతో, కాల్పుల విరమణ ఒప్పందానికి భారత్ అంగీకరించింది.

**చివరకు శాంతికే..** ఈ నేపథ్యంలో శనివారం (మే 10న) సాయంత్రం ఈ పరిస్థితులకు ముగింపు లభించింది. అయితే శాంతి అంటే బలహీనత మాత్రమే కాదు. అది సమర్థత, స్థిరత్వం, దేశ ప్రజల పట్ల నిబద్ధత గురించి ఆలోచించి తీసుకున్న నిర్ణయమని చెప్పవచ్చు. ఈ పరిణామం శాంతిని నిలుపుకోవడంతోపాటు సైనిక శక్తి ఎలా ఉపయోగిస్తుందో భారత్ మరోసారి పాకిస్తాన్ సహా అనేక దేశాలకు చూపించింది. ఈ క్రమంలో ఇరు దేశాల ప్రజల ప్రాణాల గురించి ఆలోచించిన భారత్ చివరకు శాంతి విధానానికి సమ్మతించింది.

**భారత్– పాక్ యుద్ధంపై ట్రంప్ సంచలన ప్రకటన..** భారత్–పాకిస్తాన్ యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించినట్లు ట్రంప్ ప్రకటించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా.. సంచలన పోస్ట్ చేశారు. కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయని ట్రంప్ పేర్కొన్నారు. భారత్, పాక్ దేశాలకు మధ్యవర్తిత్వం వహించామని.. సుదీర్ఘ చర్చల తర్వాత తక్షణ కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయని ట్రంప్ పేర్కొన్నారు. యుద్ధ విరమణకు భారత్, పాక్ అంగీకరించినందుకు సంతోషంగా ఉందన్నారు ట్రంప్.

**భీకర దాడులు..** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో.. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. పాక్ ప్రోద్బలంతోనే ఈ ఉగ్రదాడి జరిగిందని, ఇందుకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని భారత్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్‌లో ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులు చేసింది. ఈ దాడిలో 100 మంది వరకు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో టెర్రరిస్ట్ టాప్ లీడర్స్ కూడా ఉన్నట్లు తాజాగా భారత ప్రభుత్వం ప్రకటించింది.

**చర్చలు ఫలించాయి..** భారత ప్రధాని నరేంద్ర మోదీ, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్, సైన్యాధిపతి అసిమ్ మునీర్, జాతీయ భద్రతా సలహదారులు అజిత్ దోవల్, అసిమ్ మాలిక్ సహా భారత్, పాకిస్తాన్‌కు చెందిన సీనియ్ అధికారులతో అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేమ్స్ డేవిడ్ వాన్స్, తాను 48 గంటలపాటు చర్చలు జరిపాము. ఈ చర్చల్లో పురోగతి లభించింది. తక్షణ కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి. తటస్థ స్థితిలో విస్తృత సమస్యలపై చర్చించడానికి ఇరు దేశాలు అంగీకరించాయి. శాంతి మార్గాన్ని ఎంచుకోవడంలో ప్రధాన మంత్రులు మోదీ, షరీఫ్‌లు అనుసరించిన విధానాన్ని అభినందిస్తున్నాం అని మార్కో రూబియో తెలిపారు.

**పాక్ ప్రతిదాడి.. భారత్ ఉగ్రరూపం..** ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ దాడి చేయడంలో పాకిస్థాన్ రెచ్చిపోయింది. భారత్‌లోని 15 నగరాలను టార్గెట్ చేస్తూ మిస్సైల్స్, డ్రోన్స్ వదిలింది. అయితే, భారత్ ఈ మిస్సైల్స్‌ను ధ్వంసం చేసింది. అయినప్పటికీ.. పాక్ తన బుద్ధి మార్చుకోకుండా అటాక్ చేయడంతో.. భారత్ ప్రతిదాడులకు పాల్పడింది. దీంతో హడలిపోయిన పాకిస్థాన్.. యుద్ధం ఆపేలా చూడాలంటూ అమెరికాతో కాళ్లబేరం సాగించింది. దీంతో కల్పించుకున్న అమెరికా.. భారత్, పాక్‌తో సంప్రదింపులు జరిపింది. కాల్పుల విరమణకు అంగీకరింపజేసింది. ఇదే విషయాన్ని తెలుపుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు.

## ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణిస్తాం: పాక్‌స్థాన్‌కు భారత్ సీరియస్ వార్నింగ్




న్యూఢిల్లీ: పాకిస్తాన్‌కు భారత్ సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని హెచ్చరించింది. పాకిస్థాన్ రెచ్చిపోతే అంతకు అంత ప్రతిదాడితో విరుచుకుపడాలని నిర్ణయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన త్రివిధ దళాధిపతులతో జరిపిన అత్యున్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. పాక్‌పై పూర్తి స్థాయి యుద్ధానికి మోదీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణించాలని, అంతే తీవ్ర స్థాయిలో బదులివ్వాలని ప్రధాని దిశానిర్దేశం చేశారని తెలిసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్ ఈ కీలక సమావేశంలో పాల్గొన్నారు. భారత్‌లో 26 లొకేషన్లపై పాక్ డ్రోన్ దాడులకు ప్రతిగా శనివారం తెల్లవారు జామున నాలుగు పాక్ ఎయిర్‌బేస్‌లపై భారత్ దాడులు చేసింది. అనంతరం నేపథ్యంలో మోదీ ఈ సమావేశం నిర్వహించారు. దేశ భద్రతా విషయంలో మరింత కఠిన వైఖరి ప్రదర్శించాలని ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత ప్రయోజనాలను దెబ్బతీసేలా భవిష్యత్తులో ఎలాంటి ఉగ్రవాద చర్యలకు పాల్పడినా దానిని యుద్ధ చర్యగా పరిగణించాలని సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఇకపై ఉగ్రవాద చర్యలను కేవలం అంతర్గతా భద్రతా చర్యలుగానే పరిగణించలేమని, ప్రతిస్పందన అత్యంత భీకరంగా ఉంటుందనే ప్రత్యక్ష హెచ్చరిక సందేశాన్ని భారత్ ఇచ్చినట్లయింది.

## యుద్ధప్రాతిపదికన సీతారామ ఎత్తిపోతల పథకం పనులు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు సీతమ్మ సాగర్ ఆనకట్టను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పనుల పురోగతికి సంబంధించిన అంశాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి హైదరాబాద్ జలసౌధలో ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ఇల్లందుకు సాగునీరు అందించే విషయమై గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యను కూడా సమావేశానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. అనుమతులు, పనుల పురోగతి, భూసేకరణ, సంబంధిత అంశాలపై ఇంజినీర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. సమస్యలుంటే పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతిపాదించిన తరహాలో ఇల్లందు మీదుగా నీరు ఇస్తే జిల్లా మొత్తానికి ప్రయోజనకరంగా ఉంటుందని గుమ్మడి నర్సయ్య మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న డిజైన్ ప్రకారం ముందుకెళ్తూ.. అవసరమైన చోట లింక్ కెనాల్ ద్వారా పనులు చేపట్టవచ్చని ఇంజినీర్లకు సూచించారు.

## ఇండియన్ జేమ్స్‌బాండ్

## అజిత్ దోవల్... ఇది పేరు కాదు...

# భారత్‌కో బ్రాండ్!




అజిత్ దోవల్... ఈ పేరే ఇప్పుడు దేశమంతా వినిపిస్తోంది. పాకిస్తాన్ పై భారత దాడుల వెనుక మాస్టర్ మైండ్ ఆయనదే. ఉగ్రవాదుల పీచమణచడమే ఆయన టార్గెట్. ప్రధాని నరేంద్ర మోడీకి అత్యంత నమ్మకస్తుల్లో ఒకరు అజిత్ దోవల్. ముఖ్యంగా ప్రధానికి కళ్లు, చెవులు లా వ్యవహరిస్తారు. ప్రధాని మోడీ డైరెక్షన్ లో ఆపరేషన్ సింధూర్ ను లీడ్ చేస్తోంది అజిత్ దోవల్. కరాచీ, ఇస్లామాబాద్ తగలబడిపోతుంటే వార్ రూమ్ లో కూర్చుని ఎంజాయ్ చేశారు. అజిత్ దోవల్ అసలు పేరు అజిత్ కుమార్ దోవల్. 2014 నుండి జాతీయ భద్రతా సలహాదారుగా పనిచేస్తున్నారు. కేరళ కేడర్‌కు చెందిన మాజీ ఇండియన్ పోలీస్ సర్వీస్ అధికారి. గతంలో దశాబ్దం పాటు ఇంటెలిజెన్స్ బ్యూరో లో పని చేశారు. 2004-05లో డైరెక్టర్‌గా సేవలందించారు. గూఢచారిగా, నిఘా అధికారిగా పాకిస్తాన్‌లో ఒక యేడాది పాటు IBకి రహస్య గూఢచారిగా పనిచేశాడు. ఆ తర్వాత అతను ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్‌లో ఆరు యేళ్లు అధికారిగా పనిచేశారు .ఆ టైమ్ లోనే పాకిస్తాన్ లో అణువణువు తిరిగారు దోవల్. అంతేకాదు ఆ దేశ అణు, విద్యుత్ పాటు ఇతర రహస్యాలపై పూర్తి పట్టు సాధించారు. ఆ సమాచారంతోనే ఇప్పుడు పాకిస్తాన్ ను ఖతం చేసే పనిలో ఉన్నారు అజిత్ దోవల్. అజిత్ దోవల్ 1945లో పూర్వపు యునైటెడ్ ప్రావిన్సెస్‌లోని పౌరి గర్వాల్‌లోని ఘిరి బనెల్సియున్ గ్రామంలో జన్మించారు. ప్రస్తుతం ఉత్తరాఖండ్ లో ఉంది. ఆయన తండ్రి, మేజర్ GN దోవల్ భారత సైన్యంలో అధికారి. తన ప్రాథమిక విద్యను రాజస్థాన్‌లోని అజ్మీర్ మిలిటరీ స్కూల్‌లో చదివారు. 1967లో ఆగ్రా విశ్వవిద్యాలయం నుండి ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీని పొందారు. 1968లో అజిత్ దోవల్ ఇండియన్ పోలీస్ సర్వీస్‌లో చేరారు. పంజాబ్, మిజోరాంలో తిరుగుబాటు వ్యతిరేక కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారు. అప్పుడే ఆయనకు 'ఇండియన్ జేమ్స్ బాండ్' అనే బిరుదు లభించింది. 1972 జనవరి 2 నుండి జనవరి 9 వరకు, దోవల్ తలసేరిలో పనిచేశాడు. ఆ ప్రాంతంలో శాంతిభద్రతలను పునరుద్ధరించడానికి అప్పటి హోంమంత్రి కె కరుణాకరన్ అతన్ని నియమించాడు. డిసెంబర్ 28, 1971న, తలసేరిలో అల్లర్లు చెలరేగాయి, అక్కడ ముస్లింలను, మసీదులను RSS లక్ష్యంగా చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. 1971 నుండి 1999 వరకు జరిగిన 15 ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాల హైజాక్ ఘటనల్లో చాకచాక్యంగా వ్యవహరించారు. 1984 లో ఆపరేషన్ బ్లాక్ థండర్ సమయంలో ISI ఏజెంట్‌గా నటిస్తూ గోల్డెన్ టెంపుల్‌లోకి చొరబడ్డారు అజిత్ దోవల్. ఖలిస్తానీ వేర్పాటువాదులపై గూఢచర్యం చేశాడు. వేర్పాటువాదుల పూర్తి సమాచారాన్ని సేకరించి.. వారి స్థానాల మ్యాప్‌లను తయారు చేశారు. వారిని విధ్వంసం చేయడానికి తప్పుడు సలహాలు ఇచ్చిన టీంలో అతను ముఖ్యమైన సభ్యుడయ్యాడు. ఇది ఆపరేషన్ బ్లూస్టార్ సమయంలో సహాయపడింది .సిక్కిం భారత్‌లో విలీనం కావడానికి అజిత్ దోవల్ అమలు చేసిన వ్యూహాలే కీలకమయ్యాయి. ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలలో కొంతకాలం పాటు భారతదేశ మూడవ జాతీయ భద్రతా సలహాదారు ఎంకే నారాయణన్ ఆధ్వర్యంలో ఆయన శిక్షణ పొందారు. 1999లో కాందహార్‌లోని %×జ%-814 నుండి ప్రయాణీకుల విడుదలపై చర్చలు జరిపిన ముగ్గురు సంధానకర్తలలో అజిత్ దోవల్ ఒకరు. 1971 నుండి 1999 వరకు, ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాల 15 హైజాక్‌లను ముగించడంలో ఆయన పాల్గొన్నారు. జనవరి 2005లో, అజిత్ దోవల్ ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ పదవి నుండి పదవీ విరమణ చేశారు. డిసెంబర్ 2009లో, ఆయన వివేకానంద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక డైరెక్టర్ అయ్యారు. దోవల్ ప్రముఖ వార్తాపత్రికలు, జర్నల్స్ కోసం సంపాదకీయ వ్యాసాలు రాశారు. దోవల్ మే 30, 2014న భారతదేశ ఐదవ జాతీయ భద్రతా సలహాదారుగా నియమితులయ్యారు. జూలై 2014లో, ఇరాక్‌లోని తిక్రిత్‌లోని ఒక ఆసుపత్రిలో చిక్కుకున్న 46 మంది భారతీయ నర్సులు సురక్షితంగా తిరిగి వచ్చేలా ఆయన హామీ ఇచ్చారు. అత్యంత రహస్య మిషన్‌పై ఇరాక్‌కు వెళ్లి ఇరాక్ ప్రభుత్వంతో ఉన్నత స్థాయి సమావేశాలు జరిపారు. జూలై 5న, దోవల్ సమావేశం తర్వాత, ISIS ఉగ్రవాదులు భారతీయ నర్సులందరినీ ఎర్బిల్ నగరంలోని కుర్దిష్ అధికారులకు అప్పగించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎయిర్ ఇండియా విమానంలో నర్సులను భారతదేశంలోని కొచ్చికి తిరిగి తీసుకువచ్చింది. 2005లో ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌గా పదవీ విరమణ చేశారు దోవల్. 2014 మే 30న భారతదేశ ఐదవ జాతీయ భద్రతా సలహాదారుగా నియమితులయ్యారు. 2019లో పుల్వామాలో పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాది CRPF కాన్వాయ్‌పై కారు బాంబు దాడి చేసి 40 మంది CRPF సిబ్బంది మరణించిన తర్వాత, భారత వైమానిక దళం పాకిస్తాన్‌లోని అనుమానిత ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్ చేసింది. బాలాకోట్ వైమానిక దాడుల వెనుక మాస్టర్ మైండ్ మొత్తం అజిత్ దోవల్ దే.

ఈ దాడి సమయంలో పాకిస్తాన్ సైన్యం భారత పైలట్ అభినందన్ వర్ధమాన్‌ను పట్టుకున్న తరువాత, అజిత్ దోవల్ భారత పైలట్‌ను విడుదల చేయడానికి అమెరికా విదేశాంగ కార్యదర్శి జాతీయ భద్రతా సలహాదారుతో చర్చలు జరిపారు . జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక హెూదాను రద్దు చేయడంలో అజిత్ దోవల్ కీలక పాత్ర పోషించారు. తాజాగా పహల్గామ్ ఉగ్రదాడి ఘటనపై తర్వాత పాకిస్థాన్ 'ఆపరేషన్ సిందూరం' పరిట ఉక్కిరి బిక్కిరి చేయడంలో సక్సెస్ సాధించడంలో అజిత్ దోవల్ దే కీలక పాత్ర అని చెప్పాలి.



# త్రివిధ దళాల అధిపతులతో మోదీ హైలెవల్ మీటింగ్

భారత్‌- పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఈనేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం త్రివిధ దళాధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ప్రధాని నివాసంలో ప్రస్తుతం ఈ సమావేశం కొనసాగుతోంది. ఇందులో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఉన్నారు. కొన్ని గంటల ముందే భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ సైతం మోదీతో భేటీ అయ్యారు. భారత్‌- పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో డోభాల్ వరుసగా ప్రధానితో చర్చలు జరుపుతున్నారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడితో భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈక్రమంలో 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలపై భారత్ ఆర్మీ దాడులు చేసింది. ఈ దాడుల్లో అనేక మంది ఉగ్రవాదులు మృతి చెందారు. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తార స్థాయికి చేరాయి.




సరిహద్దుల వెంట 26 ప్రదేశాలపై డ్రోన్లు, శతఘ్నులతో పాక్ దాడి చేయడంతో.. ప్రతిస్పందించిన భారత్ ఆ దేశంలోని మూడు ప్రధాన వైమానిక స్థావరాలపై విరుచుకుపడింది. ఈ దాడుల విషయాన్ని ఆ దేశ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదురి ధ్రువీకరించారు. పాక్ సైన్యం హెడ్‌క్వార్టర్ ఉన్న రావల్పిండి చక్లాలలోని నూర్‌ఖాన్, చక్వాల్‌లోని మురీద్, జాంగ్ జిల్లా షోర్కోట్‌లో ఉన్న రఫీకి వైమానిక స్థావరాల్లో పేలుళ్లు జరిగాయి.

వీటికి సరైన రీతిలో ప్రతిస్పందిస్తామని ఆ దేశ సైన్యం పేర్కొంది. ఇక భారత్‌పై దాడులకు 'ఆపరేషన్ బున్యాన్ ఉన్ మర్సూస్' (బలమైన పునాది) అనే పేరు పెట్టింది. ఈ దాడులపై భారత వాయుసేన, సైన్యం నుంచి ఎటువంటి ప్రకటన ఇప్పటి వరకు వెలువడలేదు. నేటి ఉదయం 10.30 గంటలకు భారత సైన్యం ప్రెస్‌మీట్ నిర్వహించనుంది. రెండు దేశాల సరిహద్దు ప్రాంతాల్లో శుక్రవారం పగటిపూట కాస్త ప్రశాంతత నెలకొన్నా చీకటి చిక్కబడిన తర్వాత మరోసారి భారత్‌పై దుస్సాహసానికి ఒడిగట్టింది. బారాముల్లా నుంచి భుజ్ వరకు 26 ప్రాంతాలపైకి వరసగా డ్రోన్లు పంపింది. ముఖ్యంగా శ్రీనగర్ విమానాశ్రయాన్ని, అవంతీపొరా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని పంపిన డ్రోన్లను భారత సైన్యం విజయవంతంగా నిర్వీర్యం చేసి సత్తా చాటుకుంది. ఇక తాజాగా శనివారం తెల్లవారు జాము నుంచి పాక్ తిరిగి దాడులు చేపట్టినట్లు తెలుస్తోంది.

# అమల్లోకి సిటీ పోలీస్ యాక్ట్.. వాటికి నో ఎంట్రీ

హైదరాబాద్, మే 10: భారత్-పాక్ యుద్ధం నేపథ్యంలో దేశంలోని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది కేంద్ర హోంశాఖ. దీంతో వెంటనే అలర్ట్ అయిన తెలంగాణ ప్రభుత్వం, పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. హైదరాబాద్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. తాజాగా హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ అమలులోకి వచ్చినట్లు సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. సెక్షన్ 67 (సి) కింద తన అధికారాలను ఉపయోగించారు సీపీ. ప్రజల భద్రత కోసం మిలటరీ కంటోన్మెంట్ ప్రాంతాలలో, చుట్టుపక్కల ప్రజల భద్రత దృష్ట్యా బహిరంగ ప్రదేశాల్లో టపాసులు లేదా బాణసంచా పేల్చడం నిషేధం విధించారు. ప్రస్తుత భద్రతా వాతావరణం దృష్ట్యా, పటాకులు కాల్చిన పేలుడు లేదా తీవ్రవాద సంబంధిత కార్యకలాపాలని తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని.. భద్రతా దళాలపై అనవసరమైన ఒత్తిడిని కలిగే అవకాశం ఉండడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సీపీ తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, సమావేశాలు, కార్యక్రమాలలో పటాకులు పేల్చడం నిషేధమన్నారు. సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం ఆంక్షలు తక్షణం అమలులోకి వస్తాయని తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆంక్షలు కొనసాగుతాయని సీపీ సీవీ ఆనంద్ స్పష్టం



చేశారు. మరోవైపు నగర వ్యాప్తంగా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలు మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. సీపీ సీవీ ఆనంద్ ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షిస్తున్నారు. బందోబస్తుపై పోలీసులకు సూచనలు ఇస్తున్నారు. ఎలాంటి ఆందోళన వద్దని.. భయాభ్రాంతులకు గురికావద్దని ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. అలాగే నగరంలో అనుమానాస్పద వ్యక్తులపై కూడా పోలీసులు ఫోకస్ పెట్టారు.

# ఆపరేషన్ సిందూర్.. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు తెలుగు విద్యార్థుల లేఖ



హైదరాబాద్: యుద్ధ ప్రాంతంలో చిక్కుకుపోయామని.. తమను ఆదుకోవాలని, కశ్మీర్ నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు SKUAST యూనివర్సిటీకి చెందిన ఏపీ, తెలంగాణ విద్యార్థులు ఇవాళ(శనివారం) లేఖ రాశారు.వెంటనే కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. జిల్లా కలెక్టర్, వర్సిటీ డీన్‌తో బండి సంజయ్ మాట్లాడారు. తక్షణమే సురక్షిత ప్రాంతానికి తరలించాలని బండి సంజయ్ కోరారు. ఏపీ, తెలంగాణకు చెందిన 23 మంది విద్యార్థులను జమ్మూకశ్మీర్ యంత్రాంగం తరలిస్తున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో జమ్మూ కశ్మీర్ లోని యుద్ధ ప్రాంతంలో చిక్కుకుపోయి ఆందోళనకు గురవుతున్న తెలుగు విద్యార్థులను జమ్మకశ్మీర్ అధికార యంత్రాంగం సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధమైంది. తెలంగాణ, ఏపీకి చెందిన మొత్తం 23 మంది విద్యార్థులు కశ్మీర్ యుద్ధ ప్రాంతం నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జమ్మూ కశ్మీర్ లోని షేర్-ఇ-కాశ్మీరీ వ్యవసాయ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 23 మంది తెలుగు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గత కొద్దిరోజులుగా పాకిస్తాన్ డ్రోన్ల సాయంతో, క్షిపణులతో కశ్మీర్‌లోని ప్రజలు నివసిస్తున్న ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్మీ శిబిరాలపై దాడి చేస్తుండటంతో ఆ ప్రాంత ప్రజలంతా తీవ్రమైన భయాందోళనల్లో ఉన్నారు. ఎప్పుడు ఏమవుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీనికితోడు అక్కడి ఎయిర్ పోర్టులు మూసివేయడంతో అక్కడ చదువుకుంటున్న తెలుగు విద్యార్థులు బయటకు రాలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో తమ దుస్థితిని వివరిస్తూ 23 మంది తెలుగు విద్యార్థులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు లేఖ రాశారు.




# భారత్- పాకిస్థాన్ ఉద్రిక్తతలు.. మరోసారి స్పందించిన చైనా

భారత్‌- పాకిస్థాన్‌ల మధ్య సమస్యకు ముగింపు పలికేందుకు అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని చైనా పేర్కొంది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో బీజింగ్ ఈమేరకు పేర్కొనడం గమనార్హం.

ఇరుదేశాలు సంయమనం పాటించాలని చైనా విదేశాంగ శాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. 'భారత్‌- పాక్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం. శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు సమయమనం పాటించాలని కోరుతున్నాం. శాంతియుత మార్గాలతో సమస్యలను పరిష్కరించుకోవాలి. ఉద్రిక్తతలను తీవ్రతరం చేసే చర్యలను తగ్గించుకోవాలని సూచిస్తున్నాం. ఈ ఉద్రిక్తతలను తగ్గించాలని అంతర్జాతీయ సమాజం కూడా ఆశిస్తోంది. ఈ సమస్య ముగింపునకు అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని బీజింగ్ పేర్కొంది. ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాల లక్ష్యంగా దాడులు చేసింది. దీంతో భారత్‌- పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమయ్యాయి.




భారత్‌పై పాకిస్థాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడుతున్న విషయం తెలిసిందే. తాజాగా శ్రీనగర్‌లో మరోసారి భారీ పేలుళ్లు సంభవించినట్లు ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్ విమానాశ్రయం సమీపంలో 11.45 గంటల ప్రాంతంలో రెండు భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని తెలిపారు. ఈ పేలుళ్ల కారణంగా ప్రజలు భయాందోళనకు గురయ్యారని.. విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అన్నారు. పేలుళ్ల శబ్దం వినిపించిన వెంటనే పలు ప్రాంతాల్లో సైరన్లు మోగించి.. ప్రజలను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. అవంతిపురం సమీపంలో ఐదుసార్లు భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో క్షిపణి లాంటి వస్తువు పడినట్లు గుర్తించామన్నారు. శనివారం తెల్లవారుజామున శ్రీనగర్ విమానాశ్రయంపై.. ఎయిర్ బేస్‌పై డ్రోన్లతో దాడి చేయగా.. సైన్యం వాటిని తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో పాక్ వరుస దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో, బాల్కనీల్లో ఉండకుండా ఇళ్లల్లోనే ఉండాలని హెచ్చరించారు. పంజాబ్‌లోని బఠిండాలో అధికారులు రెడ్ అలర్ట్ విధించారు. శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో పేలుళ్లు సంభవిస్తుండడంతో దానితో సహా ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 32 విమానాశ్రయాలను ఈనెల 15 వరకు మూసివేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

# 'కగార్'పై ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్.. కర్రెగుట్టల నుంచి సరిహద్దుకు బలగాలు

దిల్లీ: ఆపరేషన్ సిందూర్ ప్రభావం ఆపరేషన్ కగార్‌పై పడింది. భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కర్రెగుట్టల నుంచి సీఆర్పీఎఫ్ బలగాలను దశలవారీగా వెనక్కి రప్పిస్తున్నారు. సీఆర్పీఎఫ్ జవాన్లను హెడ్‌క్వార్టర్స్ చేరుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. పామునూరు, ఆలుబాక, పెద్దగుట్ట నుంచి బలగాలు వెనక్కి మళ్లుతున్నాయి.

ఆదివారం ఉదయం లోపు సరిహద్దుల్లోకి వెళ్లనున్నాయి. ఛత్తీస్‌గఢ్ వైపు ఆపరేష్ కగార్ యథావిధిగా కొనసాగనుంది.



# శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిధిలో డ్రోన్లపై నిషేధం: సైబరాబాద్ సీపీ



హైదరాబాద్: నగరంలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలో డ్రోన్ల వినియోగంపై నిషేధం విధించారు. విమానాశ్రయానికి 10 కి.మీ. పరిధిలో డ్రోన్లపై నిషేధం విధించినట్లు సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి వెల్లడించారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీపీ తెలిపారు. డ్రోన్లపై నిషేధం జూన్ 9 వరకు అమల్లో ఉంటుందని చెప్పారు.

**బాణసంచా కాల్చడంపై నిషేధం: సీపీ సీవీ ఆనంద్...** హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో బాణసంచా కాల్చడంపై నిషేధం విధించినట్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా బహిరంగ ప్రదేశాలు, కంటోన్మెంట్ ప్రాంతాల్లో బాణసంచా కాల్చడంపై నిషేధం విధించినట్లు చెప్పారు. ఆకస్మిక శబ్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దని విజ్ఞప్తి చేశారు. బాణసంచా పేలుళ్లను ఉగ్ర కార్యకలాపాలుగా తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందన్నారు. భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో పౌరులు సహకరించాలని, పోలీసుల ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

# భారత్-పాక్ ఉద్రిక్తతలు.. రైల్వేస్టేషన్లలో భద్రత మరింత కట్టుదిట్టం: ద.మ.రైల్వే

హైదరాబాద్: భారత్ - పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు దక్షిణ మధ్య రైల్వే (ద.మ.రైల్వే) సీపీఆర్‌వో శ్రీధర్ వెల్లడించారు. నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లైన సికింద్రాబాద్, కాచిగూడలో భారీగా భద్రతను పెంచినట్లు తెలిపారు.

సీసీ కెమెరాల సంఖ్యను సైతం పెంచి పర్యవేక్షణ చేస్తున్నట్లు శ్రీధర్ పేర్కొన్నారు. భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రత కారణాల దృష్ట్యా దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలను మూసివేయడంతో రైల్వేస్టేషన్లకు ప్రయాణికుల తాకిడి పెరిగిందన్నారు.

దీంతో భద్రత కోసం ప్రత్యేక బలగాలను మోహరించినట్లు చెప్పారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నామని సీపీఆర్‌వో శ్రీధర్ వెల్లడించారు.



# హైదరాబాద్‌లో మిస్ వరల్డ్-2025 పోటీలు ప్రారంభం


హైదరాబాద్: నగరంలో 72వ మిస్ వరల్డ్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 110కిపైగా దేశాలకు చెందిన సుందరీమణులు ఈ కిరీటం కోసం పోటీపడుతున్నారు. భారత్ తరపున మిస్ ఇండియా నందిని గుప్తా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గచ్చిబౌలి స్టేడియంలో 'జయజయహే తెలంగాణ' రాష్ట్ర గీతం ఆలాపనతో పోటీలు మొదలయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన నిర్వహించారు. పరిచయ కార్యక్రమంలో భాగంగా పోటీదారులు విభిన్న వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, నగర మేయర్ విజయలక్ష్మి, మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే, మిస్ వరల్డ్-2024 విజేత క్రిస్టినా పిస్కోవా తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి సామల సదాశివ - మే 11... సామల సదాశివ జయంతి



ఎక్కడో దూరంగా సభ్య సమాజానికి బహు దూరంగా, విద్యాగంధం అంతగా సోకని, అభివృద్ధి అంటే తెలియని మారుమూల ప్రాంతంలో పురుడు పోసుకుని, స్వయం కృషితో, తెలంగాణ కవుల్లో కాళోజీ తర్వాత అంతటి గుర్తింపు తెచ్చుకున్న అసమాన ప్రతిభ గల సాహితీవేత్త సామల సదాశివ. సాహిత్యంలోనే కాక సంగీతం, చిత్రలేఖనంలో కూడా అపారమైన ప్రతిభను, బహు భాషల్లో ప్రావీణ్యం కలిగిన ప్రతిభాశాలి. ఉర్దూ, పార్శీ, మరాఠీ, హింది సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించారు. తెలుగు తీయదనాన్ని ఉర్దూ వారికి, ఉర్దూ నుడికారపు మాధుర్యాన్ని తెలుగువారికి రుచి చూపించిన గొప్ప అనువాదకుడు. సదాశివ రాసిన విమర్శనా వ్యాసాలు పలు తెలుగు, ఉర్దూ పత్రికల్లో పుంఖాను పుంఖాలుగా ప్రచురితం అయ్యాయి. హైదరాబాద్, వరంగల్, కొత్తగూడెం, ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రాల ద్వారా ఎన్నో ప్రసంగాలు ప్రసార మైనాయి. ఏడవ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో గిరిజన వీరుడు కొమురంభీం పాఠాన్ని రాసి తెలుగువారికి భీంను పరిచయం చేశారు. "కొమురం భీము" సినిమా నిర్మించిన అల్లాని శ్రీధర్... "సదాశివ గారికి కృతజ్ఞతలతో".. అని రాసి తమ అభిమానాన్ని చాటు కున్నారు. సామల సదాశివ (మే 11, 1928 – ఆగష్టు 7, 2012) కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత. తెలంగాణకు చెందిన తెలుగు, ఉర్దూ రచయిత, హిందుస్తానీ సంగీత పండితుడు. హిందుస్తానీ సంగీతాన్ని తొలిసారిగా తెలుగు పాఠక లోకానికి పరిచయం చేసిన తొలి తెలుగు రచయిత. సామల సదాశివ దహెగాం మండలంలో తెనుగుపల్లెలో 1928, మే 11న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు సామన నాగయ్య పంతులు, చిన్నమ్మలు. ఎంఏ, బీఎడ్, డీ లిట్ చదివారు. సదాశివ ఉపాధ్యాయునిగా తొలుత కాగజ్ నగర్లోలోవిధులు నిర్వర్తించారు . ఆయన శిష్యులు ఈనాటికీ మాస్టారు అని గౌరవంగా చెప్పుకుంటారు. డైట్ కళాశాల, ఆదిలాబాద్ ప్రిన్సిపాల్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. సంస్కృత పండితులు కప్ప గంతుల లక్ష్మణ శాస్త్రి గారి వద్ద వ్యాకరణాంశాలు నేర్చుకొని గొప్ప పండితునిగా వాసి కెక్కారు. వేలూరి శివరామశాస్త్రి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, దీపాల పిచ్చయ్యశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, డాక్టర్ సి.నారాయణ రెడ్డి, డాక్టర్ దాశరథి. డాక్టర్ గోపి వంటి పండితులతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. దివంగత ప్రొఫెసర్ జయశంకర్ సదాశివను గురువుగా గౌరవించేవారు. సదాశివ ఎప్పుడు వరంగల్ వెళ్లినా, జయశంకర్ ఇంట్లోనే అతిథిగా ఉండేవారని మాస్టారు యాది పుస్తకంలో పేర్కొన్నారు. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, ఫారసి, మరాఠీ భాషలలో ఆయన పాండి త్యాన్ని సాగించారు. ఉర్దూ, ఫారసీ, హిందీ, మరాఠీ భాషలకు చెందిన ప్రసిద్ధ కవుల, రచయితల సాహిత్యాన్ని ఆయన అనువదించారు. మూడు వందల వ్యాసాలు ఉర్దూలోనూ, 450 వ్యాసాలు తెలుగులోనూ రాసి ప్రముఖ దిన, వార, పక్ష, మాస పత్రికలలో ప్రచురించబడ్డాయి. హైదరాబాద్, వరంగల్, కొత్తగూడెం, విశాఖపట్నం, ఆదిలాబాద్, ఆకాశవాణి కేంద్రాల నుంచి అసంఖ్యాక ప్రసంగాలు, ఇంటర్వ్యూలు ఇచ్చారు. సామల సదాశివ 1963 నుంచి 1983 వరకు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉర్దూ సలహా సంఘం సభ్యులుగా, 1991 నుంచి 1994 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులుగా పని చేశారు. ఆయన చేసిన అంజత్ రుబాయిలు అనువాదానికి 1964లో గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ అనువాద రచనగా ఉంది. 1968లో పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ ప్రదానం. 1994లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ప్రతిభా పురస్కారం, 2002లో కాకతీయ విశ్వ విద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ ప్రదానం, 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్8 రాజశేఖర్ రెడ్డి ప్రతిభా రాజీవ పురస్కారం ప్రదానం. 2011, డిసెంబర్ 21న స్వరలయలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించి ఫిబ్రవరి 14న ఢిల్లీలో ప్రదానం చేశారు. సదాశివ ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో ప్రవేశించి ప్రిన్సిపల్ గా రిటైర్ అయ్యి ఆదిలాబాదు పట్టణంలో స్థిరపడి సదాశివ 2012 ఆగస్టు 7న ఆగస్టు 2012 శ్రావణ బహుళ పంచమిన గుండెపోటుతో శాశ్వతంగా ఈ లోకాన్ని వీడి వెళ్ళారు. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# పాత్రలలో మాధవపెద్ది స్వరం పరకాయ ప్రవేశం - మే 11.. మాధవపెద్ది సత్యం జయంతి



"వివాహ భోజనంబు వింతైన వంటకంబు, వియ్యాల వారి విందు, ఒహ్హోహ్హో నాకే ముందు" అనే అలనాటి మల్టీ స్టారర్ చిత్రరాజం మాయా బజార్ చిత్రంలోని పాటను వినని తెలుగు వారుండరంటే అతిశయోక్తి కాదేమో. ఆ పాట గుర్తుకు రాగానే వెను వెంటనే కళ్ళ ముందు కదలాడతూనే రూపం ఎస్వీ రంగారావు ది. ఆ వెంటనే స్ఫురణకు వచ్చేది మాధవపెద్ది గాత్రమే. ఎస్వీఆర్ నటనకు జీవం పోసిన నేపథ్య గాయకుడు మాధవపెద్ది. అంతేకాదు, దుర్యోధనుడు, రావణుడు, ఘటోత్కచుడు ఇలా ప్రతినాయక పాత్రలకు నేపథ్య గానం ఆయనదే. ఎస్వీరంగారావు, రేలంగి, రమణారెడ్డి లాంటి నాయకేతర నటుల నటనలతో ఆయన గొంతు మమేకం అయింది. మాధవపెద్దిది సుస్వరం. వివాహ భోజనంబు' అని తినుబండారాల గురించి వర్ణించినా, సరదా సరదా సిగరెట్టు' అని ధూమపానం అనర్థాల గురించి హెచ్చరించినా, అయయో జేబులో డబ్బులు పోయెనే' అంటూ పేకాట గురించి వాపోయినా, భళి భళి భళి భళి' దేవా అంటూ తత్వాన్ని బోధించినా, భలేచాన్సులే' అంటూ ఇల్లరికంలో ఉన్న మజాను తెలిపినా, మాధవపెద్ది సుస్పష్ట స్వరం చెవులలో ఇంపుగా వినిపిస్తుంది. అపస్వరమే తెలియని గాయకుడు మా బాబాయ్' అని మాధవపెద్ది గురించి గాన గంధర్వుడు ఎస్పీ. బాలు అంటుండే వారు. మాధవపెద్ది సత్యం (మార్చి 11, 1922 – డిసెంబర్ 18, 2000) తెలుగు సినిమా నేపథ్య గాయకుడు, రంగస్థల నటుడు. ఈయన తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం, హిందీ, సింహళ భాషలతో సహా దాదాపు అన్ని భారతీయ భాషలలో 7,000 పైగా పాటలు పాడి ప్రసిద్ధి చెందాడు. సత్యం 1922, మార్చి 11 న బాపట్ల సమీపాన బ్రాహ్మణ కోడూరు గ్రామంలో మాధవపెద్ది లక్ష్మీ నరసయ్య, సుందరమ్మ దంపతులకు జన్మించాడు. వృత్తిరీత్యా నటుడైన సత్యం చిన్నతనములో ఎనిమిదేళ్ల వయసునుండి రంగస్థల నాటకాలలో నటించేవాడు. తెలుగు రంగ స్థలముపై మల్లాది సూర్య నారాయణ నాటక బృందములో సభ్యునిగా హరిశ్చంద్ర నాటకములో నక్షత్రకుని పాత్రను అద్భుతము పోషిస్తూ పేరు తెచ్చుకున్నాడు. ఆయన ప్రతిభను గుర్తించిన చక్రపాణి మాధవపెద్దిని తనతోపాటు మద్రాసు తీసుకువెళ్లి, తను నాగిరెడ్డితో కలిసి అప్పడే కొత్తగా స్థాపించబడిన విజయా పిక్చర్స్ పతాకము కింద నిర్మిస్తున్న షావుకారు చిత్రములో నటించే అవకాశము కలుగజేశాడు. ఈయన తొలిసారిగా వెండితెరపై హిందీ, తమిళ ద్విభాషాచిత్రం రామదాసులో కనిపించాడు. ఆ సినిమాకు రెండు భాషల్లోనూ తన పాత్రర పాటలు తనే స్వయంగా పాడాడు. మాధవపెద్ది సత్యం షావుకారు సినిమాతో తెలుగు సినిమా రంగములో అడుగు పెట్టాడు. ఈ సినిమాలో సత్యం ఒక గుడ్డివాని పాత్రపోషించి ఆ పాత్రకు ఉన్న మూడు పాటలు పాడాడు. కొన్ని తెలుగు చిత్రాలలో నటించినా మాధవపెద్ది సత్యం ప్రధానంగా గాయకుడే. ఆయన ఆనాటి ప్రసిద్ధ సంగీత దర్శకులైన సాలూరు రాజేశ్వరరావు, ఘంటసాల వెంకటేశ్వరరావు తదితరు లందరితో పనిచేశాడు. ఎస్వీ రంగారావు, రేలంగి వెంకట రాయయ్య పాటలన్నీ దాదాపు ఆయనే పాడాడు. పౌరాణిక చిత్రాలలో పద్యాలు పాడటములో పేరెన్నిక గన్నాడు. ముఖ్యంగా పిఠాపురం నాగేశ్వరరావు, మాధవపెద్ది సత్యం జోడి కలిసి పాడిన పాటలు తెలుగు వారి నొళ్ళలో ఇప్పటికి నానుతూనే ఉన్నాయి. 75 ఏళ్ళ వయసులో కూడా కృష్ణవంశీ తీసిన సింధూరం సినిమాలో సంకురాతిరి పండగొచ్చెరో పాటపాడి పలువురి ప్రశంసలందు కున్నాడు. ఇలా ఎందఱో నటులకు ఆయన కంఠం అమరి పోయింది. రంగస్థల అనుభవం ఆయన్ని తీర్చిదిద్దింది. పద్యం ఆయన గళంలో వయ్యారాలు ఒలికించు కుంది. పాట ఆయన గొంతులో ఒదిగి పోయింది. పాడుతున్నది పాత్రలేవో, పాత్రదారులేమో అనిపించేలా పాత్రలలో ఆయన స్వరం పరకాయ ప్రవేశం చేస్తుంది. ఆయన పద్యంలో భావం తొణికిస లాడుతుంది. ఆయన పాటలో రాగం అలవోకగా అమరి పోతుంది. ఆయన కంఠంలో గాంభీర్యం నాట్య మాడుతుంది. ఆయన కంఠంలో హాస్యం గిలిగింతలు పెడుతుంది. తనకు వచ్చిన గౌరవ పురస్కారాలను ఎప్పుడూ ప్రదర్శించుకోలేదు. కారు కూడా ఎక్కేవారు కాదు. రైలులో సెకండ్ క్లాసులోనే ప్రయాణించే వాడు. మాయాబజార్‌లో నాన్న పాడిన 'వివాహ భోజనంబు' పాట 'సాంగ్ ఆఫ్ ద మిలీనియమ్'గా ఎంపికయినా ఏ మాత్రం గర్వించలేదు. ఆయన సినిమా పరిశ్రమలో యాభై ఏళ్లకు పైగా ఉన్నప్పటికీ విజిటింగ్ కార్డు కూడా ఉండేది కాదు . ఆయన 78 సంవత్సరాల వయసులో 2000, డిసెంబర్ 18న చెన్నైలో అస్వస్థతతో మరణించాడు. ఆయన కుమారుడు, కూచిపూడి నృత్య కోవిదుడు మాధవపెద్ది మూర్తి తన తల్లితండ్రుల జ్ఞాపకార్థం 'మాధవపెద్ది సత్యం అవార్డు, మాధవపెద్ది ప్రభావతి అవార్డును ' నెలకొల్పారు. ఆ పురస్కారం అందుకొన్న వారిలో ఎం. ఎస్. విశ్వనాథన్, పి. బి. శ్రీనివాస్ లాంటి ప్రముఖులున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**




# ఆలయాలు, నివాసాలపై పాక్ నిరంతర దాడులు.. ఇదిగో వీడియో

సాధారణ ప్రజలపై తాము దాడులు చేయడం లేదని పాకిస్థాన్ బుకాయింపులను భారత ఆర్మీ తిప్పికొట్టింది. జమ్ములోని నివాస ప్రాంతాలు, ఆలయాలపై పాక్ నిరంతరం దాడులకు తెగబడుతోందని కేంద్రం పేర్కొంది. అందుకు సాక్ష్యంగా వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. జమ్మూకశ్మీర్‌లోని శంభూ దేవాలయం ధ్వంసమైనట్లు రక్షణ శాఖ ఫొటోలు, వీడియోను విడుదల చేసింది. రాత్రంతా డ్రోన్లతో దాడులు చేస్తూనే ఉందని.. భారత ఆర్మీ వాటిని సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు పేర్కొంది. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడేందుకు సాయుధ బలగాలు కృతనిశ్చయంతో సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేసింది.

# అసమాన నృత్య కళాకారిణి మృణాలిని - మే 11... మృణాలిని సారాభాయ్ జయంతి



ప్రముఖ నృత్య కళాకారిణి, పద్మ భూషణ్ పురస్కార గ్రహీత మృణాలినీ సారాభాయ్ పేరు శాస్త్రీయ నృత్య రంగంలో ఎరుగని వారు అరుదు. శాంతినికేతన్లో గురు రవీంద్రనాథ్ ఠాగూర్ దగ్గర విద్యాభ్యాసం చేసిన మృణాళిని భరత నాట్యం, మోహినీ యాట్టం, కథాకళి నాట్య రీతులలో శిక్షణ పొందారు. నాట్యకారిణిగానే కాదు, కవయిత్రిగా, రచయితగా, నృత్య దర్శకురాలిగా ఆమె ఖ్యాతి పొందారు. మృణాళినికి భరతనాట్యం పంచ ప్రాణం. నాట్యమే సర్వస్వం. నాట్యం కోసం జీవితంలో అసలు పెళ్లే చేసుకో కూడదని అనుకున్నారు. ఆమె కుటుంబానికి సన్నిహితులైన పరమాణు శాస్త్రవేత్త హోమీ జహంగీర్ భాభానే ... మరో శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్‌ని మృణాళినికి పరిచయం చేశారు. విక్రమ్ ఆమెను కలిసిన తర్వాత ఆమె కూడా మారారు. తర్వాత... మృణాళిని విక్రమ్ పెళ్లి చేసుకున్నారు. మృణాళిని సారాభాయ్ (1918 మే 11 – 2016 జనవరి 20) భారతీయ సాంప్రదాయ నృత్య కళాకారిణి, నృత్య దర్శకురాలు, నృత్య గురువు. ఆమె "దర్పణ అకాడమీ ఆఫ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్"కు వ్యవస్థాపకురాలు. అహ్మదాబాదు లోని ఈ సంస్థలో నృత్య రీతులు, నాటకాలు, సంగీతం, తోలుబొమ్మపాటలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఆమె 18,000 మంది శిష్యులకు భరత నాట్యం, కథాకళి లలో శిక్షణ ఇవ్వడం సామాన్యమైన విషయం కాదు. మృణాళిని కేరళ లోని మాజీ పార్లమెంట్ సభ్యులు, సామాజిక కార్యకర్త అయిన అమ్ము స్వామినాథన్ కుమార్తె. ఆమె బాల్యం స్విడ్జర్లాండ్ లో గడిచింది. ఆమె "డాల్‌క్రోజ్" పాఠశాలలో తొలి పాఠాలుగా పశ్చిమాది నృత్య భంగిమలను నేర్చుకున్నారు...ఆమె శాంతి నికేతన్‌లో రవీంధ్ర నాథ్ ఠాగూర్ మార్గదర్శకత్వంలో విద్యాభ్యాసం చేశారు. అక్కడ జీవిత యదార్థాలను గ్రహించే అవకాశాలు కలిగాయి. తర్వాత ఆమె కొంతకాలం అమెరికా సంయుక్త రాష్ట్రాలకు వెళ్ళి... అమెరికన్ అకాడమీ ఆఫ్ ఫ్రెంచ్ ఆర్చివ్స్ ఇంటర్నేషనలాలిస్ డి లా డాన్సె నుండి డిప్లొమాడ్రామాటిక్ ఆర్ట్స్ లో చేరారు. తర్వాత భారత దేశానికి వచ్చి ఆమె దక్షిణాది సాంప్రదాయక నృత్యం అయిన భరతనాట్యాన్ని "మీనాక్షి సుందరంపిళ్ళై" ద్వారా, కథాకళి నృత్యాన్ని "తకఘి కుంచు కురూప్" ద్వారా శిక్షణ పొందారు. మృణాళిని 1948 లో దర్పణ అనే సంస్థను స్థాపించారు. ఒక సంవత్సరం తరువాత పారిస్ లో "థియేటర్ నేషనల్ డి చైల్లోట్" లో ప్రదర్శన ఇచ్చారు. మృణాళిని సుమారు మూడు వందలకు పైగా నాటకాలకు దర్శకత్వం వహించారు. ఆమె అనేక నవలలు, కవితలు, నాటకాలు, కథలు పిల్లల కోసం రచించారు. ఆమె గుజరాత్ రాష్ట్ర హాండీక్రాఫ్ట్స్ అండ్ హాండ్ లూం డెవలప్ మెంట్ సంస్థకు చైర్‌పర్సన్ గా, గాంధీ ఆశయాల ప్రోత్సాహం కోసం యేర్పడిన, సర్వోదయ ఇంటర్నేషనల్ ట్రస్ట్ కు ఆమె ఒక ట్రస్టీగా కూడా ఉన్నారు. మృణాళిని సారాభాయ్ 1965లో పద్మశ్రీ, 1992 లో భారతదేశ విశిష్ట పురస్కారం పద్మభూషణ అవార్డును అందుకున్నారు. 1997 లో యు.కె లోని న్యూయాచ్ కు చెందిన అంగిలియా విశ్వ విద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేసింది. ఫ్రెంచ్ ఆర్చివ్స్ ఇంటర్నేషనలాలిస్ డి లా డాన్సె నుండి డిప్లొమా, మెడల్ అందుకున్న మొదటి వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. 1990 లో పారిస్ లోని ఇంటర్నేషనల్ డాన్స్ కౌన్సిల్ లో ఎగ్జిక్యూటివ్ కమిటీలో నామినేట్ చేయ బడ్డారు. 1994 లో న్యూఢిల్లీ లో సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. మెక్సికో ప్రభుత్వం నుండి బంగారు పతకాన్ని పొందారు. సాంప్రదాయిక నృత్య రంగంలో "మృణాళినీ సారాభాయ్ అవార్డ్ ఫర్ క్లాసికల్ ఎక్సలెన్స్" అవార్డును ప్రకటించింది. 2013లో కేరళ ప్రభుత్వ వార్షిక పురస్కారమైన నిషాగంధి పురస్కారానికి ఆమె మొదటి గ్రహీత. మృణాళిని కుటుంబీకులు పేరు మోసిన వారు కావడం విశేషం. ఆమె తండ్రి డా.స్వామినాథన్ మద్రాసు హైకోర్టులో పేరు పొందిన బారిష్టరు. మద్రాసు లా కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అమె తల్లి అమ్ము స్వామినాథన్ ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు. మాజీ ఎం.పీ. మృణాళిని సోదరి డా. లక్ష్మీ సెహగల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్ లోని "రాణి ఆఫ్ ఝాన్సి రెజిమెంట్" విభాగానికి కమాండర్ గా ఉండేది. ఆమె సోదరుడు "గోవింద స్వామినాథన్" మద్రాసు హైకోర్టులో పేరుమోసిన న్యాయవాది. ఆయన మద్రాసు రాష్ట్ర (తమిళనాడు) కు అటార్నీ జనరల్ బాధ్యతలు కూడా నిర్వహించారు. మృణాళిని భర్త భారతీయ భౌతిక శాస్త్రవేత్త విక్రం సారాభాయ్ కాగా, భారతీయ అంతరిక్ష కార్యక్రమ పిత విక్రం సారాభాయ్ తన భార్యకు తన కెరీర్ ను పెంపొందించు కునేందుకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చారు. వారికి ఒక కుమారుడు కార్తికేయ సారాభాయ్, ఒక కుమార్తె మల్లికా సారాభాయ్ ఉన్నారు. కుమార్తె మల్లిక కూడా నృత్య కళాకారిణియే. మృణాళిని అహ్మదాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2016, జనవరి 21న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**




పాకిస్థాన్ తప్పుడు వార్తల ప్రచారాన్ని తీవ్రతరం చేసింది. ఇప్పుడు దాని ఐరన్ బ్రదర్ చైనాతో చేతులు కలిపింది. పాక్ వండివార్చి ఆన్‌లైన్‌లోని వదిలే తప్పుడు కథనాలను చైనా, అజర్‌బైజన్ మీడియా సంస్థలు ప్రచారంలోకి తెస్తున్నాయి. తాజాగా దీనికి సంబంధించిన ఓ ఘటన వెలుగు చూసింది.

భారత్ అమ్ముల పొదిలో అత్యంత శక్తిమంతమైన గగనతల రక్షణ వ్యవస్థ ఎస్–400. రాడార్ రేంజి దాదాపు 600 కిలోమీటర్ల వరకు ఉంటుందని చెబుతారు. అంతటి శక్తిమంతమైన క్షిపణి రక్షణ వ్యవస్థను పాక్‌కు చెందిన జేఎఫ్–17 యుద్ధ విమానం ఓ క్షిపణితో కూల్చేసిందని పాక్ ప్రభుత్వ రంగ మీడియా సంస్థ పీటీవీ పేర్కొంది. ఈ దాడి పంజాబ్‌లోని ఆదంపుర్ వద్ద జరిగినట్లు వెల్లడించింది. వెంటనే ఈ వార్తలను చైనా ప్రభుత్వరంగానికి చెందిన మీడియా సంస్థ షినువా ప్రచారంలోకి తెచ్చింది. దీనిని గ్లోబల్ టైమ్స్ అందుకొంది. మరోవైపు అజర్ బైజన్‌కు చెందిన మరో సంస్థ కూడా ఈ వార్తను హడావుడిగా ఆన్‌లైన్‌లో పెట్టింది. ఈ ఆన్‌లైన్ విష ప్రచారంపై వెంటనే భారత మిలిటరీ విభాగం స్పందించింది. హైపర్ సోనిక్ క్షిపణితో ఎస్–400ను ధ్వంసం చేసినట్లు పాక్ చేస్తున్న ప్రచారం తప్పు అని భారత సైనికాధికారులు పీటీకి వెల్లడించారు. ఎస్–400 ట్రయాంఫ్ గగనతల రక్షణ వ్యవస్థ. నాటో దేశాల నుంచి వైమానిక దాడులను అడ్డుకొనేందుకు రష్యా దీనిని వాడుతోంది.

ప్రపంచంలో ఇప్పటివరకు రష్యా, చైనా, టర్కీలు వీటిని వినియోగిస్తున్నాయి. విభిన్నమైన రాడార్లు, క్షిపణులు సమన్వయంతో పనిచేసి ప్రత్యర్థుల ఫైటర్ జెట్స్, రాకెట్లు, మానవరహిత విమానాలను కూల్చేసే ఒక వ్యవస్థ ఇది. ఒక్క ముక్కలో చెప్పాలంటే వివిధరకాల ఆయుధాలను సమ్మిళితం చేసిన ఓ ప్యాకేజ్ అన్నమాట. దీనిని 2007లో రష్యా సైన్యంలోకి ప్రవేశపెట్టింది. అదే ఏడాది జులైలో ఆకాశంలో సెకన్‌కు 2,800 మీటర్ల వేగంతో వస్తున్న రెండు లక్ష్యాలను 16 కిలోమీటర్ల ఎత్తున ఎస్–400 ఛేదించినట్లు రష్యా పేర్కొంది.




శ్రీనగర్: భారత్–పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శ్రీనగర్‌లోని షేర్–ఇ–కశ్మీరీ వ్యవసాయ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇందులో 300 మందికిపైగా విద్యార్థులు ఉండగా.. వీరిలో పలువురు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉన్నారు. సరిహద్దుల్లో బాంబుల మోతతో ఆందోళన చెందుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. తమను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఏపీ, తెలంగాణ విద్యార్థులు లేఖ రాశారు. దీంతో కేంద్ర మంత్రి తక్షణమే స్పందించారు. జిల్లా కలెక్టర్, వర్సిటీ డీన్‌తో మాట్లాడారు. సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు. దీంతో ఏపీ, తెలంగాణ, తమిళనాడుకు చెందిన మొత్తం 23 మంది విద్యార్థులను బస్సుల్లో శ్రీనగర్ నుంచి దిల్లీకి పంపించారు. అక్కడి నుంచి స్వస్థలాలకు చేరుకోనున్నారు.

# చురకలు

## సంపాదకీయం

# అతి పెద్ద చర్చ

## అణు యుద్ధం వస్తుందా ?

ఈ రోజున ప్రపంచం మొత్తం ఘర్షణల్లో నిండి ఉంది. ఎవరికి వారుగా తాము అభివృద్ధి చెంది సుఖపడలేక పక్కవారిని కెలుకుతూ చాలా సులువుగా యుద్ధాలను తెస్తున్నారు. భారత్ కి పాక్ తో సమస్యలు ఈనాటివి కావు. పాక్ ఆవిర్భవించిన తర్వాత నుంచి అనుకోవాలి. భారత్ నుంచి వేరుపడిపోతామని చెప్పిందే ఒక వర్గం. వారు కోరుకున్నట్లుగానే దేశం ముక్కలు అయింది. ఆ తర్వాత ఎవరి బతుకు వారు అన్నట్లుగా ఉండాలి. కానీ పాక్ ఆగస్టులో విడిపోయి అక్టోబర్ నాటికల్లా కాశ్మీర్ మీద యుద్ధం ప్రకటించింది. అలా మూడవ వంతు భూభాగాన్ని తీసుకుని ఈ రోజుకీ అక్కడ దర్జా చేస్తోంది దానికి ఉగ్రవాదులకు స్వర్గధామంగా మార్చి భారత్ మీదకు ఉసిగొలుపుతోంది. ఇదిలా ఉంటే భారత్ ఎపుడూ తానుగా ఏ దేశం మీదకు యుద్ధానికి వెళ్ళదు. తన మీదకు ఎవరైనా దాడి చేస్తే ప్రతి దాడికి వెళ్తుంది. అది తెలిసి పాక్ భారత్ ని పదే పదే కవ్విస్తూ ఉంటుంది. పహల్గాం దాడి అందులో భాగమే. ఇక భారత్ ఎంతో సంయమనం పాటిస్తూ వచ్చింది. ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ పాక్ లోని ఉగ్ర వాద శిబిరాల మీదనే దాడి చేసింది. అది కూడా ఎక్కడా ఒక పౌరుడి ప్రాణం కానీ ఆస్తి కానీ నష్టపరచుకుండా చేసింది. అయితే అదే తప్పు అయిపోయినట్లుగా భారత్ మీద పాక్ యుద్ధాన్ని ప్రకటిస్తోంది దాంతో భారత్ కూడా ప్రతి దాడులు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో భారత్ చేతిలో పాక్ చావు దెబ్బ తింటోంది. ఎంత పెద్ద ఎటాక్ చేసినా దానిని భారత్ వైపు నుంచి నిర్వీర్యం చేస్తూ వస్తున్నారు. దీంతో దాయాదిలో అసహనం అంతకంతకు పెరిగిపోతోంది. ఏమి చేయాలో తెలియక ప్రతీకారేచ్ఛతో రగులుతోంది. ఇదిలా ఉంటే తమ వద్ద అణ్వస్త్రాలు ఉన్నాయని పాక్ పదే పదే బెదిరిస్తూ వస్తోంది. తాము వాటిని భారత్ కోసమే సిద్ధం చేసి ఉంచుకున్నామని వంకర మాటలు అనేకం మాట్లాడుతూ వస్తోంది. ఇవన్నీ ఇలా ఉంటే పాక్ ఒక్కటే అవతల వైపు నుంచి యుద్ధం లో పాల్గొంటే దాని ఆలోచనల వరకూ అయితే ఫర్వాలేదు. కానీ దానికి ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ మరో దేశం కనుక కలిసి వస్తే అపుడు యుద్ధ స్వరూపమే మారిపోతుంది అని అంటున్నారు. ఒకనాడు సంప్రదాయ పద్ధతిలో యుద్ధం జరిగేది. ఇపుడు టెక్నాలజీ సాయంతో యుద్ధం చేస్తున్నారు. ఇక ముందు ఏమిటి అంటే అణ్వాయుధాల వాడకమే అని అంటున్నారు. అయితే అణు యుద్ధం కడు ప్రమాదకరం. అది ఏకంగా మారణ హోమమే సృష్టిస్తుంది. దానికి ఇప్పటికి 80 ఏళ్ళ క్రితం జపాన్ లోని హిరోషిమా నాగసాకీల మీద పడిన అణు బాంబులే సాక్ష్యమని అంటుంటారు. అణు బాంబులు కనుక ఏ దేశం ప్రయోగించినా దాని దుష్పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. ఆ దేశం పూర్తిగా నష్టపోతుంది. అక్కడ భూభాగం సర్వనాశనం అవుతుంది. కనీసం పచ్చని మొక్క మొలవడానికి సైతం చాలా కాలం పడుతుంది. ఇక అణు బాంబు ప్రయోగిస్తే కనుక దాని రేడియేషన్ ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. అది కిలోమీటర్ల దూరం వరకూ వ్యాపిస్తుంది. దానితో కూడా ప్రజలు ప్రాంతాలు పూర్తిగా నష్టపోతాయి. ఇవన్నీ ఆలోచించుకున్నపుడు ఎవరికైనా భయం కలుగుతుంది. భారత్ పాక్ ల మధ్య యుద్ధం అన్నది ఇపుడు జరుగుతోంది ట్రెడిషనల్ గా అని భావించకూడదు. రెండు దేశాలు అణ్వాయుధాలు కలిగినవే అని అంతా గుర్తు చేస్తున్నారు. అయితే గత్యంతరం లేని పక్షంలో ఏ దేశం అయినా అణ్వాయుధాలను వాడుతుంది. పైగా అణ్వాయుధాలు వాడడం అంటే మారణహోమాన్ని కోరి ఆహ్వానించడమే. ఉన్మాద మనస్తత్వంలో ఉన్న వారు అలాగే చేస్తారు. బాధ్యతాయుతమైన వారు ఆ పరిస్థితి తెచ్చుకోరు. మరి పాక్ లో బాధ్యత ఎంత వరకు ఉంది అన్నది చూస్తే అందరికీ అక్కడే అనుమానాలు వస్తున్నాయి. ఏది ఏమైనా భారత్ పాక్ ల మధ్య యుద్ధం ఈసారి భీకరంగానే సాగుతుంది అని అంటున్నారు. పాక్ అనే సమస్యకు ఫుల్ స్టాప్ పెట్టాలని భారత్ చూస్తోంది. అదే విధంగా భారత్ ని గతంలో కంటే ఎక్కువగా దెబ్బతీయాలని పాక్ తన పగతో ఆలోచిస్తోంది. సో ఈ యుద్ధం ఎంతవరకూ సాగుతుంది ఏ పరిణామాలకు దారి తీస్తుంది అన్నది మాత్రం ఎవరూ ఊహించలేకుండా ఉన్నారు.

# మే 11...జాతీయ సాంకేతిక దినోత్సవం

భారత దేశంలో జాతీయ సాంకేతిక దినోత్సవం (జాతీయ సాంకేతిక పరిజ్ఞాన దినోత్సవం) ప్రతి సంవత్సరం మే 11న భారతదేశ సాంకేతిక పురోగతికి సూచకంగా నిర్వహించ బడుతుంది. భారతదేశం 1944 లో సొంత అణు కార్యక్రమాన్ని ప్రారంభించింది. క్రమానుగత పరిశోధన, ఆవిష్కరణల ద్వారా దేశంలో మొట్టమొదటి అణు పరీక్షలను 1974లో నిర్వహించారు. ఆ తర్వాత చాలా కాలానికి అంటే సుమారు 24 ఏళ్ల తర్వాత రెండవ అణు పరీక్షలు జరిగాయి. భారత సైన్యం 1998, మే 11న రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలో రెండవ అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించారు. దీన్నే పోఖ్రాన్-%××% (ఐదు న్యూక్లియర్ బాంబుల విస్ఫోటనాల పరీక్షల వరుస) అంటారు. అప్పటి ఏరోస్పేస్ ఇంజనీర్ డా.అబ్దుల్ కలాం నిర్వహించిన మన మొదటి దేశీయ విమానం హంస-3 పరీక్షలు, త్రిశూల్ క్షిపణులు, ఆపరేషన్లు విజయవంతంగా పరీక్షించబడ్డాయి. ఈ విజయానికి గుర్తుగా భారత దేశాన్ని అణు దేశంగా ప్రకటించడమే కాకుండా మే 11వ తేదీని జాతీయ సాంకేతిక దినోత్సవంగా ప్రకటించి, అధికారికంగా సంతకం చేశారు. అలా జాతీయ సాంకేతిక దినం(టెక్నాలజీ డే)గా జరుపు కుంటున్నారు. అణు శాస్త్ర మరియు సాంకేతిక పరిజ్ఞానంలో అభివృద్ధి చెందిన దేశంగా మన దేశానికి గుర్తింపు తేవడంలో రాజా రామన్న పాత్ర అద్వితీయం. భారత దేశం శాస్త్ర, సాంకేతిక రంగాలలో సంచలన విజయాలు సాధించడంలో, అద్భుతమైన ప్రగతిని సాధించడంలో కీలకపాత్ర వహించిన వారిలో డాక్టర్ రాజారామన్న ఒకరు. భారతదేశం అణుబాంబును తయారు చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఇందిరా గాంధీ హయాంలో భారత దేశం 1974 మే 18 తేదీన జరిపిన అణు పరీక్ష అప్పట్లో ఒక సంచలనం. దాని వెనక రామన్న కృషి అసమానం. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు భారత దేశపు మొట్టమొదటి భూగర్భ అణు పేలుడులో రాజా రామన్న కీలక పాత్ర పోషించారు. అణు పేలుడు పరికరం తయారీకి వెళ్ళే వివిధ విభాగాలలో నైపుణ్యం ఉన్న అనేక బృందాలను ఆయన కలిసి తీసుకు వచ్చారు. రాజస్థాన్ ఎడారిలో పోఖ్రాన్ వద్ద జరిపిన ఈ అణు పరీక్ష ఫలితంగా అమెరికా, యూరోపియన్ దేశాలు ఇండియాపై ఆంక్షలు విధించాయి. ఇండియా పట్ల అణు అంటరాని తనాన్ని పాటించాయి. తాము ఒక పక్క అణ్వస్త్రాలను గుట్టలుగా పేర్చుకుంటూనే ఇండియా లాంటి మూడో ప్రపంచ దేశాలు అణ్వస్త్రాలు సమకూర్చు కోవడానికి




వీలు లేదని శాసించాయి. భారత దేశ మొట్ట మొదటి అణు బాంబు నిర్మాణం దేశంలో కూడా రహస్యంగానే సాగింది. బాంబు రూపకల్పన, నిర్మాణం, పరీక్షలలో పాల్గొన్న రాజా రామన్న, పికె అయ్యంగార్, రాజగోపాల చిదంబరం, ఇతరుల నేతృత్వంలో 75 మంది శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల బృందం 1967 నుండి 1974 వరకు దీనిపై పనిచేసింది. 75 మంది శాస్త్రవేత్తలకు (బార్క్ అధిపతి రాజా రామన్న నాయకుడు) తప్ప భారత మంత్రులకు ఎవరికీ బాంబు నిర్మాణం అవుతున్న సంగతి తెలియదు. శాస్త్రవేత్తలు కాకుండా భారత ప్రధాని ఇందిరాగాంధి, ఆమె సలహాదారు మరియు అప్పటి మాజీ ప్రిన్సిపల్ కార్యదర్శి పి.ఎన్.హక్సర్, అప్పటి ప్రిన్సిపల్ కార్యదర్శి డి.పి.ధర్ లకు తప్ప రక్షణ మంత్రికి కూడా బాంబు సంగతి తెలియదు. 1972 సెప్టెంబరులో బార్క్ సందర్శించిన ఇందిర నోటిమాటతో బాంబు నిర్మాణానికి, పరీక్షకు ఆదేశాలు ఇచ్చారని భావించ బడింది. 1997లో డాక్టర్ రాజా రామన్న స్వయంగా పోఖ్రాన్ లో పేల్చింది అణు బాంబే అని చెప్పేవరకూ అధికారికంగా దాని గురించి తెలియక పోవడం గమనార్హం. ఇక 1998 మే 11న పోఖ్రాన్-%××% పరీక్షల్లో ఐదు విస్ఫోటనాలు జరిగాయి, మొదటిది ఫ్యూజన్ బాంబు కాగా మిగిలినవన్నీ ఫిషన్ బాంబులు (అణువిచ్ఛిత్తి బాంబులు). ఆపరేషన్ శక్తి పేరిట ఒక ఫ్యూజన్ బాంబు, రెండు ఫిషన్ బాంబుల విస్ఫోటనంతో పరీక్షలు 1998 మే 11న ప్రారంభ మయ్యాయి. 1998 మే 13న అదనంగా మరో రెండు ఫిషన్ బాంబులు కూడా విస్ఫోటనం చేశారు. కొద్దిసేపటికి ఆనాటి భారత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి ఆధ్వర్యంలోని భారత ప్రభుత్వం ఒక పత్రికా సమావేశం నిర్వహించి భారతదేశం పూర్తి-స్థాయి అణ్వస్త్ర దేశమని ప్రకటించింది. ఈ పరీక్షల కారణంగా తర్వాత జపాన్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు సహా పలు ప్రధాన దేశాలు భారతదేశంపై రకరకాల ఆంక్షలు విధించాయి. అలా భారత దేశం విజ్ఞాన శాస్త్ర మేధావుల అకుంఠిత కార్యదీక్ష అంకితభావం అన్నిటికీ మించి చిత్తశుద్ధితో చేసిన కృషి వల్ల శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణనీయ అభివృద్ధి సాధించ గలిగింది. నాటి రాతియుగం నుంచి నేటి రాకెట్ యుగం వరకు జరిగిన మానవ అభివృద్ధి పరిణామ క్రమంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన క్రమాభివృద్ధిదే కీలక పాత్ర. నేడు శాస్త్ర సాంకేతిక రంగమే ప్రపంచాన్ని శాసిస్తున్నది. అభివృద్ధి అంతా సైన్స్ పైనే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం శాస్త్ర సాంకేతిక విద్యా రంగంలో ...విషయ ప్రాధాన్యం నుంచి ఉత్పత్తి ప్రధాన విద్య దిశగా మార్పు చోటుచేసు కుంటోంది. ఇటీవలి కాలంలో భారత్‌లో సాంకేతిక విద్యా సంబంధ కళాశాలల సంఖ్య శరవేగంగా పెరిగింది. ఐఐటీలు, మరికొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థలు మినహా దేశంలోని అత్యధిక శాతం ప్రైవేటు సాంకేతిక కళాశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించలేక పోతున్నాయి. పలక బలపం పెన్ను పెన్సిల్ బ్లాక్ బోర్డ్ కనుమరుగు అవుతూ, పాఠ్య పుస్తకాల స్థానంలో ఈబుక్స్, టాబ్ ల ద్వారా విద్యాబోధన జరుగుతున్న నేటి విద్యా వ్యవస్థలో, సాంకేతికత వలన అందరికి అందుబాటులోకి వచ్చింది. చెప్పేవారు ఉంటే, ఏ సమయంలోనైనా ఆన్ లైన్ ద్వారా విద్య అభ్యసించ వచ్చు. అయితే సమకాలీన, సమాజ పరిస్థితులకు అనుగుణంగా బహుళ అంశాల సమన్వయ కూర్పుతో కూడిన సెలబస్, విద్య అనివార్యంగా మారింది. నేర్చుకునే విద్యలో నాణ్యత ఉండాలి. మేధాపరమైన నైపుణ్యాలను విజ్ఞానాన్ని అభివృద్ధి పరచడమే ప్రధానం కావాలి. తద్వారా యువ మేధావులు... నాణ్యమైన విద్య ఆర్జించి, నైపుణ్యాలు సాధించి, అంతర్జాతీయ వ్యవస్థలో నూతన ఆవిష్కర్తలుగా, సమర్థ నిర్ణాయకులుగా భాసిల్లి సమాజాభి వృద్ధికి దోహదపడ గలుగుతారనేది నూటికి నూరుపాళ్లు నిజం. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# బహుముఖ ప్రజ్ఞలు సర్దేశాయి తిరుమల రావు - మే 11... సర్దేశాయి వర్ధంతి



ఒకవైపు నిరంతర పరిశోధనలు, మరోవైపు సాహిత్య రంగంలో విశేష కృషి, పరిశోధనల ద్వారా పేటెంటు హక్కులు పొందడం, నిరంతర రచనా వ్యాసంగం, అనితర సాధ్యమైన ప్రతిభ ఒక్కరికే సొంతం. అవి సాధించిన వాడు తెలుగు వాడు కావడం గర్వకారణం. ఆయనే అచ్చ తెలుగు వారైన సర్దేశాయి తిరుమల రావు. ఆయన జీవితం పలు ప్రత్యేకతల సమాహారం. 1954లో తైల సాంకేతిక పరిశోధనా సంస్థలో కెమిస్టుగా కెరీర్ ను ప్రారంభించి, 1983 జూలై 31న డైరెక్టర్ గా పదవీ విరమణ చేసేంత వరకూ సర్దేశాయి తిరుమలరావు ఒక్కరోజు కూడా సెలవు తీసుకోక పోవడం గమనార్హం. ఆయన పేరిట తైలసాంకేతిక రంగంలో పదకొండు పేటెంట్లు ఉండడం విశేషం. సంస్థ కేంద్ర ప్రభుత్వం యేటా ఉత్తమ పరిశోధనా సంస్థలకు ఇచ్చే బహుమతులలో ఐదు సార్లు బంగారు పతకాన్ని, పది సార్లు రజత కాంస్య పతకాలను గెలుచు కోవడం సామాన్యమైన విషయమేమీ కాదు. జాతీయ, విదేశీయ పత్రికలలో తైల సాంకేతికత మీద ఐదు వందలకు పైగా పరిశోధనా, సిద్ధాంత వ్యాసాలు వ్రాయడం ఆయనకే సుసాధ్యమైంది. సర్దేశాయి తిరుమల రావు ( నవంబర్ 28, 1928 – మే 11, 1994) వృత్తిరీత్యా తైల పరిశోధనా శాస్త్రవేత్త. ప్రవృత్తిరీత్యా సాహితీ విమర్శకుడు. ఆజన్మ బ్రహ్మచారి. కర్నూలు జిల్లా జోహరా పురంలో పేద మధ్వ బ్రాహ్మణ కుటుంబంలో కృష్ణవేణమ్మ, నరసింగరావు దంపతులకు 1928, నవంబర్ 28న జన్మించారు. అయన పూర్వీకుడు వెంకన్న పంతులు ఆదోని నవాబు దగ్గర మంత్రిగా పనిచేసి మంత్రాలయంలో రాఘవేంద్ర మఠం స్థాపనకు తోడ్పడిన వారు. ఆదోని, అనంతపురం లలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో, అనంతపురం దత్త మండల కళాశాల, తరువాతి కాలంలో గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాలలో చదివారు. 1954లో రాజస్థాన్ రాష్ట్రం పిలానికి చెందిన బిర్లా ఇన్స్టిట్యూట్‌నుండి ఎం.ఎస్.సి. కెమిస్ట్రీ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యారు. 1954లో తైల సాంకేతిక పరిశోధనా సంస్థలో కెమిస్టుగా కెరీర్ ను ప్రారంభించి, 1983 జూలై 31న డైరెక్టర్ గా పదవీ విరమణ గావించారు. ఇదిలా ఉంటే ఆయన చేసిన సాహిత్య సేవ ఎనలేనిది. ప్రతి రచననూ విమర్శనాత్మక దృష్టితో చూసేవాడు. కన్యాశుల్క నాటక కళ, సాహిత్య తత్త్వము – శివభారత దర్శనము అనే పుస్తకాలను రాశారు. మాలపల్లి మీద రచన పూర్తి చేయకుండానే ఆయన 11, 1994లో కన్నుమూశారు. ఆయన విమర్శకు గుర్తింపుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం 1989లో తిక్కవరపు రామిరెడ్డి స్మారక పురస్కారాన్ని ఇచ్చింది. అయన సాహిత్య కృషిని గుర్తించి శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయం 1989లో గౌరవ డాక్టరేట్ (డి.లిట్) ప్రదానం చేసింది. విమర్శలు మాత్రమే కాకుండా సృజనాత్మక రచనలు కొన్ని చేశారు. వాటిలో 'పద్మావతీ చరణచారణ చక్రవర్తి', 'పగచిచ్చు' అనే నాటికలు, 'భూసూక్తము' అనే కథా ఉన్నాయి. అయన విషయ పరిజ్ఞానానికి, విమర్శనాదృష్టికి, అభిరుచికి అద్దం పట్టే కొన్ని చర్చలు ఇలా ఉన్నాయి. అంతేగాక భారతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ది హిందు, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, బ్లిట్జ్,సైన్స్‌టుడే మొదలైన పత్రికలలో సాహిత్య, సాహిత్యేతర అంశాలపై ఎన్నో వ్యాసాలు, ఉత్తరాలు వ్రాశారు. చర్చలు చేశారు. అసలు పేరుతో పాటుగా 'తి', 'నిశ్శంకతిమ్మణ్ణ', 'పైథోగొరస్' మొదలైన తొమ్మిది కలంపేర్లతో రచనలు చేశారు. భారత,రామాయణ,భాగవతముల ఆద్యంతముల ఆంతర్యముబీ తిక్కన స్త్రీపర్వములోని ఛందో వైవిధ్యములోని ఆంతర్యముబీ వేదవ్యాసుడు బ్రాహ్మణేతరుడా? కన్యాశుల్కంలో అసభ్యత ఉన్నదా?బీ హిమలేహ్యం – శేషేంద్ర జాలంబీ మినీకవిత – మాక్సీ వ్యాఖ్యబీ తెలుగు మీద కన్నడ ప్రభావ మెంత? మాలపల్లి పై ఈస్టలిన్ ప్రభావం కలదా? లాంటి వ్యాసాలను వివిధ పత్రికలలో ప్రచురించారు. తెలుగు విశ్వ విద్యాలయం రాచపాళెం చంద్రశేఖరరెడ్డి సంపాదకత్వంలో సర్దేశాయి తిరుమలరావు విమర్శ వ్యాసాలను విమర్శ – ప్రతివిమర్శ పేరుతో ప్రకటించింది. 1965 ప్రాంతం నుండి 1994లో కన్నుమూసేంత వరకూ భారతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ది హిందు, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలలో రాసిన వ్యాసాలను, లేఖలను, సాహితీ విమర్శలను సేకరించి జ్ఞానసింధు సర్దేశాయి తిరుమలరావు అనే పుస్తకంగా తీసుకొచ్చారు.
**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# ప్రపంచ అహంకార అవగాహన దినోత్సవం: అంతర్ముఖతకు ఆహ్వానం

## మే 11...ప్రపంచ అహంకార అవగాహన దినోత్సవం సందర్భంగా




అహంకారం ... ఇది మనిషి మనోభావాల్లో అత్యంత కీలకమైన, సున్నితమైన భావన. 'నేను' అనే భావంతో మొదలయ్యే వ్యక్తిత్వ బలాన్ని నిర్మించడంలో ఇది ఒక భాగం. సరియైన పరిమితిలో ఉండే అహం మనిషికి ఆత్మ విశ్వాసాన్ని, లక్ష్య సాధనకు ప్రేరణను అందించగలదు. కానీ అది మితి మీరినపుడు, మన జీవితంలోని అనేక రంగాల్లో %-% వ్యక్తిగతంగా, కుటుంబంగా, సామాజికంగా – సమస్యలకు కారణమవుతుంది. ఇతరుల పట్ల తక్కువ తనాన్ని కలిగించే ధోరణి, అభిప్రాయాల నిరాకరణ, స్వార్థం, అసూయ, కోపం వంటి భావోద్వేగాలు అహంకార ప్రభావంతోనే కలుగుతాయి. ఈ నేపథ్యంలో, ప్రతి సంవత్సరం మే 11న జరుపుకునే 'ప్రపంచ అహంకార అవగాహన దినోత్సవం' మనలోని అహంకారాన్ని గుర్తించి, దానిపై చైతన్యం కల్పించేందుకు ఒక ప్రత్యేక అవకాశం. 2018లో ప్రారంభమైన ఈ దినోత్సవం అంతర్జాతీయ మానసిక ఆరోగ్య సంస్థలు, మైండ్‌ఫుల్‌నెస్ ఉద్యమాలు మద్దతు నిచ్చిన చైతన్య వంతమైన కార్యక్రమంగా అభివృద్ధి చెందింది. ఇది వ్యక్తిగత వికాసానికి, సామాజిక సఖ్యతకు అడ్డుకాదని, దానిపై అవగాహన పెంచుకుంటే మన జీవితం మరింత సమతుల్యంగా, సంతోషకరంగా ఉండగలదని ఈ దినోత్సవ సందేశం. అహం ప్రతి మనిషిలో ఉంటుంది. అది ఉన్నంతవరకు వ్యక్తిత్వం ఉంటుంది. కానీ అహంకారం మారినపుడు, అది వ్యక్తిగత బలాన్ని కాక, బలహీనతగా మారుతుంది. ఆ స్థితిలో మనం వినయం కోల్పోతాం, ఇతరులను అగౌరవంగా చూసే ధోరణి పెరుగుతుంది. ఆత్మపరిశీలన లేని జీవితం అహం చేత నడిపించబడుతుంది. అలాంటి జీవితంలో స్నేహాలు బలహీనపడతాయి, బంధాలు తెగిపోతాయి, ఒంటరితనం పెరుగుతుంది. సామాజికంగా అహంకారం ఉన్న చోట అధికార సంస్థలు ప్రజలతో దూరంగా మారుతాయి. మాటల్లో గర్వం, ప్రవర్తనలో అహం ఉంటే ప్రజాస్వామ్య సంస్కృతి బలహీనమవుతుంది. మానవ సంబంధాల్లో సహనం, వినయం, పరస్పర గౌరవం కోల్పోతే సంక్షోభం తప్పదు. ఆధ్యాత్మికంగా చూస్తే కూడా అహంకారం మోక్షానికి అడ్డంకిగా పరిగణించబడుతుంది. ఉపనిషత్తులలో చెప్పిన "అహం బ్రహ్మాస్మి" అన్న వాక్యం ఆత్మజ్ఞానాన్ని సూచించినా, దాన్ని గర్వంగా అర్థం చేసుకుంటే అది ముక్తికి తలపెట్టి మార్గాన్ని మూసేస్తుంది. ఈ దినాన్ని సరైన ఉద్దేశంతో జరుపు కోవాలంటే మనకు కొన్ని సాధనాలు అవసరం. ముఖ్యంగా ధ్యానం, యోగా వంటి మనస్సు నిలిపే ప్రయత్నాలు మనలోని భావోద్వేగాలను విశ్లేషించేందుకు ఉపయోగపడతాయి. ప్రతి రోజు మన ప్రవర్తనను పరిశీలించుకోవడం %-% 'ఈ సందర్భంలో నేను అహంకారంతో ప్రవర్తించానా?' అనే ప్రశ్న వేయడం %-% మనలో అంతర్ముఖత పెంపొందించేందుకు దోహద పడుతుంది. వినయంగా ఇతరులను గౌరవించడం, వారి అభిప్రాయాలను అంగీకరించడం కూడా అహంకారాన్ని తగ్గించే ప్రయత్నమే. అలాగే సానుభూతి %-% మన చుట్టూ ఉన్నవారి బాధలను అర్థం చేసుకోవడం, సహాయం చేయడం %-% మానవీయ విలువలను పెంపొందిస్తుంది. ఈ దినోత్సవం గురించి ఇతరులకు తెలియజేయడం కూడా ఎంతో ముఖ్యం. సామాజిక మాధ్యమాల్లో, బహిరంగ చర్చల్లో, వర్క్‌షాప్‌ల ద్వారా ఈ విషయాన్ని ప్రచారం చేయవచ్చు. ఇదంతా మనకు ఒక్కరోజు గుర్తుండటానికి కాదు %-% జీవితాంతం ఆచరించాల్సిన జీవన వెలుగు. ఎందుకంటే అహంకారం ఎప్పుడూ మనల్ని పరీక్షిస్తూ ఉంటుంది. దానిపై అవగాహన కలిగి ఉండటం ద్వారా మన వ్యక్తిత్వాన్ని మెరుగు పర్చుకోవచ్చు. ఈ దినోత్సవం మనల్ని మనల్ని పరిశీలించుకునే మార్గానికి ఆహ్వానం ఇస్తుంది. అహంకారాన్ని నిర్మూలించ లేవేమో కానీ, దానిని గుర్తించి, నియంత్రించడం మన చేతుల్లోనే ఉంది. వినయం, జ్ఞానం, సానుభూతి అనే మానవ విలువలతో ముందుకు సాగితే – మన జీవితం మాత్రమే కాక, మన చుట్టూ ఉన్న సమాజం కూడా శాంతియుతంగా, సమతుల్యంగా మారగలదు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ఎదురు చూపులు.. ఎన్ని రోజులు

కోనరావుపేట : ఆరుగాలం కష్టపడి పంట సాగుచేసిన రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించి లబ్ధిపొందడానికి కొనుగోలు కేంద్రాలను ఆశ్రయించారు. తూకాల్లో జాప్యం, లారీల కొరత కారణంగా ఆశించిన మేర కొనుగోళ్లు జరగడం లేదు. దీనికి తోడు ఆకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు వర్షానికి తడవకుండా కాపాడుకోవడానికి వారు నానా తంటాలు పడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి కుటుంబ సభ్యులందరూ శ్రమిస్తున్నారు. జిల్లాలో యాసంగిలో 1.78 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. రైతులకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 244 ఇందిరా క్రాంతి, పీఏసీఎస్, మార్కెట్‌యార్డు, డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దొడ్డురకం ధాన్యం క్వింటాలుకు రూ.2,320, సన్న రకానికి రూ.2,320, బోనస్ రూ.500లను ప్రభుత్వం ప్రకటించింది. వరికోతలు పూర్తి చేసి పక్షం రోజులు గడిచింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. తూకాల్లో జాప్యం, లారీల కొరత రైతులకు ఇబ్బందిగా మారింది. అకాల వర్షాలతో పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవుతోంది. భారీ ఈదురుగాలులకు టార్పాలిన్లు ఎగిరిపోతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



**సమస్యలు పరిష్కరిస్తాం**

సన్నధాన్యం తూకానికి రైతులకు అనుమతులిచ్చాము. సీరియల్ నంబర్లు కేటాయించి గన్నీ సంచులు అందజేశాము. సన్నధాన్యానికి ప్రత్యేకించి మిల్లులు కేటాయించలేదు. దొడ్డు రకం దిగుమతికి అనుమతించిన మిల్లులకే సన్నధాన్యం పంపించమని చెప్పారు. ఆకాల వర్షంతో తూకాల్లో జాప్యం నెలకొంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

కేశవులు, సీఈవో, పీఏసీఎస్ కోనరావుపేట

**లారీల కొరత**

మాది ఉమ్మడి కుటుంబం. మా ఇద్దరు కుమారులు చెరో అయిదు ఎకరాల్లో వరిసాగు చేయగా ఐకేపీ కొనుగోలు కేంద్రంలో తూకాలు వేశారు. మేము రెండు ఎకరాల్లో వరిసాగు చేయగా సేకరించిన ధాన్యాన్ని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి తరలించాము. అకాల వర్షానికి ధాన్యం తడిసింది. ఆరబోయడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాం. ధాన్యం తరలింపునకు లారీల కొరత నెలకొంది.

అనుముల లక్ష్మి, మహిళా రైతు, నిమ్మపల్లి

నిల్వలు పేరుకు పోయాయి

నాకున్న వ్యవసాయ భూమితో పాటు మరో అయిదెకరాలు కౌలుకు తీసుకొని యాసంగిలో వరిసాగు చేశాను. 20 రోజుల క్రితం వరిపంట నూర్పిడి చేశాను. ప్రభుత్వం సన్న ధాన్యానికి అందించే బోనస్ రూ.500 లు సద్వినియోగం చేసుకోవడానికి కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తరలించాము. కొనుగోలు కేంద్రంలో నిల్వలు పేరుకుపోయాయి. మాకు ఎదురుచూపులు తప్పడం లేదు.

ముదాం వెంకటేశం, రైతు, కోనరావుపేట

# నిధులు వెచ్చించినా.. నిరుపయోగం

వేములవాడ గ్రామీణం : రైతులు, గ్రామస్థుల సౌలభ్యం కోసం రూ.లక్షలు వెచ్చించి గ్రామ సంత నిర్మాణం చేపట్టారు. కొంతకాలం గ్రామసంతలో క్రయ విక్రయాలు జరిగినా తరువాత ఆదరణ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. రాజరాజేశ్వర జలాశయం(మధ్యమానేరు)లో చింతల్‌ఠాణా గ్రామం ముంపునకు గురైంది. గ్రామంలో వ్యవసాయ భూములు, ఇళ్లు కోల్పోవడంతో నిర్వాసితులుగా మారారు. వీరికి మండలంలోని ఆర్టీసీ బస్సు డిపో ఎదురుగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేశారు.

భారీగా కేటాయించినా..మధ్యమానేరు జలాశయంలో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో గ్రామ



సంత నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.10 లక్షలు, గ్రామపంచాయతీ నిధులు రూ.8 లక్షలు వెచ్చించారు. వేములవాడ సిరిసిల్ల ప్రధాన రహదారికి సమీపంలో కాలనీలో ఎకరం స్థలం కేటాయించి గ్రామసంత నిర్మాణం చేపట్టారు. ఇందులో 34 దుకాణాలను ఏర్పాటు చేశారు. గ్రామసంత ఏర్పాటుతో కూరగాయలు, నిత్యావసర సరకులను విక్రయించడం ద్వారా పలువురికి ఉపాధి లభించడంతోపాటు స్థానికులకు మార్కెట్ సదుపాయం కలుగుతుందని భావించారు. కాగా వారసంత మూణ్నాళ్లకే నిరుపయోగంగా మారింది. జలాశయంలో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు వ్యవసాయ భూములు లేకపోవడంతో పంటల సాగు లేక గ్రామసంతలో కూరగాయలు విక్రయించడం లేదు. కాలనీకి సమీపంలోనే వేములవాడ పట్టణం ఉండటంతో వివిధ పనులపై వెళ్లిన వారు నిత్యం తమకు కావాల్సిన సరకులు, కూరగాయలు తెచ్చుకుంటున్నారు.

**వినియోగంలోకి తీసుకురావాలి**

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్వాసితులకు స్థానికంగా వ్యవసాయ భూములు లేవు. సమీపంలోనే వేములవాడ పట్టణం ఉండటంతో చాలామంది అక్కడికే వెళుతున్నారు. దీంతో గ్రామసంత నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి గ్రామసంతను వినియోగంలోకి తీసుకరావాలి. నిర్వాసితులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.కాసారపు రాజేష్, గ్రామస్థుడుచర్యలు తీసుకుంటాం స్థానికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో గ్రామసంత నిర్మాణం చేపట్టారు. వివిధ కారణలతో నిరుపయోగంగా మారింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు గ్రామస్థులతో చర్చించి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. రాజీవ్ మల్హోత్రా, ఎంపీడీవో

# కలలు సాకారం.. కష్టాలిక దూరం



తాండూరు : కాగ్నా నదిలో మరో వంతెన నిర్మాణం కాబోతోంది. పూర్తయితే వర్షాకాలంలో నది మీదుగా సాఫీగా రాకపోకలు సాగించొచ్చు. సమీపంలోని గ్రామస్థుల పాతికేళ్ల కల సాకారం అవుతుంది. కొత్త వంతెన నిర్మాణ పనులకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో కథనం.

**వర్షాలొస్తే నిలిచిపోయే రాకపోకలు**

జిల్లాలోని కాగ్నా నది తాండూరు నియోజకవర్గంలోని గ్రామాల మీదుగా ప్రవహిస్తుంది. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే కాగ్నా ఉప్పొంగి రాకపోకలు స్తంభించిపోతాయి. దీన్ని అధిగమించేందుకు ఇప్పటికే తాండూరు మండలం నారాయణ్‌పూర్, వీర్‌శెట్టిపల్లి, గోనూరు, పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి, కందనెల్లి సమీపంలో, యాలాల మండలం రాశులపురం శివారులో భారీ వంతెనలు నిర్మించారు. దీంతో ఆయా మార్గాల్లో పంటల రవాణాకు, ప్రజలు వర్షాకాలంలోనూ ప్రయాణాన్ని సాఫీగా సాగించేందుకు దోహదపడింది. తాజాగా వీటి సరసన మరో వంతెన చేరుతోంది.

**మూడు మండలాలకు అనుసంధానం..**

కాగ్నా నదిపై మరో వంతెన నిర్మాణంతో తాండూరు, పెద్దేముల్, యాలాల మండలాలకు అనుసంధానంగా మారనుంది. ఈ మూడు మండలాల ప్రజలు పట్టణానికి వెళ్లకుండా వంతెన మీదుగా రాకపోకలు సాగించే వెసులుబాటు కల్గనుంది. బిజ్వార్, బొంకూరు వాసులు మంబాపూర్ వెళ్లాలంటే పట్టణం మీదుగా ఏకంగా 20 కి.మీ. ప్రయాణించాల్సి వచ్చేది. నూతన వంతెన, రహదారి నిర్మాణంతో కేవలం 3 కి.మీ. ప్రయాణంతో మంబాపూర్ వెళ్లొచ్చు.

**బిజ్వార్, బొంకూర్ మధ్యన..**

కాగ్నా నది ప్రవహించే బిజ్వార్, బొంకూర్ మధ్య నూతన వంతెన నిర్మాణానికి పనులు చేపట్టారు. గతేడాది బొంకూరు శివాలయానికి వచ్చిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి వంతెన నిర్మింపజేయాలని ప్రజలు విన్నవించారు. దృష్టిసారించిన ఎమ్మెల్యే పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్షించారు. వంతెన, తారు రహదారికి నిధులు విడుదల చేయించారు.

వంతెన ప్రదేశం: కాగ్నా నది

నిధులు: రూ.4.85కోట్లు

తారు రహదారి నిధులు: రూ.1.56కోట్లు

కి.మీ.: 1.6

గడువు: 6నెలలు

**పనులు వేగంగా నిర్వహిస్తాం..**కాగ్నా నదిలో నూతన వంతెన పనులు ప్రారంభింపజేశాం. వేగవంతంగా నిర్వహించి వంతెనను సమకూర్చుతాం. దీనికి అనుసంధానంగా ఉన్న మట్టి దారిలో తారు రహదారి కూడా అందుబాటులోకి తెస్తాం. వర్షాకాలంలో రాకపోకలకు సౌలభ్యం చేయిస్తాం.నాగభూషణం, డీఈ, పంచాయతీరాజ్ శాఖ, తాండూరు.

# పట్టు చేపట్టు.. లాభాలు వచ్చేట్టు



పరిగి: పట్టు పరిశ్రమ పట్ల జిల్లా రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వ సహకారం, అధికారుల ప్రోత్సాహం తోడవడంతో జిల్లాలో క్రమేపి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఒకప్పుడు పట్టుపరిశ్రమకు జిల్లా పెట్టింది పేరు. పూర్వస్థితికి తీసుకువచ్చేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. రానున్న వానాకాలం సీజన్‌కు అన్నదాతలను సమాయత్తం చేస్తున్నారు. 150 ఎకరాల్లో మల్బరీ తోటలు సాగు చేయాలని క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు.

**ఒక్కసారి నాటితే 15 ఏళ్ల వరకు దిగుబడి**

పెద్దేముల్ మండలం గాజీపూర్ వద్ద ఉన్న ప్రభుత్వ నర్సరీ నుంచి రాయితీపై రూ.2కే మొలకలను అందజేయనున్నారు. రెండెకరాల విస్తీర్ణానికి 10వేల మొలకలు అవసరం ఉంటాయి. వి-1 రకం మొలకలను ఐదారేళ్లుగా పంపిణీ చేస్తున్నారు.మొక్కలు నాటిన తరువాత మూడు నెలల అనంతరం పంట చేతికందుతుంది. పెట్టుబడిగా మొత్తంగా రూ.50వేలు వెచ్చిస్తే నెలకు రూ.1.5లక్షలకు పైగానే ఆదాయం వస్తుందని ఒకసారి నాటుకుంటే 15ఏళ్ల వరకు పంటను తీసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. కిలో పట్టుగూళ్ల ధరలు హైదరాబాద్‌లోని తిరుమలగిరి ప్రభుత్వ మార్కెట్లో రూ.400 నుంచి రూ.600 వరకు నాణ్యతను బట్టి అందుతున్నాయి. ఎకరాకు ఒక పంటకు 160 కిలోల వరకు దిగుబడి వస్తుంది.

పరిశ్రమవృద్ధి రాయితీలు ఇలా..

అన్ని వర్గాల వారికి సిల్క్ సమగ్ర -2 కింద రెండెకరాలకు నాటడానికి రూ.60వేలు.

షెడ్డు నిర్మాణానికి రూ.2.25లక్షలు

షెల్ఫ్‌లకు రూ.10,890

నాటేందుకు రూ.78వేలు, షెల్ఫ్‌లకు రూ.22,140 మంజూరు

మండలాలు - 20

ప్రస్తుత మల్బరీ సాగు - 200 ఎకరాలు

ఈసారి కొత్తగా లక్ష్యం - 150 ఎకరాలు

అందుబాటులో మార్కెట్ - తిరుమలగిరి, హైదరాబాద్

పట్టుగూళ్ల ధర కిలో రూ.500 - రూ.600

**రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యం**

స్వల్ప పెట్టుబడితో గణనీయమైన లాభాలు పొందవచ్చు. రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా పనిచేస్తున్నాం. రాయితీలు ఇతర సాంకేతిక సలహాలు, సూచనల కోసం 98857 83766 నంబరును సంప్రదించాలి.

హెచ్.విజయ్‌కుమార్, ఇన్‌ఛార్జి, ఏడీ, వికారాబాద్.

# ‘ఆదర్శ’ ప్రవేశాలకు ఆహ్వానం



కరీంనగర్ : కార్పొరేట్ స్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో బోధనకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆదర్శ పాఠశాలలు పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నాయి. 6-10వ తరగతితోపాటు ఇంటర్ విద్యను ఉచితంగా అందిస్తుండటంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో వీటిలో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 38 పాఠశాలలు**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2013 జూన్‌లో ఆదర్శ పాఠశాలలను ప్రభుత్వం ప్రారంభించింది. మొత్తం 38 పాఠశాలల్లో 6 నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్నారు. పదో తరగతితోపాటు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడంలో జిల్లాల వారీగా మిగిలిన ప్రభుత్వ విద్యాలయాలతో పోలిస్తే ఆదర్శ పాఠశాలలు ముందంజలో నిలిచాయి. ఫలితంగా తల్లిదండ్రులు తమ పిల్లలను వాటిల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వీటిలో 9, 10 తరగతులతోపాటు ఇంటర్ చదువుతున్న బాలికలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. వసతి గృహానికి 3 కి.మీల నుంచి ఆపై దూరంగా గలవారికి ఈ వసతి సదుపాయముంది.

**ప్రక్రియ ఇలా..**

ఉమ్మడి జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 20న చివరి తేదీగా ప్రకటించారు.

22న దరఖాస్తుల పరిశీలనతోపాటు ఎంపికైనవారి జాబితాను సిద్ధం చేయనున్నారు.

రిజర్వేషన్, మెరిట్ ఆధారంగా 26న ఎంపికైనవారి జాబితాను ప్రదర్శిస్తారు.

27 నుంచి 31వ వరకు విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలించి ప్రవేశాలు కల్పిస్తారు. జూన్ 2 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

ప్రతి గ్రూపులో 40 సీట్ల చొప్పున 4 గ్రూపుల్లో 160 మందికి ప్రవేశాలు కల్పిస్తారు.

పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేయనుండగా.. అల్పాదాయ వర్గాలవారికి ప్రాధాన్యతనిస్తారు.

# ఆట పాటలతో అక్షర విజ్ఞానం

పెద్దపల్లి : పిల్లల్లో మేధో వికాసం, సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ‘వేసవి సందడి’ కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. చిన్నారులకు ఆటపాటలతో కూడిన అక్షర విజ్ఞానాన్ని బోధిస్తున్నారు. చిట్టి చేతుల నుంచి అబ్బురపరిచే చిత్రాలు ఆవిష్కృతమవుతున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ నెల 1న వేసవి శిబిరాలు ప్రారంభం కాగా వచ్చే నెల 10 వరకు కొనసాగనున్నాయి. ప్రతి రోజూ ఉదయం 8-30 గంటల నుంచి 11.30 గంటల వరకు పిల్లలు సాధన చేస్తుండగా రోజువారీగా సీఆర్పీలు, ఎంఈవోలు పర్యవేక్షిస్తున్నారు.

**సృజనకు పదును**

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నారు. స్థానికంగా డిగ్రీ, ఆపై విద్యార్హతలున్న ఔత్సాహిక యువతను వాలంటీర్లుగా నియమించి బోధనపై శిక్షణ ఇచ్చారు. ప్రాథమిక స్థాయిలో తెలుగు, ఆంగ్లంతో పాటు గణితంలోని



చతుర్విద ప్రక్రియల్లో కనీస సామర్థ్యాలు మెరుగుపరుస్తున్నారు. తెలుగు, ఆంగ్లంలలో ధారాళంగా చదవడం, తప్పులు లేకుండా నల్లబల్లపై రాయించడం చేస్తున్నారు. చేతిరాత మెరుగుకు సాధన చేయిస్తున్నారు. పిల్లలకు ఇష్టమైన చిత్రలేఖనం, రంగురంగుల బొమ్మలు గీయడం, మేధస్సుకు పదును పెట్టేలా పజిల్స్ నేర్పిస్తున్నారు. నృత్యంపై మెలకువలు అందిస్తున్నారు.

**గ్రామీణ విద్యార్థులకు వరం**

జిల్లాలోని 280 పాఠశాలల్లో 2,190 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వేసవి శిబిరాలపై గ్రామీణ ప్రాంత పిల్లల్లో ఉత్సాహం కనిపిస్తోంది. తల్లిదండ్రులు కూడా ఆసక్తిగా పంపిస్తున్నారు. రోజువారీగా సీఆర్పీలు, ఎంఈవోలు పర్యవేక్షిస్తున్నారు. పట్టణ ప్రాంత విద్యార్థులు డబ్బులు చెల్లించి ప్రైవేటు శిబిరాలకు వెళ్తుండగా ఎలాంటి శిక్షణ శిబిరాలు లేని గ్రామీణ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. చాలా మంది పిల్లలు ఆకలితోనే వస్తున్నందున అల్పాహారం అందిస్తే మేలు చేకూరుతుంది.

**నృత్యం నేర్చుకుంటున్నా..**

తెలుగు, ఆంగ్లంలో ధారాళంగా చదవడం నేర్చుకుంటున్నా. వ్యాయామం, నృత్యంలో సాధన చేస్తున్నా. నల్లబల్లపై తప్పులు లేకుండా రాస్తున్నా. వివిధ అంశాలను ఆట పాటలతో నేర్పిస్తున్నారు. ఏకాగ్రతతో వింటూ విజ్ఞానం పెంచుకుంటున్నా. హాసిని, 2వ తరగతి, ప్రగతినగర్, పెద్దపల్లి

**ఆకట్టుకునేలా బొమ్మలు గీస్తున్నా**

నాకు బొమ్మలు గీయడం అంటే ఇష్టం. ‘వేసవి సందడి’ శిక్షణతో ఆకట్టుకునేలా గీస్తున్నా. తెలుగు, ఆంగ్లం, గణితంలలో నేర్పిస్తున్న మెలకువలు బాగుంటున్నాయి. నృత్యం నేర్చుకుంటున్నా. చదువుతో పాటు ఆటలు ఆడించడం ఉల్లాసంగా ఉంది.

అక్షయ, రొంపికుంట, కమాన్‌పూర్ మం.

సాధనతో చేతిరాత మెరుగైంది

ఉదయం రాగానే వ్యాయామం చేయిస్తుండటంతో రోజంతా మెదడు చురుగ్గా ఉంటోంది. గణిత చతుర్విద ప్రక్రియల్లో పట్టు పెంచుకుంటున్నా. సాధనతో చేతిరాత చాలా మెరుగైంది. అందరం కలిసి ఆటలు ఆడటం ఉత్సాహంగా ఉంది. అజిత్‌కుమార్, 5వ తరగతి, వెక్లాస్‌పూర్

# వేతనాలు వెచ్చిస్తూ.. వెతలకు గురవుతూ..

మెదక్ : వ్యవసాయశాఖ, శాస్త్రవేత్తల సేవలను రైతులకు మరింత చేరువ చేసే లక్ష్యంతో నిర్మించిన రైతు వేదికల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వహణకు ఏఈవోలు సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి క్లస్టర్ పరిధిలో ఒక రైతు వేదిక నిర్మించారు. మొదట్లో ఒక్కో దాని నిర్వహణకు రూ.3 వేలు ఇచ్చారు. అవి సరిపోకపోవడంతో వ్యవసాయశాఖ ప్రతిపాదనల మేరకు 2020 ఏప్రిల్ నుంచి రూ.9 వేల చొప్పున అందజేస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. 2022 నవంబరులో అయిదు నెలలకు కలిపి ఒక్కో రైతు వేదికకు రూ.45 వేలు చొప్పున రూ.34.20 లక్షలు విడుదలచేశారు. ఆ తర్వాత గత 29 నెలలుగా ఒక్క రూపాయి ఇవ్వలేదు. జిల్లాలో ఒక్కో రైతు వేదికకు రూ.2.61 లక్షల చొప్పున బకాయిలు రావాల్సి ఉంది. విద్యుతు బిల్లులు, పారిశుద్ధ్య నిర్వహణ, మరమ్మతులు, స్టేషనరీ, రైతు శిక్షణ, తాగునీటి సదుపాయం తదితరాలకు ఏఈవోలే తమ వేతనాల నుంచి భరిస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కోదానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల చొప్పున విద్యుత్తు బిల్లుల బకాయిలు పేరుకుపోయాయని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారి.. సహాయకులు అంతా వారే..:**

రైతు వేదికలకు సహాయకులు కూడా లేకపోవడంతో ఏఈవోలే అన్ని పనులు చేసుకుంటున్నారు. రోజూ తాళం తీయడం, గదులను శుభ్రం చేసుకోవడం, ఏవైనా సమావేశాలు ఉంటే ఏర్పాట్లు చేయడం అన్నీ ఏఈవోలే చేయాల్సి వస్తోంది. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, రైతులు సమావేశమై సాగు సమస్యలు, ఆధునిక పద్ధతులపై చర్చించేందుకు వీలుగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఒక రైతు వేదికను ఎంపిక చేసి, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఎలక్ట్రికల్ పరికరాల మరమ్మతులు, పరిసరాల శుభ్రత, పొదల తొలగింపు, శౌచాలయాల శుభ్రత, ఇతర ఖర్చులను ఏఈవోలే భరిస్తున్నారు.

**ధ్వంసమవుతూ...:**

రైతు వేదికలు గ్రామాలకు దూరంగా నిర్మించారు. వాటి నిర్మాణంలో పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాలను పాటించక పోవడంతో కొన్నిచోట్ల నిర్మించిన కొన్నేళ్లకే దెబ్బతింటున్నాయి. తలుపులకు పురుగు పడుతుండగా, గోడల రంగులు వెలిసిపోయాయి. వేదికల్లోని సౌండ్‌బాక్స్‌లు, కుర్చీలు, ఇతర పరికరాలు చోరీకి గురవుతున్నాయి. పలుచోట్ల కిటికీలు, టైల్స్ ధ్వంసమయ్యాయి. రాత్రిపూట మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. నీటి వసతి లేకపోవడంతో రైతులు, అధికారులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై జిల్లా ఇన్‌ఛార్జి వ్యవసాయశాఖ అధికారి వినయ్ విన్సెంట్‌ను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి నిర్వహణకు డబ్బులు రావాల్సి ఉందన్నారు.

చురకలు



# పట్టణం.. పనులు అసంపూర్ణం

కరీంనగర్ : పట్టణాలు, నగరాల్లో పెరుగుతున్న జనాభాకు తగ్గట్లుగా సౌకర్యాలు మెరుగు పడటం లేదు. ప్రధాన రహదారులు మినహాయిస్తే అంతర్గత రహదారులు, మురుగు నీటి కాల్వలు లేక బస్తీవాసులు అవస్థలు పడుతున్నారు. నిధులు కేటాయించి ప్రారంభించిన పనులు కూడా మధ్యలో వదిలేస్తుండగా.. ఏళ్ల తరబడి ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. చేసిన పనులకు బిల్లులు రావడం లేదని గుత్తేదారులు చెబుతుండగా.. వాటిని పూర్తి చేయాలనే ఆలోచన పురపాలక అధికారులకు ఉండటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని రెండు నగరపాలికలు, 13 పురపాలికల్లో ఇదే పరిస్థితి నెలకొనగా వచ్చే వర్షాకాలంలోపు వదిలేసిన అభివృద్ధి పనులు పూర్తి చేసేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపించాల్సిన అవసరముంది.

పరిస్థితి ఇదీ.. కరీంనగర్ నగరపాలికలో సీఎం హామీ (సీఎంఏ) నిధులు రూ.132 కోట్లతో 60 డివిజన్‌లలో 60 ప్రాంతాల్లో రహదారులు, మురుగు కాల్వలు నిర్మించేందుకు తవ్వి వదిలేశారు. కంకర పోసి వదిలేయడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. కొందరు రోడ్డు ఎత్తు చూసుకొని ర్యాంపులు కట్టుకుందామని అలాగే ఉంచడంతో ఇళ్లకు వెళ్లడం భారంగా మారింది. కల్వర్టులు నిర్మించకుండా వదిలేయడంతో మురుగు నీరు అక్కడే నిలిచి దుర్వాసన వస్తోంది. హుజూరాబాద్‌లోని ఇందిరా నగర్ కాలనీ, బృందావన్ కాలనీ, జమ్మికుంట రోడ్డు, డ్రైనేజీ సమస్యలు పరిష్కారం కావడం



లేదు. జమ్మికుంటలో రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించి 20 అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వర్షాకాలంలో పలు కాలనీల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రామగుండంకు ఏటా రూ.100 కోట్లు గత ప్రభుత్వం రెండేళ్లు మంజూరు చేసి వదిలేయగా అభివృద్ధి పనులు పునాదులకే పరిమితమయ్యాయి. టీచర్స్ కాలనీలో మురుగు దుర్గంధం ప్రధాన సమస్యగా మారింది.

పెద్దపల్లిలో రోడ్లు, మురుగు నీటి కాలువల పనులు నత్తనడకన సాగుతున్నాయి. సిరిసిల్లలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులతో టెండర్ పిలిచిన పద్మానగర్ రోడ్డు, డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

జగిత్యాలలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి కోసం టీయూఎఫ్ఐడీసీ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.32.72 కోట్లు మంజూరు కాగా అందులో 122 పనులకు అనుమతించారు. 56 పూర్తి చేయగా 56 పనులు అసలే ప్రారంభించలేదు. ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలియని గందరగోళం నెలకొంది.

పరిశీలించిన నగరాలు: 2

పట్టణాలు : 8

ప్రధాన సమస్యలు : రోడ్లు, డ్రైనేజీలు

# ధర దిగాలు.. రైతు కుదేలు

కరీంనగర్ : జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలులకు మామిడి ధర భారీగా పతనమైంది. మొన్నటి వరకు మార్కెట్‌లో సగటున కిలో ధర రూ.40 నుంచి రూ.30 పలికిన మామిడి ధర.. ప్రస్తుతం ఏకంగా గరిష్ఠంగా కిలో రూ.20 ఉండగా, మధ్య రకం రూ.10, కనిష్ఠంగా రూ.4కు పడిపోయింది. ఇందులో ఏజెంట్ కమీషన్, రవాణా ఛార్జీలు పోను మిగిలింది ఏమీ లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పొరుగు జిల్లాల నుంచి..**

కరీంనగర్ జిల్లాలో ఈ ఏడాది కాత తక్కువగానే ఉన్నప్పటికీ, మార్కెట్‌కు దిగుబడి మాత్రం పెరిగింది. జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాల పరిధిలోని ధర్మపురి, ధర్మారం, మంచిర్యాల, హుస్నాబాద్, కోహెడ తదితర ప్రాంతాల నుంచి కరీంనగర్ మార్కెట్‌కే మామిడి తీసుకువస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు.

**క్రయ విక్రయాలు ఇలా..**

మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతుల దగ్గరి నుంచి మామిడి నాణ్యతను బట్టి ట్రేడర్లు కొనుగోలు చేస్తారు. రైతులు, ట్రేడర్లకు మధ్యవర్తులుగా



కమీషన్ ఏజెంట్లు ఉంటారు. కమీషన్ ఏజెంట్లు రైతుల నుంచి నాలుగు శాతం కమీషన్ తీసుకొని, మూడు శాతం లాభం.. ఒక్క శాతం మార్కెట్ కమిటీకి ఫీజుగా చెల్లిస్తారు.

**ఇతర రాష్ట్రాలకు ఎగుమతి**

మార్కెట్‌లో కొనుగోలు చేసిన మామిడిని ట్రేడర్స్ అధిక శాతం మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, అస్సాం, బిహార్, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. సీజన్ సాగినన్ని రోజులు ఇక్కడ పనిచేయడానికి ఉత్తరాది రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో కూలీలు వస్తారు. వారంత మార్కెట్‌కు వచ్చిన మామిడిని గ్రేడింగ్, ప్యాకింగ్, లోడింగ్ చేస్తారు. ఈనెలాఖరు వరకు మార్కెట్ కొనసాగుతుందని.. ఏఎంసీ ఇన్‌ఛార్జి కార్యదర్శి సయ్యద్ హమీద్ తెలిపారు.

**మార్కెట్‌కు 2,865 మెట్రిక్ టన్నులు**

కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో గత నెల 2న మామిడి విక్రయాలు ప్రారంభమయ్యాయి. సీజన్ ప్రారంభంలో బరువు ఎక్కువగా ఉండే కాయలకు సగటున కిలోకు రూ.60 నుంచి రూ.50 వరకు ధర పలికింది. కానీ క్రమక్రమంగా ధర తగ్గుతూ వచ్చింది. ఇప్పటి వరకు మార్కెట్‌కు బంగినపల్లి రకం అధికంగా 2,784 మెట్రిక్ టన్నులురాగా, మిగిలిన రకాల్లో దశేరి 81, ఇతర రకాలు 3 టన్నులు మాత్రమే వచ్చాయి.

# దగా 'ఖానాలు'




హైదరాబాద్: కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. కొన్ని ఎలాంటి అనుమతులు లేకుండానే నడిపిస్తుండగా.. మరికొన్ని ఆసుపత్రులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జత చేసి అనుమతులు తీసుకుంటున్నాయి. తాజాగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఓ ఆసుపత్రి అక్రమాల బాగోతం బయట పడింది. భవన నిర్మాణ అనుమతులు నుంచి మౌలిక వసతులు, వైద్యులు, సిబ్బంది, ఫైర్‌సేఫ్టీ, రోగుల భద్రత ఇలా ప్రతి అంశంలోనే ఉల్లంఘనలు చోటుచేసుకున్నట్లు అధికారులు ధ్రువీకరించి నోటీసు జారీ చేశారు.

విచ్చలవిడిగా ఏర్పాటు.. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాల్లో విచ్చలవిడిగా నకిలీ క్లినిక్‌లు.. నర్సింగ్‌హోంలు పుట్టుకొస్తున్నాయి. అర్హత లేని వ్యక్తులు వీటిని నడుపుతున్నారు. గతేడాది దాదాపు 187 పైగా అక్రమ క్లినిక్‌లను ఔషధ నియంత్రణ శాఖ గుర్తించి కేసులు నమోదు చేసింది.

**సీఎంఆర్ఎఫ్ నిధులకు ఎసరు**

కొన్ని ఆసుపత్రులు తప్పుడు పత్రాలతో సీఎంఆర్ఎఫ్ నిధులనే కాజేస్తున్నాయి. మాదన్నపేట, బీఎన్‌రెడ్డినగర్, ఐఎస్‌సదన్, సైదాబాద్, బైరామల్‌గూడ, కొత్తపేట, హస్తినపురంలోని ఆరు ఆసుపత్రులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఈ నిధులు పక్కదారి పట్టించినట్లు గుర్తించి చర్యలు తీసుకున్నారు. ఇటీవల సరూర్‌నగర్‌లోని అలకనంద ఆసుపత్రిలో భారీ కిడ్నీ రాకెట్ బయట పడిన సంగతి తెలిసిందే.

**ఇదీ పరిస్థితి..**

ఆసుపత్రి లేదా క్లినిక్, నర్సింగ్‌హోం నడిపించాలంటే ఎంబీబీఎస్ డిగ్రీతోపాటు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 ప్రకారం వైద్య ఆరోగ్యశాఖ వద్ద అనుమతులు తీసుకోవాలి.

డయాగ్నొస్టిక్ సెంటర్‌లో తప్పనిసరిగా పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ అమలు చేయాలి. తద్వారా లింగనిర్ధారణ లాంటి పరీక్షలు నిషేధం. వీటికి సంబంధించి బోర్డులు, రికార్డులు నిర్వహణ తప్పనిసరి.

ఇక ప్రతి గల్లీలోనూ క్లినిక్‌లు ఉన్నాయి. చాలాచోట్ల అనుమతులు లేకుండా నడిపిస్తున్నారు. కొన్నిచోట్ల రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసుకోవడం లేదు. ఫిజియోథెరపీ కేంద్రాలు, ఆయుష్ కేంద్రాలు సైతం కూడా ఎక్కడపడితే అక్కడ కొనసాగిస్తున్నారు.

**వసూళ్లకే ప్రాధాన్యం..?**

ఎలాంటి అనుమతులు లేని క్లినిక్‌లపై నిరంతర నిఘా ఉండటం లేదు. శివార్లలో క్లినిక్‌ల తనిఖీల్లో కొందరు అధికారులు చేతివాటానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొలిసారి అనుమతి లేకుండా క్లినిక్ లేదా ఆసుపత్రిని గుర్తిస్తే వాటికి రూ.50 వేల జరిమానా విధించాలి. అప్పటికీ అనుమతులు తీసుకోకపోతే రెండోసారి రూ.2 లక్షలు, మూడోసారి పట్టుబడితే రూ.5 లక్షల జరిమానా వేయాలి. క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. నెలవారీ వసూళు చేస్తూ...తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

**నగరంలో అనుమతి పొందినవి ఇలా..**

డయాగ్నొస్టిక్ కేంద్రాలు 47

క్లినిక్‌లు 925

ఫిజియోథెరపీ 45

ఆయుష్ 89

# కనికట్టు చేసేయ్.. కాసులు మేసేయ్



హైదరాబాద్: జీహెచ్ఎంసీలోని కొందరు ఇంజినీర్లు బరితెగించారు. రోడ్డు వేయకుండా బిల్లులు పెట్టేస్తున్నారు. 2021-22, 2022-23 సంవత్సరాల్లో చేపట్టిన పలు పనుల బిల్లులను.. మూడేళ్ల తర్వాత ఆమోదానికి పంపడంతో అప్పటి కమిషనర్ ఇలంబర్తి అనుమానాలు వ్యక్తం చేశారు. జనవరిలో ఆయా ఆర్థిక సంవత్సరాలకు చెందిన 10శాతం బిల్లులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. అందులోని 20 పనుల లోపాలను విజిలెన్స్ గుర్తించింది. ముఖ్య ఇంజినీరుకు నివేదిక ఇవ్వగా ఆయన ఆయా సర్కిళ్లకు పంపించి వివరణ కోరారు.

**గుర్తించిన లోపాలు..**మార్నింగ్ స్టార్ హెూటల్ నుంచి రెయిన్‌బజార్ వరకు 9 భవనాలను కూల్చాల్సి ఉండగా.. ఆరింటిని కూల్చినట్టు ఇంజినీర్లు రూ.2.13 లక్షల బిల్లు పెట్టారు. క్షేత్రస్థాయిలో మూడింటినే తొలగించారు. రూ.84 లక్షలతో బేగంపేట పాంటలూన్స్ నుంచి మయూరి అపార్ట్‌మెంట్ వరకు వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులు సగభాగం జరగలేదు. అయినప్పటికీ రూ.64.56 లక్షల బిల్లులు పెట్టారు. రూ.1.75 కోట్లతో శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డికాలనీలో మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి ఇంజినీర్లు రూ.69.27లక్షల బిల్లులను ఆమోదించగా, పనులు ఆ స్థాయిలో కాలేదు. తలుపులు, టైల్స్ ఇప్పటికే ధ్వంసమై ఉన్నాయి.

రూ.1.82 కోట్లతో పటాన్‌చెరు సర్కిల్ భారతినగర్ డివిజన్‌లోని ఆదర్శ రైతుబజార్‌లో చేపట్టిన పునరుద్ధరణ పనులకు ఇంజినీర్లు రూ.1.70 కోట్లు చెల్లించాలని బిల్లులు పెట్టారు. కానీ పనులు పూర్తికాలేదు. రైతు బజారు ప్రారంభానికి నోచుకోకపోవడం జీహెచ్ఎంసీకి నష్టం కలిగిస్తోంది.

కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రూ.5.95 కోట్లతో ఈత కొలను నిర్మించారు. నీటి కనెక్షన్ తీసుకోవడంలో ఇంజినీర్లు చేతులెత్తేశారు. ఈత కొలనుకు రూ.1.4 కోట్ల బిల్లు పెట్టారు. ఇంజినీర్ల నిర్లక్ష్యంతో వెచ్చించిన ప్రజాధనానికి విలువ లేకుండా పోయింది.

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రేమావతిపేట్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం 90 మీటర్ల పొడవున పూర్తయితే, అంతా జరిగినట్టు రూ.27.88 లక్షల బిల్లు పెట్టారు.

ఖైరతాబాద్ జోన్‌లోని ఎల్లారెడ్డిగూడ, కేశవ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో రూ.14.9 లక్షలతో చేపట్టిన ప్రహరీ నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఇంజినీర్లు ఈ పనికి రూ.8.33లక్షల బిల్లులు పెట్టారు.

రూ.19.85లక్షలతో శివరాంపల్లి న్యూ వీకర్ సెక్షన్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు సగం పూర్తి చేశారు. మొత్తం అయినట్లు రూ.19.85 లక్షల బిల్లులు పెట్టారు.

రూ.5.95 కోట్లతో చేపట్టిన బహదూర్‌పుర అలియాబాద్‌లో చేపట్టిన వరద నీటి నాలా నిర్మాణ పనులు ఆదిలోనే నిలిచిపోయాయి. అయినా రూ.58లక్షల బిల్లులు చెల్లించాలని ఇంజినీర్లు సిఫార్సు చేశారు.

రూ.59.6 లక్షలతో మోండామార్కెట్ డివిజన్ టీచర్స్ కాలనీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తికాలేదు.

# రసాయన వ్యర్థాల నిర్వహణ గాలికి



హైదరాబాద్: హానికర వ్యర్థాల నిర్వహణను మెటల్ పరిశ్రమల యూనిట్ల నిర్వాహకులు గాలికొదిలేశారు. లెడ్, జింక్, మాంగనీస్ వంటి లోహాలను శుద్ధి చేసే పరిశ్రమల్లో అనేక ప్రమాదకర వ్యర్థాలు వెలువడుతాయి. వాటిని దుండిగల్‌లోని వ్యర్థాల నిర్వహణ కేంద్రం(టీఎస్‌డీఎఫ్)కు తరలించాలి. 900 నుంచి 1300 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య భస్మం చేస్తారు. అయితే నిబంధనలను పట్టించుకోని పరిశ్రమల నిర్వాహకులు హానికర వ్యర్థాలను ఇష్టానుసారం సమీప అడవులు, పరిశ్రమలకు దగ్గరలోని మైదానాలు, ఖాళీ స్థలాల్లో పారబోస్తుండటంతో సమస్యలు తప్పడం లేదు.

**జితిన్ ఎంటర్‌ప్రైజెస్‌పై వేటు..**

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం నందిగామ వద్ద ఏర్పాటు చేసిన జితిన్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి విపరీతంగా కాలుష్యం నమోదవుతోందని గుర్తించిన పీసీబీ తాజాగా మూసివేత ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడ నిత్యం 672 కేజీల 'సీసం లోహ కడ్డీలు' ఉత్పత్తి అవుతుంటాయి. కాలుష్య ఉద్గారాలైన లెడ్ స్లాగ్, లెడ్ డ్రాస్ వ్యర్థాల నిర్వహణ కేంద్రానికి తరలించకుండా అక్కడే పారబోస్తుంది. చుట్టుపక్కల పొలాలు కలుషితం కావడంతోపాటు భూగర్భజలాలపై ప్రభావం పడినట్లు అధికారులు తనిఖీల్లో గుర్తించారు. 2 రోటరీ ఫర్నేస్‌లకు అనుమతి తీసుకొని.. అదనంగా మరో 2 నడుపుతున్నట్లు గుర్తించారు. పరిశ్రమల్లో కార్మికుల ఆరోగ్యంపై ప్రతి ఆరు నెలలకోసారి నివేదిక ఇవ్వాలి. కానీ కొంత కాలంగా సమర్పించలేదు. నీటి వినియోగంపై రికార్డులు కనిపించలేదు. తనిఖీ బృందం నివేదిక ప్రకారం పరిశ్రమ మూసివేతకు పీసీబీ ఆదేశించింది.

**దూలపల్లి, కీసరలో పారబోత**

మూడు జిల్లాల పరిధిలో 2 వేలకు పైగా పరిశ్రమలుండగా, 30 శాతం టీఎస్‌డీఎఫ్‌లో సభ్యత్వం తీసుకోలేదని పీసీబీ అంచనా వేసింది. రసాయన వ్యర్థాలను దూలపల్లి, కీసర అటవీప్రాంతాల్లో పారేస్తున్నారు. గతంలో ఇక్కడ పారబోసిన వ్యర్థాల శాంపిళ్లను పీసీబీ సేకరించి బాధ్యులైన పరిశ్రమలపై చర్యలు తీసుకుంది. అనంతరం నిఘా కొరవడటంతో పరిస్థితి విషమించింది. వ్యర్థాల పారబోత సమాచారాన్ని పౌరులు 'జనవాణి-కాలుష్య నివారిణి' ద్వారా అందించొచ్చని పీసీబీ వెల్లడించింది.

# చేపల కొలనులో చేతి నిండా ఉపాధి

మంథని : కూలీలకు పని కల్పించడంతో పాటు మత్స్యకారులకు ఏడాది పొడవునా ఆదాయం వచ్చేలా ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో ఏటా చేపల కొలనుల తవ్వకం చేపడుతోంది. దీంతో చెరువు శిఖం భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తోంది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, చేప పిల్లల పెంపకం, ఉత్పత్తితో మత్స్యకారులకు జీవనోపాధి మెరుగయ్యేలా ఆర్థికంగా చేయూతనిస్తోంది. జిల్లాలో చెరువులు, కుంటలు కలిపి 1076 ఉన్నాయి. మొత్తం 206 మత్స్య సహకార సంఘాల్లో 14,676 మంది సభ్యులున్నారు. ఏటా ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేస్తున్నా ఆలస్యం కావడం, నాణ్యత లోపించడంతో లక్ష్యం నెరవేరడం లేదు.

**ప్రతి రోజూ 16 వేల మంది హాజరు**

జిల్లావ్యాప్తంగా ఉపాధిహామీ పథకంలో 1,18,948 జాబ్‌కార్డుల పరిధిలో 2,43,699 మంది కూలీలు నమోదయ్యారు. ఇందులో పురుషులు 1,19,943 మంది, మహిళలు 1,23,756 మంది. ప్రతి రోజూ సగటున 16,184 మంది కూలీలు పనులు చేస్తున్నారు.

**2,200 పని దినాల కేటాయింపు**

ఉపాధిహామీలో భాగంగా చేపల కొలనులను 25 మీటర్ల పొడవు,



15 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో తవ్వుతారు. ఒక్కో కొలను నిర్మాణానికి రూ.6.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ఒక్కో దాంట్లో నాలుగు గుంతలు ఏర్పాటు చేస్తున్నారు. క్యూబిక్ మీటరుకు రూ.291.45 చొప్పున కూలీ చెల్లించనున్నారు. జిల్లాలో చేపల కొలనుల నిర్మాణానికి 2,200 పని దినాలను నిర్దేశించారు. 2024-25లో రూ.5.67 కోట్లు, 2025-26లో రూ.7.63 కోట్లు కేటాయించారు.

**మంథనిలోనే అత్యధికం**

మంథని మండలంలో 2024-25 సంవత్సరానికి 28 చేపల కొలనులు మంజూరు కాగా ఇప్పటివరకు 8 చోట్ల 90 శాతం, 7 చోట్ల 50 శాతం పనులు కాగా మిగతా 13 కొలనుల పనులు ప్రగతిలో ఉన్నాయి. 35 పంచాయతీల పరిధిలో మొత్తం 12,545 జాబ్ కార్డులుండగా 29,275 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఈ సంవత్సరం కొత్తగా కొలనులు మంజూరు కాలేదు. ఉపాధిహామీ పథకంలో జిల్లాలోనే అత్యధికంగా కూలీలు మంథని మండలంలో హాజరవుతున్నారు. సగటున 2,580 మంది పాల్గొంటున్నారు.

**బహుళ ప్రయోజనాలు**

వాన నీటిని నిల్వ చేయడానికి చేపల కొలనులు ఎంతో ఉపయోగపడతాయి. వీటితో భూగర్భ జలాలు పెరుగుతాయి. వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయానికి అండగా ఉంటాయి. చేపల పెంపకంతో స్థానికులకు ఆదనపు ఆదాయంతో పాటు, డిమాండ్‌కు తగినట్లు మార్కెట్‌లో సరఫరా పెరుగుతుంది. కొలనులోని మట్టిని పొలాల్లో వేసుకోవడం ద్వారా భూసారం పెరగనుంది.

# రక్తకణాల విభజనతో తప్పిన తిప్పలు

గోదావరిఖని : గోదావరిఖని ప్రభుత్వ రక్తనిధి కేంద్రంలో ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్స్, ప్లాస్మా విభజన సదుపాయాలు అందుబాటులోకి రావటంతో జిల్లా వాసులకు తిప్పలు తప్పాయి. గతంలో మంచిర్యాల, కరీంనగర్ వెళ్లి ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్, ప్లాస్మా సేవలు పొందేవారు. ఔషధ నియంత్రణ శాఖ సూచనల ప్రకారం అదనపు భవన నిర్మాణంతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పించడంతో ఇటీవల అనుమతులు మంజూరు చేశారు. గతనెల 12 నుంచి ప్లాస్మా, ఎర్ర రక్తకణాలు, ప్లేట్లెట్స్ విభజనల సదుపాయం అందుబాటులోకి వచ్చాయి.

**ఏప్రిల్ 12 నుంచి అందుబాటులోకి..**

రక్తనిధి కేంద్రంలో గతనెల 12 నుంచి ఇప్పటివరకు 80 మందికి ఎర్ర రక్తకణాల విభజన జరిగింది. ఒక్కరికి మాత్రమే ప్లేట్లెట్స్ విభజించి అందించారు. ప్లాస్మా విభజన జరగలేదు. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని ప్రాసెస్ చేసి ఎర్ర రక్తకణాలు మాత్రమే అవసరమైన వారికి ఎక్కిస్తున్నారు. అందులోని ప్లాస్మాను విడదీసి కేంద్రంలో నిల్వ చేస్తారు. ఇలా ప్లాస్మా ప్యాకెట్లు 60కి పైగా రక్త నిధి కేంద్రంలో నిల్వ ఉన్నాయి. అవసరమైన రక్తం గ్రూపు ప్రకారం ప్లాస్మా సరఫరా చేయనున్నారు.

**రెండు యంత్రాలు.. ఒకటే వాడుకలో..**

కణాలు, ప్లేట్లెట్స్, ప్లాస్మా విభజనలో రెండు రకాల యంత్రాలు



గోదావరిఖనిలోని రక్తనిధి కేంద్రంలో అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రస్తుతం ర్యాండమ్ విభజన యంత్రం మాత్రమే వినియోగిస్తున్నారు. దీంతో దాత నుంచి సేకరించిన రక్తంలోంచి ఏకకాలంలో ప్లాస్మా, ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్స్ విభజన చేసి అవసరమైన వారికి అందిస్తున్నారు. దీని నిర్వహణకు కూడా నామమాత్రంగా వ్యయం కానుంది. ఎన్టీపీసీ యాజమాన్యం సామాజిక బాధ్యతగా సింగిల్ డోనర్ ప్లేట్లెట్ యంత్రాన్ని కేంద్రానికి సమకూర్చగా.. దీనితో రక్తంలోని ప్లేట్లెట్స్, ఎర్ర రక్తకణాలు, ప్లాస్మా ఏదేని ఒకటి మాత్రమే ఏకకాలంలో విభజించేందుకు అవకాశం ఉంది. ఖర్చు కూడా సుమారు రూ.10వేల వరకు అవుతోంది. వర్షాకాలంలో డెంగీ లాంటి విషజ్వరాలతో రోగుల్లో ప్లేట్లెట్స్ తగ్గిపోతుండడంతో వాటిని ఎక్కించాల్సిన అవసరం ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో సింగిల్ డోనర్ యంత్రం వినియోగంలోకి తేవాలని భావిస్తున్నారు.

చురకలు



# నది నుంచి నల్లా దాకా..!

చౌటుప్పల్: ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 35 లక్షల మందికి కృష్ణా, గోదావరి నదుల నీళ్లు మిషన్ భగీరథ పథకం ద్వారా నల్లాల్లో సరఫరా అవుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఈ నదీ జలాలను శుద్ధి చేసి నల్లాలతో అందిస్తున్నారు. నది నుంచి సేకరించిన నీళ్లను జిల్లాలోని స్వాములవారి లింగోటం, పానగల్లులలో ప్రత్యేకంగా నెలకొల్పిన ప్లాంట్లలో నాలుగు దశల్లో శుద్ధి చేస్తారు. శుద్ధీకరణ పూర్తయ్యాక ఆ నీళ్లకు పరీక్షలు నిర్వహిస్తారు. పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాల ప్రకారం శుద్ధీకరణ పూర్తయిందని నిర్ధరించుకున్నాక.. ట్యాంకుల్లోకి ఎక్కించి గ్రామాలకు సరఫరా చేస్తారు. గ్రామ పంచాయతీల్లోని నల్లాల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల పరిధిలో 1197 గ్రామాలకు సరఫరా అవుతున్న నీటి శుద్ధీకరణ జరిగే ప్రక్రియను మిషన్ భగీరథ పథకం(గ్రిడ్) చౌటుప్పల్ ఈఈ లక్ష్మీనారాయణ వివరించారు.

మొదటి దశ.. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఏకేబీఆర్) నుంచి కృష్ణా నీటిని నాంపల్లి మండలం స్వాములవారి లింగోటంలోని నీటి



శుద్ధి కేంద్రానికి పంపిస్తారు. ఈ ప్లాంటులో పైపుల ద్వారా నీరు ప్రవహిస్తున్నప్పుడే ప్రీ క్లోరినేషన్ చేసి నీళ్లలో ఏవైనా బ్యాక్టీరియాలు ఉంటే నశింపజేస్తారు. తర్వాత ఏవియేటర్‌లోని నీళ్లను పంపిస్తారు. అక్కడ నీటిని చిలుకుతారు. ఆ ప్రక్రియతో నీటిలోకి ఆక్సీకరణ చేస్తారు. టర్బిడిటీని తొలగిస్తారు.

రెండో దశ.. తొలి దశలో శుద్ధి అయిన లక్ష లీటర్ల నీళ్లకు రెండు గ్రాములు చొప్పున స్పటికాలతో కూడిన ఆలం కలుపుతారు. క్లారి ఫ్లోక్యులేటర్ ద్వారా ఈ నీటిని పంపించి శుద్ధి చేస్తారు.

మూడో దశ.. రెండు దశల్లో శుద్ధి చేసిన నీటిని ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్లలోకి పంపిస్తారు. రెండు మీటర్ల ఎత్తుండే ఈ ఫిల్టర్‌లో నాలుగు పొరలుగా గులకరాళ్లు, ఇసుక పేర్చి ఉంటుంది. వీటి ద్వారా వడగట్టిన నీటి టర్బిడిటీ 0–1 ఎన్‌టీయూకు తగ్గుతుంది. నాలుగో దశ.. మూడు దశల్లో శుద్ధి అయిన నీళకు పోస్ట్ క్లోరినేషన్ చేసి సంప్‌లోకి చేరుస్తారు. నాలుగో దశ శుద్ధి తర్వాత ఈ నీళ్లు స్వచ్ఛంగా, తేటగా, రుచిగా, శరీరానికి అవసరమైన అన్ని రకాల పోషకాలతో కూడి ఉంటాయి. శుద్ధి అయిన నీటిని ఉపరితల రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తారు. అక్కడి నుంచి భూమ్యాకర్షణ ద్వారా గ్రామాల్లోని శుభ్రం చేసి క్లోరినేషన్ చేసి ఉన్న ఉపరితల ట్యాంకుల్లో నింపుతారు. అక్కడి నుంచి ఇళ్లలోని నల్లాల ద్వారా ప్రజలకు సరఫరా జరుగుతుంది. పూర్తిస్థాయిలో శుద్ధీకరణ జరిగి, తగినన్ని పోషకాలున్న మిషన్ భగీరథ నీళ్లను ఎలాంటి అనుమాల్లేకుండా తాగవచ్చు.

# కన్నేసి..కాజేసి

కోదాడ : అర్బన్ ప్రాంతాలలోని భూముల ధరలకు గిరాకీ అంతా ఇంతా కాదు. అందులోనూ రహదారికి ఆనుకొని ఉండే భూమికి రూ.కోట్ల వర్షమే కురుస్తుంది. ఇలాంటి భూములపై కన్నేసిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ల అభివృద్ధి పేరుతో వరద కాలువలను సైతం కలిపేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రతి రహదారికి ఇరువైపులా వరద కాలువలను నిర్మాణ దశలోనే ఏర్పాటు చేస్తుంది. హఠాత్తుగా భారీ వర్షాలు వచ్చినా ఈ కాలువల ద్వారా నీళ్లు ప్రవహిస్తుంది. గతేడాది భారీ వర్షాల కారణంగా రహదారులకు ఇరువైపులా కాలువలు లేక వరదలు సంభవించాయి. కోదాడ పట్టణంలో వరదల ధాటికి ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడగా, మండలంలో వేల ఎకరాల పంట కొట్టుకుపోయింది. అయినా అధికారులకు పట్టింపు లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నుంచి మేళ్లచెరువు ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా వరద కాలువ కనుమరుగైంది. ఈ ప్రాంతంలో ఎకరం భూమి రూ.కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు ధర పలుకుతుంది. రియల్ వ్యాపారులే కాక కొందరు రైతులు సైతం కాలువను ఆక్రమించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం– సూర్యనారాయణ, ఆర్డీవో కోదాడవరద కాలువలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం. రహదారులకు ఇరువైపులా వరద కాలువలు తప్పనిసరిగా ఉండాలి. రైతులకు ఇబ్బందులు లేకుండా వెంచర్ల యజమానులు నిబంధనలు పాటించాలి.

# తవ్వేకొద్దీ అక్రమాలు!

పాల్వంచ : పాల్వంచకు అతి సమీపంలోని ముర్రేడు, కిన్నెరసాని నదుల నుంచి ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. పాల్వంచ పట్టణంలోని కుంటినాగులగూడెం, శ్రీనివాసకాలనీ, మంచికంటినగర్, శివనగర్, విద్యుత్ ఎంప్లారస్ కాలనీ, కేఎల్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంతం, బసవతారకకాలనీ, జగన్నాథపురం, లక్ష్మీదేవిపల్లిలో వందలాది సంఖ్యలో నూతన భవనాలు, వ్యాపార సముదాయాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.కొందరు బిల్డర్లు, భవన నిర్మాణ యజమానులు.. తోగ్గూడెం సమీపంలోని ముర్రేడు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఒడ్డుకు ఇసుకను రాత్రిపూట డంప్ చేసి లారీల్లో పాల్వంచకు తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంగం, రంగాపురం, నాగారం వద్ద కిన్నెరసాని నది, పాత పాల్వంచలో ముర్రేడు నది నుంచి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.

**పట్టించుకోని యంత్రాంగం**

తోగ్గూడెం కేంద్రంగా ఇసుక డంప్ చేసి అక్రమంగా తరలిస్తున్నా పోలీసు, రెవెన్యూ, మైనింగ్, అటవీశాఖ అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా ఒకట్రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నదుల నుంచి ఇసుకను టన్నుల కొద్దీ తరలించటం వల్ల భూగర్భజలాలు ఇంకిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ, మైనింగ్, అటవీ, చెక్‌పోస్ట్ అధికారులు పకడ్బందీగా తనిఖీలు చేపడుతూ ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

పోలీసు, మైనింగ్ అధికారుల సహకారంతో అక్రమ మైనింగ్‌పై ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నాం. ఇసుక అక్రమ రవాణాపై తరచూ కేసులు నమోదుచేస్తున్నాం. స్వాధీనపరచుకున్న ఇసుకకు పలుమార్లు బహిరంగ వేలం నిర్వహించాం.వివేక్, తహసీల్దారు, పాల్వంచ

# రూ.2 లక్షలకో ఉద్యోగం!




జగిత్యాల : జగిత్యాల పురపాలక సంఘంలో అధికారుల అక్రమాలకు అంతు లేకుండా పోతోంది. పురపాలక సంఘం ఇంజినీరింగ్ తాగునీటి సరఫరా విభాగంలో పనిచేసేందుకు 51 మంది సిబ్బంది నియామకానికి గతేడాది మార్చి 6న పురపాలక సాధారణ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ లెక్కన 47 మంది సిబ్బంది విధుల్లో ఉన్నారు. మరో నలుగురు సిబ్బంది అవసరం ఉన్నప్పటికీ ఇంజినీరింగ్ అధికారులు పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లలేదు. ఈ విషయంలో గోప్యత పాటించారు. 2024 సెప్టెంబరులో ఓ వ్యక్తిని పాలకవర్గం, కలెక్టర్ ఆమోదం లేకుండా విధుల్లో నియమించారు. ఇదే పద్ధతిలో మరో ముగ్గురిని కూడా మార్చి నెలలో విధుల్లోకి తీసుకొని వేతనాలు కూడా చెల్లించారు.

నిబంధనలకు తిలోదకాలు..పురపాలక సంఘంలో ఏ విభాగంలోనైనా ఒప్పంద ఉద్యోగాల భర్తీ కౌన్సిల్ తీర్మానం మేరకు లేదా కలెక్టర్ ఆమోదంతోనో చేపడతారు. అవసరమైన సిబ్బంది నియామకాలను తొలుత కౌన్సిల్ ఎజెండాలో చేర్చుతారు. ఆమోదం అనంతరం నియామకాల ప్రక్రియ కోసం పట్టణ సమాఖ్య(టౌన్ లెవల్ ఫెడరేషన్)కు బాధ్యత అప్పగిస్తారు. ఈ మేరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా పత్రికా ప్రకటనలిస్తారు. ఆ తరువాత అర్హులైనవారిని నిబంధనల మేరకు కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు నియమిస్తారు. కానీ ఇవేవీ లేకుండానే కిందిస్థాయి సిబ్బందే అన్నీ తామై నియామకాలు చేపట్టారు. కౌన్సిల్ పదవీకాలం ముగియడంతో అక్రమ నియామకాలకు తెరలేపారు. నియామకాలు పొందిన నలుగురి నుంచి రూ.2 లక్షల చొప్పున వసూలు చేసినట్లు సమాచారం.

**అక్రమాలే అధికం..**

పురపాలక సంఘంలో పారిశుధ్య నిర్వహణ, ఇంజినీరింగ్ విభాగాల్లో అక్రమ నియామకాలు బల్దియా ప్రతిష్ఠను దిగజార్చుతున్నాయి. గతేడాది ఒప్పంద పారిశుధ్య విభాగంలోనూ 15 పోస్టులకుగాను 3 భర్తీ చేసి 12 ఖాళీగా ఉంచారు. వీటిని 2024 ఆగస్టులో కలెక్టర్, పాలకవర్గం ఆమోదం లేకుండా ఒక్కో పోస్టుకు రూ.1.50 లక్షలు తీసుకున్నారనే వివాదం బల్దియాను కుదిపేసింది. అక్రమ పద్ధతిలో చేరిన 12 మంది సిబ్బంది వేతనాలు సైతం అప్పటి కమిషనర్ నిలిపివేసి విచారణ చేపట్టారు. తాజాగా ఇంజినీరింగ్ విభాగంలో ప్రత్యేకాధికారుల పాలనలోనూ కొందరు సిబ్బంది అక్రమాలకు తెరలేపడం గమనార్హం.

**విచారణ చేపట్టాంస్పందన, కమిషనర్ జగిత్యాల**

పురపాలిక ఇంజినీరింగ్ తాగునీటి సరఫరా విభాగంలో నలుగురిని కౌన్సిల్ ఆమోదం లేకుండా నియమించిన విషయమై విచారణ చేపట్టాం. నలుగురి నియామకం ఏ పద్ధతిలో చేపట్టారని ఇంజినీరింగ్ అధికారులను సంజాయిషీ కోరాం. నిబంధనల మేరకే నలుగురి నియామకం జరిగిందని ఏఈ తెలిపారు. ఇందుకు అవసరమైన ఆధారాలు రాతపూర్వకంగా సమర్పించాలని ఆదేశించాను. 2 రోజుల గడువు అనంతరం వివరాలు సమర్పిస్తామని ఏఈ తెలిపారు.

# తూనికాకు సేకరణకు సన్నద్ధం



మంథని : జిల్లాలో తునికాకు సేకరణకు అటవీ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొన్ని రోజులుగా అడవుల్లో కొమ్మల కత్తిరింపు(ప్రూనింగ్) పనులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో జిల్లాల వారీగా తునికాకు యూనిట్ల నిర్వహణకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు ఆహ్వానించారు. జిల్లాలోని 7 యూనిట్ల పరిధిలో మొత్తం 47 కల్లాలున్నాయి. వీటి ద్వారా ఈ ఏడాది 7,600 ఎస్‌బీ(స్టాండర్డ్ బ్యాగు)ల తునికాకు సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా మంథని డివిజన్‌లోని ముత్తారం–బీ, ఖమ్మంపల్లి, పెద్దపల్లి డివిజన్‌లోని కల్వచర్ల యూనిట్లకు మాత్రమే టెండర్లు ఖరారయ్యాయి. మంథనిలోని ముత్తారం–ఏ, మంథని, పెద్దపల్లిలోని రామగుండం, కన్నాల(బసంత్‌నగర్) యూనిట్లపై ఎవరూ ఆసక్తి చూపలేదు.

**18 కల్లాల నిర్వహణ**

టెండర్లు పూర్తయిన యూనిట్ల పరిధిలో మొత్తం 18 కల్లాలు నిర్వహించనున్నారు. ముత్తారం–బీ యూనిట్‌లో దర్యాపూర్, కేశన్‌పల్లి, పారుపల్లి, హరిపురం, మైదంబండ, మచ్చుపేట, ఖమ్మంపల్లి పరిధిలో చిన్నఓదాల, ధర్మారం–ఏ, గోపాల్‌పూర్–బీ, జిల్లాలపల్లి–ఏ, బీ, ఖమ్మంపల్లి–ఏ, బీ, సీతంపల్లి, కల్వచర్ల యూనిట్‌లో గౌరెడ్డిపల్లి, రత్నాపూర్, సబ్బితం, వెన్నంపల్లి కల్లాలున్నాయి.

**గుత్తేదారుల నిరాసక్తత**

జిల్లాలో 7 యూనిట్లకు మూడింటికి మాత్రమే టెండర్లు పూర్తి కావడం.. వ్యాపారుల నిరాసక్తతకు అద్దం పడుతోంది. గతేడాది ముత్తారం–ఏ, బీ, కల్వచర్ల యూనిట్లు మాత్రమే అమ్ముడుపోయాయి. పెద్దపల్లి డివిజన్ పరిధిలోని రామగుండం, కన్నాల పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలుండటంతో వ్యాపారులు ఆసక్తి చూపలేదు.

**2,800ల ఎస్‌బీల సేకరణ లక్ష్యం**

జిల్లాలో అమ్ముడుపోయిన మూడు యూనిట్ల పరిధిలో 2,800 స్టాండర్డ్ బ్యాగు(ఎస్‌బీ)ల తునికాకు సేకరణను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో ఎస్‌బీలో 1000 కట్టలు, ఒక కట్టలో 50 ఆకులుంటాయి. ముత్తారం–బీ యూనిట్‌లోని 6 కల్లాల ద్వారా 900 ఎస్‌బీలు, ఖమ్మంపల్లి పరిధిలోని 8 కల్లాల ద్వారా 1700 ఎస్‌బీలు, కల్వచర్లలోని 4 కల్లాల ద్వారా 200 ఎస్‌బీల తునికాకు సేకరణను అటవీ శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. సేకరణ ప్రక్రియ ఆలస్యంతో లక్ష్యం చేరికపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రభుత్వ ధర కట్టకు రూ.3.05**

ప్రస్తుత సీజన్‌లో 50 ఆకులతో కూడిన కట్ట సేకరణకు రూ.3.05గా ధర నిర్ణయించారు. ఒక మనిషి రోజుకు 300 కట్టలు సేకరిస్తే సరాసరి రూ.వెయ్యి వరకు కూలీ గిట్టుబాటవుతుంది. నెల రోజుల పాటు తునికాకు సేకరణతో సీజన్‌లో ఇద్దరు సభ్యులున్న కుటుంబానికి రూ.20 వేల నుంచి రూ.25 వేల ఆదాయం రానుంది.

**కూలీలు జాగ్రత్తలు పాటించాలి**మే మొదటి వారంలో తునికాకు సేకరణ ప్రారంభమవుతుంది. కూలీలు ముదిరిన ఆకులనే సేకరించాలి. అడవి పందులు, ఎలుగుబంట్లు, ఇతర వన్యప్రాణులకు ఎలాంటి హాని కలిగించొద్దు. రాత్రి పూట వెళ్లేవారు తప్పనిసరిగా టార్చిలైట్‌ను, తాగునీటిని వెంట తీసుకెళ్లాలి. దళారులను సంప్రదించడం కానీ, అక్రమంగా తరలించడం కానీ చేయొద్దు. ప్రభుత్వ కల్లాల్లోనే విక్రయించాలి. శివయ్య, జిల్లా అటవీ శాఖ అధికారి

# ఇక పూలు.. పండ్లు అమ్మొచ్చు..!

భానుపురి : జిల్లాలోని మార్కెట్లు జీవం పోసుకోనున్నాయి. వీటిలో పండ్లు, కూరగాయలు, పూల విక్రయాలకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. మొదట పెద్ద మార్కెట్ యార్డుల్లో వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేసింది. తర్వాత జిల్లాలోని మార్కెట్లకు అవకాశాలు రానున్నాయి. మార్కెట్ యార్డుల్లోని ఖాళీ స్థలాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడం ద్వారా వాటి ఆదాయం పెరగనుంది. వినియోగదారులకు అన్నిరకాల ఉత్పత్తులు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికను అమలు చేయనుంది. పెద్ద మార్కెట్లలో విజయవంతమైన తర్వాత మిగతా మార్కెట్లకు అనుమతులు ఇవ్వనున్నట్లు ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు.

**జిల్లాలో 6 మార్కెట్లు..**జిల్లాలో సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి, తుంగతుర్తి, నేరేడుచర్ల, హుజూర్‌నగర్‌లో వ్యవసాయ మార్కెట్ యార్డులున్నాయి. వీటిలో సూర్యాపేట, తిరుమలగిరి మార్కెట్లు నిత్యం క్రయవిక్రయాలు సాగిస్తాయి. మిగతా మార్కెట్లయిన కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్లలో ధాన్యం విక్రయాలు చేపట్టవు. ఇక్కడ రైతులు మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తారు. తుంగతుర్తి మార్కెట్ పరిధిలో ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఇక్కడ ఎలాంటి క్రయవిక్రయాలు సాగవు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తుంగతుర్తి మార్కెట్లలో పూలు, పండ్లు, కూరగాయల



విక్రయాలు చేపడితే మార్కెట్లకు ఆదాయం సమకూరుతుంది. వీటి పరిధిలోని ఉన్న స్థలాలను వినియోగిస్తే వ్యాపారులకు ఉపాధి కల్పించడంతోపాటు కొంత ఆదాయం వచ్చేలా అవకాశముంటుంది. సూర్యాపేట, తిరుమలగిరి మార్కెట్లు ఇప్పటికే క్రయవిక్రయాల ద్వారా ఆదాయం సమకూరుతోంది. ఆదేశాలు రాలేదు.. – నాగేశ్వరశర్మ, జిల్లా మార్కెట్ అధికారి, సూర్యాపేటమార్కెట్లలో పూలు, పండ్లు, కూరగాయల విక్రయాలు చేపట్టాలని ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. వచ్చిన వెంటనే అమలుకు చర్యలు తీసుకుంటాం. మొదట ప్రభుత్వం ఎంపిక చేసిన మార్కెట్లలో ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఏమైనా అవకాశం రావచ్చు.

# పాలు..కల్తీ కనిపెడితే మేలు

ఖమ్మం : పాలు, పాల పదార్థాలు లేకుండా రోజు గడవని పరిస్థితి. టీ, కాఫీలతోపాటు పిల్లలు తాగేందుకు, పెరుగు తోడు పెట్టుకునేందుకు జిల్లాలో పెద్దఎత్తున పాలు ఉపయోగిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విజయ డెయిరీ ద్వారా రోజుకు సుమారు 10 వేల లీటర్లు, 20 ప్రైవేటు డెయిరీల నుంచి 70 వేల లీటర్ల వరకు విక్రయాలు జరుగుతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు రోజుకు లక్షన్నర లీటర్ల వరకు క్షీరం అవసరం. ఉత్పత్తి సరిగా లేక కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

**తస్మాత్ జాగ్రత్త...**

అవసరాలకు తగిన ఉత్పత్తి లేకపోవడంతో అక్రమార్కులు కల్తీ పాలకు తెర లేపుతున్నారు. రెండు రోజుల కిందట ఖమ్మం నగరంలో కల్తీ పాల విక్రయాలు కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. కొంతమంది నీళ్లు కలిపి విక్రయిస్తే, మరికొందరు ఏకంగా కల్తీవే తయారు చేస్తున్నారు. చిక్కదనం కోసం పిండి పదార్థాలు వాడుతున్నారు. కొవ్వుశాతం ఉండేలా నూనెలు కలుపుతున్నారు. బోరిక్ యాసిడ్, క్లోరిన్, అమ్మోనియా సల్ఫేట్, బెంజాయిక్ యాసిడ్, కాస్టిక్ సోడా, డిటర్జెంట్లు, హైడ్రోజన్ పెరాక్సైడ్, సాలిసిక్ యాసిడ్ వంటి ప్రమాదకర రసాయనాలను ఉపయోగిస్తున్నారు. మాల్టోడెక్స్ట్రిన్ పిండి పదార్థాన్ని జన్యుమార్పిడి చేసిన మొక్కజొన్న నుంచి తయారు చేస్తారు. దీని



గ్లైకమిక్స్ ఇండెక్స్ 105 నుంచి 130 వరకు ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిని అమాంతం పెంచుతుంది. పేగు వాపు మొదలు బరువు పెరగటం, అలర్జీ, క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**కనిపెట్టడం ఇలా...**

నున్నటి గ్రానైట్ రాయిపై చుక్క పాలు వేస్తే త్వరగా జారిపోతే మంచి పాలు. నెమ్మదిగా జారితే కల్తీవి. పాలల్లో కొన్ని చుక్కల అయోడిన్ ద్రావణాన్ని కలిపితే నీలి రంగులోకి మారితే పిండి పదార్థం కలిపినట్లే. అర టేబుల్ స్పూన్ సోయాబీన్ పిండిని ఒక చెంచా పాలతో కలిపి కొద్దిసేపు కలియదిప్పాలి. 5 నిమిషాల తర్వాత రెడ్ లిట్మస్ కాగితాన్ని ముంచినప్పుడు నీలి రంగులోకి మారితే యరియా కలిపినట్లు. పాలలో నీళ్లు కలిపి కలియబెడితే నురగ వస్తే డిటర్జెంట్ కలిపినట్లు.

# అధిక దిగుబడికి విత్తే పద్ధతే ప్రధానం

ఖమ్మం : ఖమ్మం జిల్లాలోని వైరా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గతేడాది అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మధిర, చింతకాని, వైరా, కొణిజర్ల, ముదిగొండ, కామేపల్లి, రఘునాథపాలెం, కూసుమంచి, తల్లాడ, నేలకొండపల్లి మండలాల్లో సుమారు 200 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేయించారు. క్షేత్ర ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చే వానాకాలం సీజన్ నుంచి వైరా, ఏన్కూరు, కొణిజర్ల, రఘునాథపాలెం మండలాల్లో 254 ఎకరాల్లో సాగు చేసేందుకు ప్రణాళిక ఖరారు చేశారు. ఇప్పటి నుంచే రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.రవికుమార్ తెలిపారు.

**ఉత్పాదకత పెంచేందుకు..**

ప్రస్తుతం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 4 లక్షల ఎకరాలకు పైగా రైతులు పత్తి సాగు చేస్తున్నారు. ఉత్పాదకత మాత్రం ఆశించిన స్థాయిలో లేదు. సాగు చేసే రకాలు, పాటించే యాజమాన్య పద్ధతులు, విత్తే దూరం, ఎకరాకు తక్కువ మొక్కల సాంద్రత, ఎక్కువ పంట కాలం, చీడపీడలు, కూలీలతో ఏరించటం లాంటి అంశాలు ఇందుకు కారణమవుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధిక సాంద్రత పత్తి



సాగుపై అవగాహన కల్పిస్తున్నారు.

**ఇవీ లాభాలు..**

ఒకేసారి పత్తి ఏరుకోవచ్చు ముందుగా చేతికి రావటం, ఒకేసారి పూత, కాయలు రావటంతో గులాబిరంగు పురుగు తాకిడి నుంచి పంట బయటపడుతుంది. రెండో పంట సాగుకు అనుకూలం. డిసెంబరులో పంట తీసిన తర్వాత పెసర, మినుము లాంటి అపరాలను సాగు చేస్తే నేల సారవంతమవుతుంది. తర్వాత విత్తే పంటకు ఎరువుల మోతాదు చాలా వరకు తగ్గుతుంది. పంట అంతా ఒకేసారి కాపునకు రావటం వల్ల యంత్రాలతో కోయవచ్చు. కూలీల కొరతను అధిగమించవచ్చు ఈ పద్ధతిలో ఎకరాకు సుమారు 20–30 శాతం అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది.

**ఏమిటీ విధానం**

సాధారణ పత్తికి భిన్నంగా మొక్కల మధ్య, వరుసల మధ్య దూరం తగ్గించి ఎకరాకు ఎక్కువ మొక్కలు వచ్చేలా నాటుతారు. సాధారణ పద్ధతిలో ఎకరాకు 7,407 మొక్కల సంఖ్య ఉంటుంది. అధిక సాంద్రత పద్ధతిలో వరుసల మధ్య 90 సెం.మీ, మొక్కల మధ్య 15 సెం.మీ,(9015) దూరంలో విత్తుకుంటే ఎకరాకు 29,629 వస్తాయి. దగ్గర సాళ్ల పద్ధతిలో వరుసల మధ్య 90 సెం.మీ., మొక్కల మధ్య 30 సెం.మీ,(9030) దూరంలో విత్తుకుంటే ఎకరాకు 14,814 మొక్కలు వస్తాయి. అధిక పద్ధతిలో విత్తన మోతాదు ఎకరానికి 5 ప్యాకెట్లు, దగ్గర సాళ్ల పద్ధతిలో 4 ప్యాకెట్లు అవసరమవుతాయి. మొక్కకు 10–15 కాయలు వచ్చి, బరువు 4–5 గ్రాములు, ఎకరానికి 10–12 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.

# పుష్కరవనం.. ప్రగతి పథం..

రాజానగరం: దివాన్‌చెరువు రిజర్వ్‌ఫారెస్ట్ పరిధిలో ఆటోనగర్‌కు సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గోదావరి మహాపుష్కరవనాన్ని సుందరీకరించేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. 2027లో రానున్న గోదావరి నదీ పుష్కరాల సందర్భంగా దీన్ని అభివృద్ధి పరిచి అందరికీ ఆహ్లాదం పంచే విధంగా చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు. 2015 పుష్కరాల సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పుష్కరవనానికి శంకుస్థాపన చేశారు. నక్షత్రవనం, రాశివనం.. ఇలా అనేక పేర్లతో పలు రకాల మొక్కలు నాటించి వనాన్ని ఆకర్షణీయంగా, సందర్శకులకు ఆహ్లాదం కలిగించేలా తీర్చిదిద్దించారు.

**సందర్శకులకు కేఫ్‌టేరియా**

ఇక్కడికి వచ్చే సందర్శకులకు స్థానికంగా ఎటువంటి ఆహార పానీయాలు లభించడం లేదు. బయటి ప్రాంతాల నుంచి ప్లాస్టిక్ తాగునీటి సీసాలు తీసుకువచ్చి ఇక్కడ వదిలేసి వెళ్లిపోతుండటంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఈ సమస్యను తగ్గించే క్రమంలో పుష్కరవనాన్ని ప్లాస్టిక్ రహిత



ప్రదేశంగా తీర్చిదిద్దాలని అధికారులు నిర్ణయించుకున్నారు. సందర్శకులతో పాటు ప్లాస్టిక్ వస్తువులు అనుమతించడం లేదు. అలాగే, సందర్శకులకు తేనీరు, ఆహారం, స్నాక్స్, భోజనం అందుబాటులో ఉండేలా అరణ్య పేరుతో కేఫ్‌టేరియా సిద్ధం చేశారు.

**బటర్‌ఫ్లై పార్క్..**

గోదావరి పుష్కరవనంలో నూతనంగా బటర్‌ఫ్లై పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. వివిధ రకాల మొక్కలు ఇక్కడ అధికంగా ఉండటంతో సీతాకోకచిలుకలకు ఆవాసంగా మారింది. వాటన్నింటినీ ఒకచోటకు చేర్చే విధంగా సీతాకోకచిలుకల పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు

**కోరంగి మ్యూజియం**ప్రకృతి అధ్యయన కేంద్రం కోరంగి మ్యూజియం పునరుద్ధరించేందుకూ అడుగులు పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో లభించే వివిధ అరుదైన జాతులకు సంబంధించిన జీవులను, పాపికొండల ప్రాంతంలో లభించే జంతు జాలాల అవశేషాలను ఈ మ్యూజియంలో ప్రదర్శనగా ఏర్పాటు చేయనున్నారు. 2027 పుష్కరాల నాటికి దీన్ని మరింత అధునాతనంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కసరత్తు జరుగుతోంది.

**పుష్కరాల నాటికి అధునికీకరణ**

గోదావరి నదికి 2027లో రానున్న పుష్కరాలను పురస్కరించుకుని గోదావరి పుష్కరవనాన్ని ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సందర్శకులను ఆకర్షించే విధంగా పలు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాం. పూర్తిగా ప్లాస్టిక్ రహితంగా చేయాలని ప్రయత్నిస్తున్నాం.

– దావీదు రాజునాయుడు, ఫారెస్ట్‌రేంజ్ ఆఫీస

# అక్రమాలకు పూచీకత్తు

భీమవరం : పరిధిలోని గొల్లలకోడేరు, నర్సయ్య అగ్రహారంలో కొన్ని అపార్ట్‌మెంట్ల పూచీకత్తు విషయంలో పురపాలిక అధికారులు భారీగా ముడుపులు పోగేశారు. నిర్మాణాలు పూర్తి కాకుండానే రూ.కోట్ల విలువైన ఫ్లాట్ల పూచీకత్తు రిజిస్ట్రేషన్‌ను విడుదల చేశారు. ఆ పత్రాలతో నిర్మాణదారులు బ్యాంకుల్లో భారీగా రుణాలు తీసుకున్నారు.

జంగారెడ్డిగూడెంలో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో నాలుగు ఫ్లాట్లు పూచీకత్తు రిజిస్ట్రేషన్ చేశారు. అక్రమంగా పూచీకత్తు ఒప్పందం విడుదల చేయకుండానే నిర్మాణదారులు రెండు ఫ్లాట్లు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి..రూ.కోటికి అమ్మేశారు. ఒక ఫ్లాట్ మరో వ్యక్తికి తనఖా రిజిస్ట్రేషన్ చేసి రూ.30 లక్షలు మరో ఫ్లాట్‌ను బ్యాంకులో పెట్టి రూ.40 లక్షల వరకు అప్పు తీసుకున్నారు.

పురపాలికల్లో పూచీకత్తు మాటున అక్రమాలు జరుగుతున్నాయి. కొందరు నిర్మాణాలు పూర్తి కాకుండానే పుర అధికారులకు ముడుపులిచ్చి పూచీకత్తు రిజిస్ట్రేషన్ విడుదల చేయించుకుంటున్నారు. మరికొందరు పూచీకత్తు విడుదల చేయకుండానే రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు తాయిలాలు ముట్టజెప్పి ఈ తంతు కానిచేస్తున్నారు. అక్కడితో ఆగకుండా ఆ పత్రాలతో బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడంతోపాటు తనఖా రిజిస్ట్రేషన్లు చేసి సొమ్ముచేసుకుంటున్నారు.

**నిబంధనలు పట్టవా..** పట్టణ ప్రణాళిక నిబంధనల కట్టుదిట్టంగా అమలు చేసేందుకు మొత్తం ఆస్తి విలువలో 10 శాతం వరకు పురపాలిక పేరుతో మార్ట్‌గేజ్(పూచీకత్తు) రిజిస్ట్రేషన్ చేయాలి. నిర్మాణం పూర్తి చేసిన తర్వాత అన్ని నిబంధనలు సవ్యంగా ఉంటేనే మార్ట్‌గేజ్ రిలీజ్ చేస్తారు. కానీ కొందరు అసలు నిర్మాణం పూర్తి కాకుండానే పురపాలికల్లో పట్టణ ప్రణాళిక అధికారులకు భారీ ముట్టజెప్పి ఒప్పందం



విడుదల చేసుకుంటున్నారు. ఒక్కో అపార్ట్‌మెంట్‌కు పురపాలక అధికారులు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం.. ఇలా అన్ని పురపాలికల్లో ఈ తంతు సాగుతోంది. ఫలితంగా పట్టణ ప్రణాళిక అస్తవ్యస్తంగా ఉంది. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఎన్నో సిత్రాలు..కొందరు నిర్మాణదారులు పురపాలక అధికారులతో కాకుండా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో బేరాలు కుదుర్చుకుని.. పురపాలక పేరుతో పూచీకత్తు రిజిస్ట్రేషన్ అయిన ఫ్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి అమ్మేస్తున్నారు. ఆ పత్రాలు పెట్టి బ్యాంకుల్లో రుణాలు పొందుతున్నారు. తనఖా రిజిస్ట్రేషన్లు చేయించుకుని సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో అటు పురపాలికలను, ఇటు బ్యాంకులను, తనఖా పెట్టుకుని సొమ్ము అప్పు ఇచ్చిన వారిని అడ్డంగా మోసం చేస్తున్నారు. దీనిపై ఏలూరు, పశ్చిమ కలెక్టర్లు వెట్రిసెల్వి, నాగరాణి మాట్లాడుతూ విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పరిశ్రమల వ్యర్థాలు.. కాలుష్య కారకాలు



పెనుకొండ : పెనుకొండ మండలంలోని ఎర్రమంచిలోగల కియా ఇండియా, అనుబంధ పరిశ్రమల నుంచి నిత్యం వచ్చే వ్యర్థాలను ప్రైవేటు వ్యక్తుల నిర్వహణకు వదిలేయడంతో కాలుష్యం అధికమవుతోంది. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను మండలంలోని హరిపురం సమీపంలో హంద్రీనీవా కాలువ అవతలి వైపున కొండప్రాంతంలో పడేస్తున్నారు. ఇక్కడ వ్యర్థాలను విభజించి ఆదాయం రాని వాటిని వారానికోసారి నిప్పుపెట్టి దహనం చేస్తున్నారు. దీంతో వాయు కాలుష్యం పెరుగుతోంది.

**డంపింగ్‌యార్డు కోసం స్థలం కేటాయింపు**

గతంలో పెనుకొండ–పావగడ రహదారి పక్కన దాదాపు 25ఎకరాల స్థలాన్ని కియా డంపింగ్ యార్డు కోసం కేటాయించారు. ప్రత్యేకంగా పరిశ్రమల అవసరాల కోసం ఏపీఐఐసీ ద్వారా ఎకరం రూ.10.50లక్షలతో రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఈ ప్రాంతం పరిశ్రమలకు దూరంగా ఉండడంతో వినియోగించడం లేదు. దీంతో ఆ భూమిని ఏపీఐఐసీ నూతన ఎంఎస్‌ఎంఈలకు కేటాయించేలా ప్రతిపాదనలు తయారు చేసినట్లు జెడ్‌ఎం శువనాసోని తెలిపారు. కంపెనీలో వచ్చే వ్యర్థాలను ప్రైవేటుకు అప్పగించడంతో వారు ఇష్టానుసారంగా అటవీ ప్రాంతంలో వేస్తూ కాలుష్యానికి కారకులవుతున్నారు. ఇంత జరుగుతున్నా అటు అటవీశాఖ, పర్యావరణ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కాలుష్యంతో చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**పరిశీలించి చర్యలు చేపడతాం**

మునిప్రసాద్, ఈఈ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, శ్రీసత్యసాయిజిల్లా పరిశ్రమల వ్యర్థాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతాం. కియా, అనుబంధ పరిశ్రమల వ్యర్థాల డంపింగ్ యార్డుపై సిబ్బందితో ఆరా తీసి, పర్యావరణానికి హాని కలిగించేలా ఉంటే నోటీసులు జారీ చేస్తాం.

# భూ ‘నిధి’...హతవిధీ!



కాకినాడ : జిల్లాలో పారిశ్రామిక అవసరాలకు భూముల కొరత వేధిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక.. పెద్ద సంఖ్యలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడానికి, ఎంఎస్ఎంఈ క్లస్టర్ల ఏర్పాటుకు భూబ్యాంకు సిద్ధం చేయాలని ఆదేశించింది. ఈ మేరకు కలెక్టరేట్, తహసీల్దారు కార్యాలయాల్లో దస్త్రాలను పరిశీలించి, సరిపోలుస్తున్నారు. ఈ ప్రక్రియలో 30 వేల ఎకరాలు ఉన్నట్లు లెక్కతేలింది. రౌతులపూడి, శంఖవరం, ప్రత్తిపాడు, జగ్గంపేట, కాజులూరు మండలాల్లో ఈ భూమిని గుర్తించారు. అందులో పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడేది ఉండగా, సింహభాగం కొండలు, గుట్టలే ఉన్నట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో మళ్లీ కసరత్తు మొదలుపెట్టారు. గత వైకాపా సర్కారులో ప్రభుత్వ భూములను జగనన్న కాలనీల పేరుతో లాగేశారు. గృహ నిర్మాణాలు మాత్రం సాకారం చేయలేదు. చాలాచోట్ల భూములు వృథాగా ఉన్నాయి. వీటిపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

**ఇతరాలకు సంబంధించి..**

జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ స్థలాల కొరత నేపథ్యంలో కేంద్ర ఆధీనంలోని భూములు, కొన్ని బోర్డులకు సంబంధించినవి, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందినవి గుర్తించి, వినియోగించేలా కూడా కసరత్తు జరుగుతోంది. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి వాటిని ఇప్పటికే గుర్తించారు. ః కరప, తాళ్లరేవు, కాకినాడ గ్రామీణ మండలాల పరిధిలో కేంద్ర ఆధీనంలో సుమారు 1,500 ఎకరాల ఉప్పు భూములు ఉన్నాయి. గత ప్రభుత్వంలో 150 ఎకరాలను జగనన్న కాలనీ కోసం తీసుకున్నారు. ఇంకా వందల ఎకరాలు ఉన్నాయి. ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు డిమాండ్ కూడా ఉంది. ః కాకినాడ అర్బన్ మండలంలో ఏపీఐఐసీకి చెందిన ఏడు ఎకరాలు ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల వద్ద అందుబాటులో ఉంది. నగరంలో మరో 5 ఎకరాల భూమి ఒక బోర్డుకు సంబంధించినది ఉంది. వీటిపైనా అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. బోర్డుకు సంబంధించిన భూమిపై కొన్ని వివాదాలు నడుస్తున్నాయి. ః జగనన్న కాలనీలకు సేకరించిన భూముల్లో 16 లేఔట్లకు సంబంధించి సుమారు 200 ఎకరాలు అందుబాటులో ఉన్నాయి. వీటి స్వాధీనానికి రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**నివేదిక సిద్ధం చేస్తున్నాం..**

జిల్లాలో ప్రభుత్వ భూములను గుర్తించారు. వీటి వినియోగంపై దృష్టి సారించాం. మరిన్ని భూములు సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. అన్ని కోణాల్లోనూ భూముల సేకరణ చర్యలు చేపట్టాం. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములకు సంబంధించి నివేదిక సిద్ధం చేస్తున్నాం.

– రాహుల్‌మీనా, సంయుక్త కలెక్టర్

# వెనక్కి బిల్లులు. ఎలా ఆ పనులు!



మండపేట : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గత రెండేళ్లలో 15వ ఆర్థిక సంఘం నిధులు, మున్సిపల్ సాధారణ నిధులతో పూర్తిచేసిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించేందుకు అనుమతి కోసం సీఎఫ్‌ఎంఎస్‌కు పంపగా వెనక్కి రావడంతో భవిష్యత్తులో చేయబోయే పనులకు ఆటంకం ఏర్పడనుంది. 2024 ఆగస్టులో, 2025 జనవరిలో 50 శాతం వరకు చెల్లించి మిగిలిన బిల్లులు మాత్రం వెనక్కి పంపించారు. మండపేటలో చేపట్టిన పనులకు సంబంధించి రూ.12.65 కోట్ల బిల్లులు చెలించాల్సి ఉండగా రూ.6.88 కోట్లు చెల్లించారు. మిగిలిన రూ.5.77 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అమలాపురం మున్సిపాలిటీలో రూ.6 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉండగా 2024 ఆగస్టులో రూ.కోటి, 2025 జనవరిలో రూ.కోటి చెల్లించారు. ఇంకా రూ.4 కోట్లు చెల్లించాల్సి ఉంది. రామచంద్రపురం మున్సిపాలిటీలో రూ.6 కోట్లు పనులకు గాను రూ.4.5 కోట్లు చెల్లించగా రూ.1.5 కోట్లు బిల్లులు వెనక్కు వచ్చాయి. బిల్లులు వెనక్కి రావడంతో ఇప్పటికే ప్రారంభించిన పనులు అర్ధంతరంగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడనుంది. ఉదాహరణకు మండపేట పట్టణంలో నిర్మించే 100 పడకల ఆసుపత్రి భవనంలో మాతా శిశువిభాగం నిర్మాణానికి రూ.1.8 కోట్లు, సర్జికల్ వార్డు కోసం రూ.15.8లక్షలు, గొల్లపుంత కాలనీలో నిర్మించిన మహిళా స్వశక్తి భవనం ప్రహరీ నిర్మాణానికి రూ.26 లక్షలు, క్రిస్టియన్ కమ్యూనిటీహాలులో ప్రహరీ నిర్మాణానికి రూ.27లక్షలు, రజక కమ్యూనిటీహాలకు రూ.11లక్షలు, ఇవి కాకుండా సీసీ రహదారులు, మరమ్మతులు చేపట్టగా ఈ బిల్లులన్నీ వెనక్కు వచ్చాయి.

**కొత్త నిబంధనల అమలు**

సమయం అయిపోయిందని సిఎఫ్‌ఎంఎస్ క్లోజ్ చేశారు. ఫైనాన్స్ శాఖ నుంచి కొన్ని రకాల మార్గదర్శకాలు వచ్చాయి. దాని ప్రకారం పురపాలక సంఘాలు స్వయం సమృద్ధి సాధించి వారు చేసే పనులకు వారే చెల్లించేలా నిబంధనలున్నాయి. స్లమ్‌కి 40 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఉమెన్, డిజైబుల్‌కి కొంత శాతం కేటాయించాలి. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే డీఎంఎ కార్యాలయం, ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యవేక్షణ ఉంటుంది. వీటితోపాటే మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 3 నెలలకు సరిపడా జీతాలు, విద్యుత్తు బిల్లులకు చెల్లించాల్సిన మొత్తం పక్కన పెట్టాలి. అప్పుడు మాత్రమే అభివృద్ధి పనులకు చెల్లింపులు జరపాల్సి ఉంది.

– నాగనరసింహారావు, మున్సిపల్ ఆర్డీ, రాజమహేంద్రవరం.

# చెరువులో రహదారి నిర్మాణం

రోలుగుంట : శరభవరం శివారు రాజన్నపేట సమీపంలోని నల్లరాతి క్వారీ నుంచి బండరాళ్ల తరలింపు వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. బండరాళ్లను తరలించే భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు దెబ్బతింటున్నాయి. బుచ్చెంపేటలో మరిడమ్మ ఆలయానికి వెళ్లే దారి ఆర్చి లారీలు ఢీకొని కుప్పకూలింది. దీంతో స్థానిక నవతరం యూత్ సభ్యులు, గ్రామస్థులు క్వారీ వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. క్వారీ యాజమాన్యం లారీలు బుచ్చెంపేట మీదుగా రాకుండా ప్రత్యామ్నాయ దారిని ఏర్పాటు చేసుకుంది. బుచ్చెంపేట, గొల్లపేట, వడ్డిప తదితర గ్రామాలకు చెందిన రైతుల భూములను ఏడాదిపాటు లీజు ప్రాతిపదికన తీసుకుని రోడ్డు నిర్మించింది. రాజన్నపేటలో క్వారీకి దగ్గరగా ఉన్న భూపతి చెరువును ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేపట్టడంపై రైతుల నుంచి అభ్యంతరం వ్యక్తమవుతోంది. సర్వే నంబరు 57/2లో 3.66 ఎకరాల విస్తీర్ణంలోని భూపతి చెరువును కొంతమేర కప్పేసి రోడ్డు వేశారని ఆరోపిస్తున్నారు. రాజన్నపేట రోడ్డు నుంచి వడ్డిప వరకు రైతుల భూముల్లో నిర్మించిన రోడ్డు మీదుగా లారీల రాకపోకలతో పక్కనున్న పొలాలు దెబ్బతింటాయని చెందుతున్నారు.

# తడారిన శివారు గొంతులు

ఆదోని : పట్టణ శివారు ప్ర‘జల’ గొంతెండుతోంది..బిందెడు నీటికి పడరాని పాట్లు పడుతున్నారు.. ఇంటింటికి కుళాయిలు లేకపోవడం.. కొన్నిచోట్ల పైపులైన్లు అస్తవ్యస్తంగా ఉండటం.. తరచూ లీకేజీలతో సమస్య ఎదురవుతోంది. ప్రస్తుత వేసవిలో చాలా కాలనీలకు రెండు మూడు రోజులకోసారే తక్కువ సమయం నీళ్లు వదులుతున్నారు.

**రోజుకు 135 లీటర్లు**

పురపాలికల లెక్కల ప్రకారం మనిషికి రోజుకు 135 లీటర్ల నీరివ్వాలి. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో 17–18 లక్షల జనాభా ఉంది. లక్ష మందికి 13 ఎం.ఎల్. నీరు అవసరం. అదే పది లక్షల మంది జనాభాకు 130 ఎం.ఎల్. ఈ లెక్కన మొత్తం పురపాలికల్లోని జనాభాకు 240 ఎం.ఎల్. నీరు అవసరం. 75 శాతం నీరు సరఫరా చేయడం లేదు. ఆదోనిలో 26 ఎం.ఎల్. (ఒక ఎం.ఎల్.=పది లక్షల లీటర్లు) నీరు ఇవ్వాల్సిన చోట 22 ఎం.ఎల్. మించడం లేదు.నీటి రవాణా విషయానికొస్తే కర్నూలు మహానగరానికి ఏడు ట్యాంకర్లున్నాయి. ఆదోని పురపాలికకు ఉన్న ఒకటి కూడా పనిచేయడం లేదు.

**వదిలేసిన వైకాపా**

కేంద్రం అమృత్ పథకంతో పాటు ప్రత్యేకంగా నిధులిచ్చేందుకు ముందుకొచ్చినా.. గత వైకాపా ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేకపోయింది. రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి.



అమృత్ 2.0 కింద 2023లో కర్నూలు, నంద్యాల, ఆదోని పురపాలికల్లో గత కేంద్ర ప్రభుత్వం రూ.438 కోట్లతో నీటి ప్రాజెక్టులిచ్చింది. వైకాపా పాలనలో డీపీఆర్ దశ దాటించలేకపోయింది. ఫలితంగా మూడు పురపాలికల్లో నీటి సమస్యలు తలెత్తుతున్నాయి.

**నగరంలో నరకం**

కర్నూలు నగరంలోని 52 వార్డుల్లో సుమారు 6.5 లక్షల మంది నివసిస్తున్నారు. రోజూ 120 ఎంఎల్‌డీ నీటి సరఫరా అవసరం ఉండగా..ప్రస్తుతం 95 ఎంఎల్‌డీ మాత్రమే లభిస్తోంది. శివారు కాలనీలు, విలీన గ్రామాల్లో సగటున ఒక్కో కుటుంబం రోజూ రూ.40 వరకు నీటి కోసం ఖర్చు చేస్తున్నాయి.

విలీన గ్రామాలైన పందిపాడు, పెద్దపాడు, లక్ష్మీపురం, దూపాడులలోని గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న పైపులైన్ల ద్వారా సరఫరా అవుతున్న నీరే దిక్కవుతోంది. మంచినీటిని కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 20 లీటర్ల నీటి క్యానుకు రూ.20 వెచ్చిస్తున్నారు.

సరిపడా ట్యాంకర్లను నగరపాలక సంస్థ సరఫరా చేయడం లేదు. రోజూ 20 ట్యాంకుల కంటే ఎక్కువగా శివారు కాలనీలు, విలీన గ్రామాలకు పంపడం లేదని తెలిసింది. లెక్కల్లో మాత్రం ట్యాంకర్లను పంపిస్తున్నట్లు చూపుతున్నారని సమాచారం.

**రూ.కోట్ల వ్యాపారం**

ఉమ్మడి జిల్లాలో పది పురపాలికల్లో 321 వార్డులు.. సుమారు 18 లక్షల జనాభా ఉంది. ఇందులో పది శాతం జనాభా అంటే.. కుటుంబానికి నలుగురు చొప్పున లెక్కించినా 1.80 లక్షల జనాభాకు 25వేల కుటుంబాలు రోజు తాగునీటి కోసం రూ.20 చొప్పున డబ్బా కొనుగోలు చేసినా.. రోజు వారీ నీటికి వెచ్చిస్తున్న మొత్తం రూ.5 లక్షలు నెలకు రూ.1.50 కోట్లు వెచ్చిస్తున్నారు.

**ఆదోనిలో అవస్థలు**

శివారు కాలనీలు: 15

సమస్య ఉన్న కాలనీలు: క్రాంతినగర్, వైఎస్ఆర్.నగర్, కల్లుబావి, రాయనగర్, పైకొట్టాలు, దేవినగర్, తదితర ప్రాంతాలు.

ట్యాంకర్లు: ఆదోని పురపాలికల్లో ఒక ట్యాంకరే ఉంది. అదీ మరమ్మతుకు గురైంది.

పురపాలక సంఘం వారు రెండు.. మూడు రోజులకోసారి నీరు సరఫరా చేస్తున్నారు. వీటినే పొదుపుగా వినియోగిస్తున్నారు.

పరిష్కారం: శివారు కాలనీల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.130 కోట్లతో అమృత్ 2.0 కింద కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నగర్ ప్రాంతంలో నీటి నిల్వ ప్లాంట్ల నిర్మాణాలు చేపట్టాలని భావిస్తున్నారు.

చేనేతపురిలో కష్టాలు

శివారు కాలనీలు: 17

ఎన్ని కాలనీలకు పైపులైన్ ఉంది : 5

నీటి కష్టాలున్న కాలనీలు: హనుమాన్‌నగర్, సంజీవ్‌నగర్, శక్తినగర్, మహబూబ్‌నగర్‌కాలనీ, సాయినగర్, తిరుమల్‌నగర్, సాయిగణేశ్ కాలనీ, ఎల్లమ్మబీడు, చెన్నకేశవరెడ్డినగర్, కొత్త ఎస్సీ కాలనీ, శాంతినగర్, మునెప్పనగర్ ప్రాంతంప్రస్తుతం పురపాలక నుంచి ఎన్ని ట్యాంకర్లు పంపిస్తున్నారు : 2 ప్రతి కుటుంబం నీటికోసం రోజుకు ఎన్ని డబ్బులు వెచ్చిస్తున్నారు: రూ.70

# నాగలూటి

నందికొట్కూరు : నాగలూటి నాపరాతి గనుల్లో ఎర్రమట్టి దందా జోరుగా సాగుతోంది. గనుల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా మన్ను తోడి సొమ్ము చేసుకొంటున్నారు. మిడుతూరు మండలం నాగలూటి, పీరుసాహెబ్‌పేట, నందికొట్కూరు మండలం నాగటూరు గ్రామాల పరిధిలో నాపరాతి గనులు ఉన్నాయి. పైభాగంలో పెద్ద ఎత్తున ఎర్రమట్టి ఉంటుంది.. దానిని తోడి రాళ్లు తీస్తుంటారు.. ఈ క్రమంలో వచ్చే మన్నును గతంలో గుట్టలుగా పోసేశారు. ప్రస్తుతం మార్కెట్లో ఎర్రమట్టికి బాగా డిమాండ్ ఉండటంతో గనుల లీజుదారులు మట్టి దందా మొదలు పెట్టారు. నిబంధనల ప్రకారం లీజుదారులు కేవలం గనులే తవ్వాలి.. గనుల తవ్వకం పూర్తయిన తర్వాత మట్టితో గోతులు పూడ్చాలి.. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా ఆ మట్టిని విక్రయిస్తున్నారు.సోలార్ కంపెనీకి తరలింపు

నాగలూటి నాపరాతి గనుల నుంచి నిత్యం 50 టిప్పర్లు, 100 ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. నాగలూటి సమీపంలో గట్టుపై ఓ సోలార్ కంపెనీ పనులు చేపడుతోంది.. అక్కడ రహదారులకు అవసరమైన మట్టిని నాగలూటి నుంచి తీసుకెళ్తున్నారు. ఇందుకు గనుల యజమానులతో ముందస్తు ఒప్పందం చేసుకొన్నారు.. ఎకరం విస్తీర్ణంలో మట్టి తోడినందుకు రూ.2 లక్షలు చెల్లిస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా నందికొట్కూరు పట్టణ పరిధిలో వెంచర్లు వెలుస్తున్నాయి. అక్కడ ఏర్పాటు చేస్తున్న రహదారులకు నాగలూటి నుంచే మట్టిని తీసుకెళున్నారు. ఇందుకు ఒక ట్రాక్టర్‌కు రూ.1,200 తీసుకుంటున్నారు.

# సమాచారమిచ్చినా తీసుకెళ్లరే..!

రాజమహేంద్రవరం : వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో చేరుతున్న పార్సిళ్లలో కొన్ని డెలివరీ కావడం లేదు. సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించినా తీసుకెళ్లడం లేదు. మరికొన్నింటికి సంబంధించి ఆయా వ్యక్తుల చిరునామా నంబర్లు పనిచేయక.. అసలు అవి ఎవరివో కూడా తెలియని పరిస్థితి. ఇటువంటి వాటిని వారాలు, నెలల తరబడి భద్రపరచడానికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రైవేటు పార్సిల్ రవాణాతో పోలిస్తే ఆర్టీసీ లాజిస్టిక్స్‌లో పార్సిల్ రవాణా ఛార్జీ తక్కువ కావడం.. సురక్షితంగా అనుకున్న సమయానికి గమ్యస్థానానికి చేరుతాయనే భరోసా, బీమా సౌకర్యం ఉండడంతో ఎక్కువ మంది ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలోని కార్గో పార్సిల్ కేంద్రాల ద్వారా రోజూ 1,600 వరకు బుకింగ్ జరుగుతుండగా, వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడి డెలివరీ కేంద్రాలకు 1,100 వరకు వస్తున్నాయి. పార్సిల్ రవాణా సేవల ద్వారా జిల్లా ఆర్టీసీకి ఏటా రూ.12 కోట్ల నుంచి రూ.14 కోట్ల



వరకు ఆదాయం సమకూరుతోంది. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ బయట ప్రాంతాల నుంచి వచ్చే కొన్ని పార్సిళ్లను సంబంధిత వ్యక్తులు తీసుకెళ్లకుండా వదిలేయడంతో డెలివరీ కేంద్రాలు నిండిపోతున్నాయి. వీటిలో ఎక్కువగా పాత పేపర్లు, పుస్తకాలు, వస్త్రాలు, ఔషధాలు, పాత ఎలక్ట్రికల్ వస్తువులు ఉంటున్నాయని ఆర్టీసీ కార్గో అధికారులు చెబుతున్నారు.

**48 గంటలు దాటితే అపరాధ రుసుము..**

వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ డెలివరీ కేంద్రాలకు చేరిన పార్సిళ్లను 48 గంటల వ్యవధిలో సంబంధిత వ్యక్తులు తీసుకెళ్లాలి. లేకుంటే ఒక్కొక్క దానికి రోజుకు రూ.5 చొప్పున అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. రెండు నెలలు దాటినా తీసుకెళ్లని వాటిని బహిరంగ వేలం ద్వారా విక్రయించే అధికారం ఆర్టీసీ అధికారులకు ఉండడంతో చివరకు అదే పని చేస్తున్నారు. ఇలా ఏడాది కాలంలో పేరుకుపోయిన 583 పార్సిళ్లకు వేలం నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు.

# పనులు దండి.. నాణ్యత తొండి

శ్రీశైల దేవస్థానంలో ఇంజినీరింగ్ విభాగం అక్రమాలకు అడ్డాగా మారుతోంది. అంచనాలు, ప్రణాళికలు రూపొందించి, టెండర్లు పిలిచిన తర్వాత చేయాల్సిన పని కాకుండా వేరొకటి చేస్తున్నారు. అనుమతులు తీసుకోవడానికి ఈ-ఫైల్ విధానాన్ని అనుసరించకుండా చేతిరాతతో దస్త్రాలు సిద్ధం చేస్తూ ఉన్నతాధికారులను బురిడీ కొట్టిస్తున్నారు. ఏఈ నుంచి ఈఈ స్థాయిలో పనిచేస్తున్న ఒక ఇంజినీరు పర్యవేక్షణలోనే పనులన్నీ సాగుతుండటం గమనార్హం. సుదీర్ఘకాలం నుంచి క్షేత్రంలో తిష్టవేసిన ఆయన బినామీలతో పనులు చేయిస్తూ నాణ్యతను పాతరేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత నాలుగేళ్లుగా శాశ్వత పనులను పక్కనబెట్టి మొక్కుబడిగా చేసే రూ.40 లక్షల అంచనా పనులకు ప్రాధాన్యమివ్వడం గమనార్హం. ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గణేశ్ సదన్ సీసీ రోడ్డు, నక్షత్రవనం, ఇతర పనులను తనిఖీ చేసి ఆరా తీశారు.

**చెప్పేదొకటి.. చేస్తున్నది మరొకటి**

రెండేళ్ల కిందట ఆలయ ముందుభాగంలోని గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు సుమారు రూ.80 లక్షల అంచనాతో బీటీ రోడ్డు నిర్మించడానికి అప్పటి ఈవో ఎస్.లవన్న, ఈఈ, డీఈలు భూమిపూజ చేశారు. తర్వాత నిర్ణయం మార్చుకుని ఆలయ వెనుక పశ్చిమ మాడవీధిలో గ్యాలరీ పనులు చేపట్టారు. గ్యాలరీ నిర్మాణాలకు సగం నిధులు చెల్లించినట్లు సమాచారం. అనుమతులు లేకుండా బీటీ రోడ్డు పనిని గ్యాలరీగా మార్చి చేస్తుండటంపై ఆడిట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఉమామహేశ్వర ఆలయం వద్ద రథం కోసమని సుమారు రూ.35 లక్షలతో నిర్మించిన షెడ్డు నిరుపయోగంగా మారింది.

దేవస్థానం ఆసుపత్రి నుంచి అన్నదాన భవనం వరకు రహదారి విస్తరణ పనులు చేయాలని అధికారులు నిర్ణయించారు. బి.టి.రోడ్డుకు అటువైపు బాగున్న ఇంటర్‌లాకింగ్ టైల్స్ తొలగించి సీసీ రోడ్డు నిర్మించారు.



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మురుగు కాల్వపై ప్రీకాస్ట్ స్లాబ్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పనులు మొదలు పెట్టిన తర్వాత సీసీ రోడ్డు తరహాలో మందంగా రెండు స్లాబులు నిర్మించారు.

**గుత్తేదారులకు మద్దతు**

గణేశ్ సదన్ పక్కన సుమారు రూ.కోటికి పైగా అంచనాలతో నక్షత్ర వనం పనులు మొదలు పెట్టారు. చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టి అర్ధంతరంగా వదిలివేశారు. ఇందులో గుత్తేదారు, ఇంజినీర్ల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు.

సిద్ధరామప్ప దుకాణ సముదాయంలో నిరుపయోగంగా ఉన్న గదులను అందుబాటులోకి తెచ్చేందుకు 2022లో అప్పటి ధర్మకర్తల మండలి, ఈవో నిర్ణయం తీసుకున్నారు. ఖాళీగా ఉన్న గదులను రూ.1.30 కోట్ల అంచనాతో 22 సూట్ రూమ్స్‌గా మార్చాలని టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టారు. గుత్తేదారు, ఇంజినీర్లు పనులను మూడేళ్లపాటు నత్తనడక చేశారు. రెండు లిఫ్ట్‌ల ఏర్పాటులో తీవ్ర జాప్యం చేశారు. గదుల నిర్మాణ పనులు, వైరింగ్, లిఫ్ట్ పనులను ఒకే టెండర్ పిలిచి పనులు చేయాల్సి ఉండగా, మూడుగా విభజించి గుత్తేదారులకు లబ్ధి చేకూర్చారన్న విమర్శలు ఉన్నాయి. ఇంత వరకు సూట్ గదులు భక్తులకు అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

ఆగమ పాఠశాల వద్ద షెడ్ల నిర్మాణ పనులను గడువులోపు పూర్తి చేయకుండా సాకులు చెబుతున్న గుత్తేదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేస్తున్నారు.

# నాడు శిథిలం.. నేడు పదిలం



అనంతపురం : అనంతపురం జిల్లా సాగునీటి రంగంలో ఎంతో కీలకమైన హెచ్చెల్సీ పునరుద్ధరణకు కూటమి సర్కారు నడుం బిగించింది. గతేడాది డిసెంబరులో సీఎం చంద్రబాబు నేమకల్లుకు వచ్చిన సందర్భంలో మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు హెచ్చెల్సీ దుస్థితిని వివరించారు. నిధులు మంజూరు చేయడంతో వంతెనల పునర్నిర్మాణంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా యూటీలు, లైనింగ్ పనులు చేపట్టారు. వంతెనలు పిల్లర్ల దశలో ఉన్నాయి 11 పనులకు గాను తొమ్మిదింటిలో పనులు మొదలయ్యాయి.

**తీరనున్న వంతెన వెతలు**

హెచ్చెల్సీ కాలువపై మల్లికేతి, దర్గాహొన్నూరు, కణేకల్లు, మాల్యం, మీనహళ్లి, నాగేపల్లి గ్రామాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన వంతెనలు వైకాపా హయాంలో కూలిపోయాయి. దీంతో స్థానికులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేది. 165వ కి.మీ. వద్ద రూ.1.59 కోట్లు, 169వ కి.మీ. వద్ద రూ.1.91 రూ.కోట్లు, ఉద్దేహాళ్-మల్లికేతి గ్రామాల మధ్య 115 కి.మీ. వద్ద రూ.1.66 కోట్లతో వంతెనల నిర్మాణం చేపట్టారు. 147 కి.మీ. వద్ద రూ.4.21 కోట్లతో ప్రధాన కాలువపై ఔట్‌పాల్ రెగ్యులేటర్, యర్రగుంట వద్ద 137.7 కి.మీ వద్ద రూ.4.1 కోట్లతో అండర్ టన్నెల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

**15 శాతం పూర్తి**

ప్రధాన కాలువలో 15 కిలోమీటర్ల లైనింగ్ పనులు మొదలుపెట్టారు. 115వ కి.మీ. నుంచి 130 కి.మీ. వరకు రూ.9 కోట్లతో లైనింగ్ చేయనున్నారు. ఇప్పటికే అన్ని పనులు కలిపి 15 శాతం వరకు పూర్తయ్యాయి. పునరుద్ధరణ పూర్తయితే చివరి ఆయకట్టులోని 2 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది.

**పూర్తిగా నిర్లక్ష్యం..**

వైకాపా ప్రభుత్వంలో హెచ్చెల్సీని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. 2019లో అధికారంలోకి రాగానే ఆధునికీకరణ పనులను రద్దు చేశారు. ఐదేళ్లపాటు అధికారులు పంపిన ప్రతిపాదనలను పక్కనపెట్టారు. వంతెనలు కూలిపోయినా పట్టించుకోలేదు. కాలువ బలహీనంగా ఉండటంతో తుంగభద్ర వాటా నీటిని వినియోగించుకోలేకపోయారు.

**పనులకు శ్రీకారం..**

కూటమి ప్రభుత్వం రాగానే హెచ్చెల్సీలో అత్యవసరంగా చేపట్టాల్సిన మరమ్మతులపై దృష్టి సారించింది. బడ్జెట్‌లో రూ.37 కోట్లు కేటాయించింది. రూ.28 కోట్లకు టెండర్లు పిలిచి పనులకు శ్రీకారం చుట్టారు. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి 0.5 టీఎంసీలు అదనంగా తీసుకొచ్చి పంటలను కాపాడారు.

# హంగుల ప్రదర్శనశాలలో అద్భుత ప్రాచీనం



ఎస్కేయూ : విజ్ఞాన విహార యాత్రలంటే విద్యార్థులకు సరదా. పర్యాటక ప్రదేశాలకు వెళ్లి అక్కడి వింతలు, విశేషాలు తెలుసుకోవాలనే ఉత్సుకత ఉంటుంది. అలాంటి విశేషాలు తెలిపే మ్యూజియం ఒకటి మన జిల్లా కేంద్రంలోనూ ఉంది. చారిత్రక, వారసత్వ విశేషాలు తెలపడంతోపాటు విజ్ఞానాన్ని పంచుతోంది. మన ప్రాచీన చరిత్ర, సమాజం, ఆచారాలు, సంప్రదాయాలు, ఉపయోగించిన వస్తువులు, ఆయుధాలు, నాణేలు, రచనలు, శిల్పాలతో ఈ మ్యూజియం అందరినీ ఆకట్టుకుంటోంది. జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు కల్లూరు సుబ్బారావు పేరిట 1992లో ఈ ప్రదర్శనశాల నిర్మించారు. అప్పట్లో పాత భవనంలోనే పురావస్తు ప్రదర్శనశాఖ ఉండేది. ఇటీవల హంగులతో కొత్త భవనాన్ని నిర్మించారు. 10-3-2024 నుంచి సందర్శకులకు అందుబాటులోకి వచ్చింది.

**వెళ్లాలంటే..** అనంతనగరం ఆదిమూర్తి నగర్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయం ఎదురుగా ఉన్న ఈ మ్యూజియం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకూ అందుబాటులో ఉంటుంది. శుక్రవారం ఈ ప్రదర్శనశాలకు సెలవు. ప్రవేశానికి పిల్లలకు రూ.20, పెద్దలకు రూ.30 టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. పాఠశాల తరఫున 25 మందిపైగా విద్యార్థులు ఒకేసారి వస్తే ఒక్కొక్కరికి రూ.10లు చెల్లిస్తే చాలు. విదేశీయులకు, ఫొటో, వీడియోలు చిత్రించాలంటే అదనంగా రుసుం ఉంటుంది.

**రాజుల కాలంలో ఉపయోగించిన ఆయుధాలు**

మొదటి అంతస్తులో ప్రాచీన యుగం, మధ్యయుగం, నవీనయుగం నాటి రాతి పనిముట్లు, హిందూ, జైన, బౌద్ధమతాలకు సంబంధించిన రాతి విగ్రహాలు. చెక్కపీఠాలు, వివిధ భంగిమల దేవతల విగ్రహాలు ఉంచారు. శిలాయుగం నాటి మానవుల రాతి గొడ్డళ్లు ఇతర ఆయుధాలు దర్శనమిస్తాయి. రెండో అంతస్తులో నవీన శిలాయుగం నాటి మట్టిపాత్రలు, బృహత్ శిలాయుగపు కుండలు, బూడిద ముద్దలు, ఇనుప పనిముట్లు, ఏనుగు ఆకారపు సార్కోఫోగస్, టెర్రకోట బొమ్మలు, దాల్కో లిథిక్ కాలానికి చెందిన కత్తులు, ఇటుకలు, సున్నపు బొమ్మలు, కాంస్య ప్రతిమలు, నాణేలు, చైనా పింగాణి పాత్రలు ఎముకలతో చేసిన వస్తువులు ఉన్నాయి. శాతవాహనులు, ఇక్ష్వాకులు, కాకతీయులు, విజయనగరరాజుల కాలం నాటి నాణేలు, ఇటుకలు చూడొచ్చు. మూడో అంతుస్తులో పురాతన ఖడ్గాలు, బాణాలు, తామ్ర పత్ర గ్రంథాలు, తాళపత్రాలు ఆకట్టుకుంటున్నాయి.

# బడిగంటకు ముందే సరికొత్త హంగులు




అచ్యుతాపురం : ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఒక వైపు విద్యావిధానంలో మార్పులను తీసుకొస్తూ.. మరోవైపు పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పన దిశగా అడుగులు వేస్తోంది. వేసవి సెలవులు ముగిసి.. బడులు తెరిచేలోగా అవసరమైన పనులు పూర్తి చేసి అదనపు తరగతి గదులు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోంది.

జిల్లావ్యాప్తంగా 1,396 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో కొన్నింటి అభివృద్ధికి గత వైకాపా ప్రభుత్వం నాడు-నేడు పేరుతో నిధులు కేటాయించింది. మొదటివిడత మంజూరైన నిధుల్లో సింహభాగం వైకాపా నాయకుల జేబుల్లోకి పోగా, బడుల్లో మౌలిక వసతుల కల్పన రంగులకే పరిమితమైంది. రెండో దశలోనూ అవినీతి మరకలు లేకుండా పాఠశాలలు బాగు చేయడానికి ముందుకు రాకపోవడం, వైకాపా నాయకులు ఒత్తిడి పెరిగిపోవడంతో చాలా పాఠశాలల్లో పనులు చేయించడానికి ప్రధానోపాధ్యాయులు ముందుకురాని పరిస్థితి ఏర్పడింది. ఈలోగా ఎన్నికలు రావడంతో రెండవ దశ పనులు అటకెక్కించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడుల్లో పూర్తిస్థాయి వసతుల కల్పనపై దృష్టి పెట్టింది. మన బడి-మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రూ. 8.55 కోట్లతో అదనపు గదుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ నెలాఖరుకు వీటిని పూర్తి చేసేలా ప్రణాళిక పెట్టుకొని సమగ్ర శిక్షా అధికారులు పనిచేస్తున్నారు. దీంతోపాటు 20 కస్తూర్బా విద్యాలయాల్లో 30 అదనపు తరగతి నిర్మాణాలు చేపట్టారు. బడిగంట మోగేలోగా అన్నిచోట్లా పనులు పూర్తిచేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం పనిచేస్తోంది. వరండాలో తరగతులు నిర్వహించే పరిస్థితి ఉండకూడదని ఇప్పటికే అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**వసతుల కల్పనకు పెద్దపీట**

పీఎంశ్రీ పథకం కింద రూ. 2.33 కోట్లతో 15 రసాయన ప్రయోగశాలల నిర్మాణం జరుగుతోంది. 36 పాఠశాలల్లో రూ.1.75 కోట్లతో క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నారు.

18 బడుల్లో రూ. 2.2 కోట్లతో రెయిలింగ్ పనులు, 20 పాఠశాలల్లో రూ. 30 లక్షలతో కిచెన్ గార్డెన్లు తయారుచేశారు.

భూగర్భజలాలను పరిరక్షించడానికి 21 బడుల్లో రూ. 21 లక్షలతో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. రూ. 69 లక్షలతో గ్రంథాలయాల గదులు, 10 చోట్ల రూ. 1.85 కోట్లతో కంప్యూటర్ గదులు నిర్మిస్తున్నారు.

**జూన్ నాటికి పూర్తి చేస్తాం- ఆర్.జయప్రకాశ్, సమగ్ర శిక్షా జిల్లా అదనపు పథ సమన్వయకర్త**


పాఠశాలలు ప్రారంభించే సమయానికి నిర్మాణంలో ఉన్న గదులను పూర్తి చేయించడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాం. కస్తూర్బా విద్యాలయాల్లో ఎక్కువ అదనపు గదులు నిర్మాణంలో ఉన్నాయి. వీటితోపాటు రక్షణ గోడలు, గ్రంథాలయాలు, కిచెన్ గార్డెన్లు, రసాయన ప్రయోగశాలలు.. ఇలా పాఠశాల అనుబంధంగా జరుగుతున్న అన్ని పనులను సకాలంలో పూర్తిచేయించి అందుబాటులోకి తీసుకొస్తాం. జరుగుతున్న పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం.

# చుక్కల భూమికి రెక్కలు

కర్నూలు : కల్లూరు మండలం ఉలిందకొండలో సర్వే నంబరు-652లో 3.40 ఎకరాలు, సర్వే నంబరు-653లో 4.48 ఎకరాల చుక్కల భూమిని వైఎస్సార్ జిల్లాకు చెందిన ఎస్.ఆశాబి పేరుపై ఆన్‌లైన్ చేశారు. వీటిని నిషేధిత జాబితా నుంచి తొలగించకుండా దస్త్రాలు మార్చి ఆమె పేరు చేర్చారు.. కొన్నాళ్లకు ఆ మహిళ కర్నూలు నగరానికి చెందిన ఓ రాజకీయ నాయకుడు, స్థిరాస్తి వ్యాపారికి 2021లో రిజిస్ట్రేషన్ చేశారు. 2023లో జరిగిన రీసర్వేలో ఎల్‌పీఎం నంబర్లు కేటాయించారు.

**'క్షేత్రం' తక్కువ.. నమోదు ఎక్కువ**

కర్నూలు గ్రామీణ మండలం బి.తాండ్రపాడుకు చెందిన బోయ భూలక్ష్మికి ఉలిందకొండలో ఖాతా నంబరు 2334, పాత సర్వే నంబరు 635లో 10.15 ఎకరాలు చూపుతూ.., అదే గ్రామ పరిధిలో 634 సర్వే నంబరులో 4.097 ఎకరాల భూమిని ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు చేశారు. 635లో మంగమ్మకు 7.07 ఎకరాలు, భూలక్ష్మికి 3.01 ఎకరాల భూమిని ఆన్‌లైన్ అడంగల్‌లో చేర్చారు. ఆన్‌లైన్‌లో



నమోదు చేసినదానికంటే ఎక్కువగా 5912/2024 డాక్యుమెంట్ నంబరుతో 2024 మార్చి 7న 4.06 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. అదే సర్వే నంబరు పేరుతో 0.94 సెంట్ల భూమిని డాక్యుమెంట్ నంబరు 6193/2024లో మరో రిజిస్ట్రేషన్ చేశారు. బోయ భూలక్ష్మికి ఏకంగా 7.10 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేశారు. ఆ వెంటనే స్థిరాస్తి వ్యాపారికి భూమిని విక్రయించేసి సొమ్ము చేసుకున్నారు.

**పట్టా భూములు మార్చేశారు**

హాలహర్వి మండలం జె.హొసళ్లిలో సర్వే నంబరు-51బీలో 17.82 ఎకరాలు పూర్వీకుల నుంచి సంక్రమించిన పట్టాభూమి ఉంది. ఆర్‌హెచ్ నకలు, ఇతర రెవెన్యూ దస్త్రాలు ఉన్నాయి. కుటుంబ సభ్యులు ఏడుగురు భాగపరిష్కారాలు చేసుకోవాల్సి ఉంది. 3.53 ఎకరాల భూమే వారి పేరున ఆన్‌లైన్‌లో ఉంది. మిగిలిన 14.29 ఎకరాలను 2022లో జులైలో 11 మందికి కట్టబెట్టారు. తహసీల్దారు, గ్రామ వీఆర్వో భారీగా ముడుపులు తీసుకొని ఇతరులకు రాసిచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుడు అయ్యప్పగారి వెంకటేష్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ డా.బి నవ్యకు మొర పెట్టుకున్నారు.

**ఎన్నికల ముందు కట్టబెట్టారు**

ఉలిందకొండకు చెందిన బెస్త మంగమ్మకు ఖాతా నంబరు-2335, సర్వే నంబరు-653లో 7.07 ఎకరాల చుక్కల భూమిని 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు చేశారు. ఈ-పాసు పుస్తకం రాకముందే పథకం ప్రకారం 24-01-2024లో 1050/24 డాక్యుమెంట్ నంబరుతో ఓ రియల్టర్‌కు రిజిస్ట్రేషన్ చేశారు. ఆ ప్రభుత్వ భూమి కాదు.. పూర్వీకుల నుంచి సంక్రమించినట్లు పత్రాల్లో రాసుకోవడం గమనార్హం.

**దస్త్రాలు మార్చేసిన అధికారులు**

పేదల భూములు పెద్దలకు కట్టబెడుతున్నారు.. ప్రభుత్వ భూములు రాసిచ్చేస్తున్నారు. ఎసైన్‌మెంట్ కమిటీ నిబంధనలు అతిక్రమించి చుక్కల భూములు ఓ స్థిరాస్తి వ్యాపారికి కట్టబెట్టిన అంశం తాజాగా వెలుగులోకి వచ్చింది. నగరంలో ఉంటున్న ఆయన కొంతమంది రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకొని అనధికారిక వ్యక్తులు, స్థానికేతరుల పేరిట ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు చేయిస్తున్నారు. భూములు ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు చేసినందుకు ఓ వీఆర్వోకు సదరు స్థిరాస్తి వ్యాపారి తన వెంచర్‌లో రూ.20-30 లక్షల విలువ చేసే ఓ ఇంటిని బహుమతిగా ఇచ్చారనే ప్రచారం సాగుతోంది. తహసీల్దారు చేతుల్లో ఉండాల్సిన 'డిజిటల్ కీ' పొరుగుసేవల సిబ్బంది చేతిలో ఉండటంతో వారు ఇష్టానుసారంగా భూరికార్డులను మార్చేస్తున్నారు.

# రక్త గ్రహీత.. విధిపై విజేత!

ఏలూరు : సమస్యల్ని అధిగమించినప్పుడు.. సవాళ్లు స్వీకరించినప్పుడు.. వైకల్యాలు, వైఫల్యాలు చిన్నబోతాయి. భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తాయి. ఇందుకు తలసీమియా బాధిత పిల్లలే నిదర్శనం. బతుకుపై నిత్య పోరాటం చేస్తూ.. అనారోగ్య ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆరోగ్యకర జీవనం వైపు అడుగులేస్తున్నారు. వారికి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులే కొండంత అండగా నిలుస్తూ.. ఆత్మస్థైర్యం నింపుతున్నారు. గురువారం అంతర్జాతీయ తలసీమియా నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

**అయినా ఎదిరించి.. ఉన్నత విద్యనభ్యసించి!**

ఏలూరు నగరానికి చెందిన ఓ యువతి ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నారు. తల్లిదండ్రులు ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తుండగా.. ఒక్కరే కుమార్తె. ఈమె ఆర్నెల్ల వయసులోనే తలసీమియా బారిన పడ్డారు. దీర్ఘకాలిక వ్యాధిని, కష్టాలను అధిగమిస్తూ చదువులో దూసుకెళ్తున్నారు. పదో తరగతిలో 9.6 జీపీఏ, ఇంటర్‌లో 968 మార్కులు సాధించి, ఎంబీబీఎస్‌లో ఉచిత సీటు పొందారు. ప్రస్తుతం నెలకు రెండుసార్లు రక్త మార్పిడి చేయించుకుంటున్నారు. నీట్ రాసే సమయంలో ప్లేట్‌లెట్లు పడిపోవటంతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. తల్లిదండ్రులు ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్సనందించడంతో కోలుకున్నారు.

**అధైర్యపడకుండా ముందుకు..**

కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడేనికి చెందిన దంపతులు కూలీలు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. తమకు ఉన్నంతలో కుమార్తె, కుమారుడిని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. కుమారుడికి నాలుగో నెలలోనే తలసీమియా సోకింది. ప్రస్తుతం బాలుడి వయసు తొమ్మిదేళ్లు కాగా, మూడో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ప్రతినెలా రెండుసార్లు ఏలూరు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తలసీమియా చికిత్సా భవనంలో రక్తమార్పిడి చేయిస్తున్నారు. తమ కుమారుడికి వ్యాధి సోకిందని ఎప్పుడూ బాధపడలేదని.. దాన్ని అధిగమిస్తూ అతడి భవిష్యత్‌పై దృష్టి సారించామని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఏలూరు తలసీమియా భవనంలో మొత్తం 350 మంది బాధితులు రక్తమార్పిడి చేయించుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాల బాధితులు ఏలూరొచ్చి సేవలు పొందుతున్నారు. ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, పోలవరం మండలాల నుంచి ఎక్కువ మంది వస్తుంటారు. వీరికి ప్రతి నెలా 1000 యూనిట్లు అవసరం కాగా, కొన్నాళ్లుగా రక్త నిల్వలు లేకపోవడంతో 700 నుంచి 800 యూనిట్లు మాత్రమే సమకూరుస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో సమస్య ఎదురవుతోంది. కొన్ని సందర్భాల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో బాధిత పిల్లలు ఒక్కో విడతకు రూ.4 వేల నుంచి రూ.5 వేలు వెచ్చించి రక్తమార్పిడి చేయించుకుంటున్నారు.

చురకలు



# కుయ్యో.. రొయ్యో!

పాయకరావుపేట : ట్రంప్ ప్రతీకార సుంకాల దెబ్బకు ఆక్వా రైతు కుదేలవుతున్నారు. ఒక్కసారిగా ఎగుమతి చేస్తున్న రొయ్య ధర తగ్గడంతో లబోదిబోమంటున్నారు. ఏప్రిల్ నుంచి నాలుగు నెలల పాటు రొయ్యల ఎగుమతులు జోరుగా సాగుతాయి. మంచి ధర వస్తుందని ఆశించిన రైతులకు అమెరికా విధించిన సుంకాల భారంతో నిరాశే ఎదురైంది. రొయ్యల్లో 20 నుంచి 60 కౌంట్ వచ్చే పెద్దవి ఎక్కువగా అమెరికాకు ఎగుమతి చేస్తుంటారు. అక్కడ వీటికి డిమాండ్ ఉంది. అంతకుమించిన చిన్నసైజు చైనా, వియత్నాం, థాయ్‌లాండ్ తదితర దేశాలకు పంపిస్తుంటారు. గతంలో 10 శాతంగా ఉండే సుంకాన్ని ఏకంగా 27శాతానికి డొనాల్డ్ ట్రంప్ పెంచేశారు. ఇప్పటివరకు 100 కౌంట్ రొయ్య ధర రూ. 250 ఉండగా, ఈ దెబ్బతో ఒక్కసారిగా రూ. 190 వరకు తగ్గిపోయింది. దీంతో టన్నుకు సైజును బట్టి రూ.50 వేల నుంచి రూ. 70 వేల నష్టం వస్తోంది. వాస్తవానికి పెంచిన సుంకం ఏప్రిల్ 20 నుంచి అమల్లోకి రానుంది. ఇప్పటి నుంచే దీన్ని కంపెనీలు అమలు చేస్తున్నాయి. ఎకరానికి 30 కౌంట్ రొయ్య మూడు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. కేజీ రూ.



500 ఉన్నా రమారమి రూ.16 లక్షల ఆదాయం వచ్చే అవకాశముంది. కానీ సుంకం దెబ్బకు గణనీయంగా ఆదాయం తగ్గిపోతోంది. కేజీ ధర 100 కౌంట్ రొయ్యకు రూ. 220 ఉండేలా చూడాలని ప్రభుత్వం కంపెనీలను ఆదేశించింది.

**సాగు భారం...**

జిల్లా పరిధిలో ప్రస్తుతం వనామీ రకం రొయ్యను ఎక్కువగా సాగు చేస్తున్నారు. దీనికి సంబంధించిన తల్లి రొయ్యలను అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటారు. చెరువులు తవ్వి, సాగుకు అవసరమైన ఏరియేటర్లు, ఇతర ఏర్పాట్లు చేయడానికి లక్షల్లో పెట్టుబడి పెడుతుంటారు. ఎకరానికి హీనపక్షం రూ. 10 లక్షల వరకు పెట్టుబడి అయ్యే అవకాశముంది. ధర తగ్గిన నేపథ్యంలో ఆక్వా రైతు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కొత్తగా సాగు చేపట్టేందుకు సైతం వెనుకంజ వేస్తున్నారు.

**జిల్లాలో ఆక్వా విస్తీర్ణం: సుమారు 2 వేల ఎకరాలు**

సాగు చేస్తున్న ప్రాంతాలు: పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి, అచ్యుతాపురం మండలాలు

రొయ్యలు ఎగుమతి అయ్యే దేశాలు: అమెరికా, చైనా తదితర దేశాలు

ప్రభుత్వం ఆదుకోవాలి: సుంకాలతో ధర పతనమైంది. పెట్టుబడి రాని దుస్థితి. సాగు చేసే రైతును ప్రభుత్వం ఆదుకోవాలి. దీనివల్ల సాగు విస్తీర్ణం పెరుగుతుంది. కనీసం ప్రభుత్వం ప్రకటించిన కేజీకి రూ. 220 ధర వచ్చేలా చూడాలి. లేకపోతే లక్షలాది రూపాయలు నష్టపోయే అవకాశముంది. క్రాప్ హాలిడే ప్రకటిస్తే ఈ పరిశ్రమ గాడిలో పడాలంటే కనీసం ఏడాది పడుతుంది.

పబ్బు రామ్మోహన్, ఆక్వా రైతు, పెంటకోట


మేత ధరలు పెంచేస్తున్నారు: ఇప్పటికే సీడ్, రొయ్యల మేత ధరలు పెరగడంతో ఇబ్బంది పడుతున్నాం. దీనివల్ల రైతులకు వచ్చే లాభం తగ్గింది. ప్రతీకార సుంకం దెబ్బకు మా పరిస్థితి మరింత దిగజారుతోంది. ఇదే పరిస్థితి ఉంటే సాగుకు స్వస్తి చెప్పడమే మంచిది. యజ్జల చంద్రశేఖర్, ఆక్వా రైతు

# కాల్వ విస్తరణ.. వంతెనల విస్మరణ

పత్తికొండ : రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్న ఉద్దేశంతో హంద్రీనీవా కాల్వ విస్తరణకు 'కూటమి' ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కాల్వలో నీటి ప్రవాహాన్ని 3,850 క్యూసెక్కులకు పెంచేలా విస్తరిస్తున్నారు. ఇందుకు రూ.660 కోట్ల వరకు వెచ్చిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జూన్ 15 నాటికి పూర్తయ్యేలా పనులు వేగవంతం చేశారు. పూర్తయితే 80వేల ఎకరాలకు సాగునీరు అందించొచ్చని అంచనా.

**పొంచి ఉన్న ముప్పు**

వంతెనలు, ఇతర నిర్మాణాలు ఉన్న చోట విస్తరణ చేపట్టడం లేదు.



ఉదాహరణకు " మద్దికెర - యడవలి గ్రామాల రైతుల పొలాలకు రాకపోకలు సాగించడానికి, ఇతర గ్రామాలకు వెళ్లేందుకు వంతెన నిర్మించారు. రెండు మీటర్ల మేర ప్రస్తుతం ఉన్న ప్రధాన కాల్వను తొలగించి ఆ మట్టిని కుడివైపు వేస్తూ.. కట్టను బలంగా చేస్తున్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు.. వంతెనల వద్ద ఇరుకుగా ఉన్నచోట కాల్వపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని, ఈ క్రమంలో నీటి ప్రవాహం పెరిగి పొలాల్లోకి వస్తాయని ఈ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. " వంతెనలున్న చోట కాల్వ కోతకు గురికాకుండా ఇరువైపులా వంద మీటర్ల మేర లైనింగ్ పనులు చేపడతామని" ఈఈ చంద్రశేఖరరెడ్డి తెలిపారు.

**134 కి.మీ. 150 వంతెనలు**

ఉమ్మడి జిల్లాలో హంద్రీనీవా కాల్వ 134 కి.మీ. మేర విస్తరించి ఉంది. 0 కి.మీ. నుంచి 88 కి.మీ. వరకు ప్యాకేజీ- 1, 89 కి.మీ. నుంచి 216 కి.మీ. వరకు రెండో ప్యాకేజీగా విభజించారు. మొదటి ప్యాకేజీలను రూ.260 కోట్లతో, రెండో ప్యాకేజీ పనులను రూ.400 కోట్లతో పూర్తి చేయనున్నారు. ప్రధాన కాల్వపై 150కి పైగా వంతెనలు ఉన్నాయి. వీటికి ఇరువైపులా అటు 100 మీటర్లు, అటు 100 మీటర్ల మేర విస్తరణ పనులు చేసే పరిస్థితి కనిపించడం లేదు. విస్తరణ చేపట్టాలంటే వీటి స్థానంలో కొత్త నిర్మాణాలు చేపట్టాల్సిందే. ఆయా పనులను ప్రస్తుతం వాయిదా వేసినట్లు తెలుస్తోంది. వంతెనల పిల్లర్ల వద్ద కాల్వ కోతకు గురికాకుండా ఇరువైపులా 100 మీటర్ల మేర లైనింగ్ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

# అభివృద్ధి 'డబుల్'



చిత్తూరు : తిరుపతి- పాకాల- కాట్పాడి రైల్వే లైనింగ్ డబ్లింగ్ ప్రతిపాదన దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైంది. ఈ కలను సాకారం చేస్తూ కేంద్ర క్యాబినెట్ సానుకూల నిర్ణయం తీసుకుంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో వీలైనంత త్వరగా భూసేకరణకు అడుగులు పడితే వేగంగా పనులు జరుగుతాయి. దీనిపై రెండు జిల్లాల కలెక్టర్లు దృష్టి పెడితే వ్యవసాయ, పారిశ్రామిక, పర్యాటక రంగాల అభివృద్ధికి కృషి చేసినవారవుతారు.

ఆంధ్రప్రదేశ్- తమిళనాడును అనుసంధానించడంలో తిరుపతి- పాకాల- కాట్పాడి లైన్ ముఖ్యమైంది. ఈ మార్గంలో రోజూ 40కిపైగా రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం ఒకే లైన్ ఉన్నందున ఏవైనా ఎక్స్‌ప్రెస్ రైళ్లు వస్తే అవి వెళ్లేంత వరకూ ప్యాసింజర్‌లో వెళ్లే ప్రయాణికులు నిరీక్షించాల్సిందే. దీంతో ఎక్కువమంది అనివార్యంగా బస్సులనే నమ్ముకుంటున్నారు. డబుల్ లైన్ అందుబాటులోకి వస్తే ఈ ఇబ్బందులు తీరుతాయి. పుణే- కన్యాకుమారి, తిరుపతి- రామేశ్వరం వంటి రైళ్లు సైతం చిత్తూరు జిల్లా కేంద్రంలో ఆగేందుకు అవకాశం ఉంటుంది. సరకు రవాణా కూడా వేగంగా జరుగుతుందని చెప్పడంలో సందేహం లేదు.

**పారిశ్రామిక రంగానికి తోడ్పాటు**

ప్రస్తుతం తిరుపతి జిల్లాలో శ్రీసిటీ, ఈఎంసీలు, గూడూరు నియోజకవర్గ కేంద్రంగా అనేక పరిశ్రమలున్నాయి. విస్తరణకు కూడా వేగంగా అడుగులు పడుతున్నాయి. చిత్తూరు జిల్లాలోనూ గంగాధరనెల్లూరు కేంద్రంగా రెండు వేల ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. బెంగళూరు- చెన్నై, చిత్తూరు- తచ్చూరు ఎక్స్‌ప్రెస్ రహదారి వెంట భూసేకరణ చేయాలని ఎప్పటినుంచో ప్రతిపాదన ఉంది. ఇవన్నీ కార్యరూపం దాల్చితే ఆయా పరిశ్రమల్లోని ఉత్పత్తులు రైలు మార్గంలో ఏటా 40 లక్షల టన్నుల సరకు అదనంగా తరలించవచ్చని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పడమే ఇందుకు నిదర్శనం.

**రెండు, మూడు రోజులు ఉండేలా**

తిరుపతి- కాట్పాడి డబ్లింగ్ పూర్తయితే పర్యాటక రంగానికీ ఊతమిస్తుంది. తిరుపతి జిల్లాలో సముద్ర తీరం, ఆధ్యాత్మిక క్షేత్రాలున్నాయని ఈ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు పలుమార్లు ఆదేశించారు. ఇందుకు అనుగుణంగానే చంద్రగిరి, మామండూరు, మల్లెమడుగు, తూపిలిపాలెం వంటి ప్రదేశాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్‌కు వచ్చే యాత్రికులు సరదాగా రెండు- మూడు రోజులు ఆయా ప్రాంతాల్లో సేద తీరేలా ఏర్పాట్లు చేస్తే స్థానికులకు ఉపాధి లభిస్తుంది.

**మామిడి, గ్రానైట్ ఎగుమతుల ఖర్చు తగ్గుదల**

చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి మామిడి గుజ్జు, గ్రానైట్ వివిధ దేశాలకు ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం ఇక్కడి నుంచి చెన్నై వరకు ఎక్కువగా రోడ్డు మార్గంలోనే రవాణా జరుగుతోంది. తిరుపతి- కాట్పాడి మధ్య డబుల్ లైన్‌తో తక్కువ సమయం, తక్కువ వ్యయంతో చెన్నై నౌకాశ్రయానికి చేర్చవచ్చు. కృష్ణపట్నం పోర్టు నుంచి ఎగుమతులు పెరుగుతాయని అంచనా.

రైల్వే లైన్ డబ్లింగ్: తిరుపతి–కాట్పాడి (వయా పాకాల)

పొడవు: 104 కిలో మీటర్లు

అంచనా వ్యయం: రూ.1,332 కోట్లు

**తెరిస్తే వ్యర్థాలు.. మూస్తే చీకట్లు**

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం కలిగిరి జడ్పీ ఉన్నత పాఠశాలను పిచ్చిమొక్కలు.. రోడ్డు పక్కన పడేసే వ్యర్థాలు కప్పేశాయి. పాఠశాల చిత్తూరు–తిరుపతి జాతీయ రహదారి పక్కనే ఉంది. గతంలో ఈ రోడ్డు, పాఠశాల సమాంతరంగా ఉండటంతో పాటు ప్రహరీ సైతం ఉండేది. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు దాదాపు నాలుగడుగుల మేర ఎత్తు పెంచడంతో ప్రహరీ పోయి ఏకంగా రోడ్డుకు ఆనుకుని తరగతి గదులు ఉన్నాయి. వీటికి ఉన్న కిటికీలు సైతం రోడ్డు విస్తరణలో మూసుకుపోయి కొంత మేర కనిపిస్తున్నాయి. వెలుతురు కోసం కిటికీలు తెరిస్తే దుమ్ము.. శబ్ద కాలుష్యం.. బస్సుల్లో నుంచి వెళ్లే వారు వేసే వ్యర్థాలు కిటికీల్లో నుంచి నేరుగా విద్యార్థులపై పడుతున్నాయి. అలాగని కిటికీలు మూసివేస్తే చీకటి, గాలి ఆడక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇలా దాదాపు మూడు గదులు రోడ్డు వెంటే మూసుకుపోయాయి. దీంతో రోడ్డు ఎత్తులో.. పాఠశాల కింద కనిపిస్తోంది.

# రూ. కోట్ల పనులు.. కట్టబెట్టే ఘనులు!




విశాఖపట్నం : విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) చేపడుతున్న కొన్ని ప్రాజెక్టులు వైకాపా నేతలకు లబ్ధి చేకూరేలా మారాయా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. అటువంటి వాటిని రద్దు చేయాలని కొందరు ప్రజాప్రతినిధులు తేల్చి చెప్పినా అధికార యంత్రాంగం ముందుకు వెళుతుండటంపై విమర్శలు వస్తున్నాయి. అలాగే గత పాలకుల ఆస్తులకు విలువ పెంచేలా రహదారుల ప్రతిపాదనలూ ఆశ్చర్యపరుస్తున్నాయి. కైలాసగిరిపై: కైలాసగిరిపై రివాల్వింగ్ రెస్టారెంటు, కాటేజీల నిర్మాణానికి గత ప్రభుత్వంలో టెండర్లు పిలిచారు. 1.99 ఎకరాల్లో రూ.18 కోట్లతో ప్రాజెక్టు చేపట్టి 33 ఏళ్లకు లీజుకు ఇచ్చేలా నిర్ణయించారు. వైకాపా నేతకు అనుకూలంగా టెండరు నిబంధనలు మార్చి కట్టబెట్టారన్న ఆరోపణలున్నాయి. ఆ నేతకు మాత్రమే ఆ ప్రాజెక్టు దక్కేలా వ్యూహాత్మకంగా వ్యవహరించారని సమాచారం. ఇన్ని జరిగినా కూటమి ప్రభుత్వం ఆ టెండరు ప్రక్రియ రద్దు చేయకుండా ముందుకు వెళ్తుందని నేతలు పేర్కొంటున్నారు. దీనిపై ఫిర్యాదులు సైతం వచ్చాయి. కైలాసగిరిపై గతంలో ఇదే ప్రాజెక్టు చేపడితే వీఎంఆర్‌డీఏకు న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. రద్దీ నియంత్రణకు వీఎంఆర్‌డీఏ భీమిలి మండలం నేరెళ్లవలస వద్ద ప్రతిపాదించిన రోడ్డు వైకాపా నేతల ఆస్తులకు సమీపంలో ఉంది. దీన్ని రద్దు చేయాలన్న డిమాండు ప్రజాప్రతినిధుల నుంచి ఉన్నా యంత్రాంగం ఆ దిశగా దృష్టిసారించడం లేదని తెలుస్తోంది.

**ఎన్నికల ప్రకటనకు ముందు:** బృందావన్ గ్లో గార్డెన్ పార్క్‌ను వీఎంఆర్‌డీఏ మళ్లీ తెరమీదికి తెచ్చింది. ఎటువంటి ప్రణాళిక లేకుండా గత ప్రభుత్వంలో హడావుడిగా శంకుస్థాపన చేశారు. అయినా దానికి పెద్దపీట వేస్తున్నారు. అప్పట్లో టెండర్లు సక్రమంగా పిలవకుండా నచ్చినోళ్లకు పనులు అప్పగించి ఇంజినీరింగ్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఇటీవల జరిగిన వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో ఈ ప్రాజెక్టుపై చర్చించి మళ్లీ చేపట్టాలని నిర్ణయించడం గమనార్హం. గత ప్రభుత్వంలో ఎన్నికల ప్రకటనకు రెండు గంటల ముందు ఈ ప్రాజెక్టు పనుల కోసం వీఎంఆర్‌డీఏ అధికారులు అప్పటి వైకాపా నేతలతో భూమి పూజ చేయించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వస్తుందని తెలిసి మరీ చేశారన్న విమర్శలు వచ్చాయి. అప్పట్లో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వీఎంఆర్‌డీఏ ఛైర్మన్‌తో తొలి శిలాఫలకాన్ని ఆవిష్కరించాలని అధికారులు హడావుడి చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా సెంట్రల్ పార్క్‌లోని చెట్లు, మొక్కలకు విద్యుత్తు అలంకరణ చేపడతారు. విద్యుత్తు కాంతులతో ప్రత్యేక దీపాలు ఏర్పాటు చేస్తారు. అలంకరణ పేరుతో లైటింగ్ పెట్టడం వీఎంఆర్‌డీఏ చేసే పనా అంటూ అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. పచ్చగా ఉండే సెంట్రల్ పార్క్‌లో గ్లో గార్డెన్ పేరుతో ఇష్టారాజ్య పనులేంటనే విమర్శ వాకర్ల నుంచి వస్తోంది. పార్క్ లోపలున్న సమస్యలను పరిష్కరించకపోవడం, వసతులు మెరుగుపరచక పోవడంపై పెదవి విరుస్తున్నారు. అప్పట్లో రూ.2.24 కోట్ల అంచనాతో గ్లో గార్డెన్‌కు టెండర్లు పిలిచారు. ఏకమొత్తంగా పిలిస్తే అభ్యంతరాలొస్తాయని రూ.30 లక్షలతో రెండు, రూ. కోటితో మరో టెండరు పిలిచారు. దీంతో గుత్తేదారు పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. అవసరమైన సామగ్రిని పార్క్‌లో వేశారు. ఆ తర్వాత పనులు ఆపేశారు. ఈ పనుల అప్పగింతలో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

# డి.పట్టా భూముల స్వాధీనానికి ఆదేశం

బుచ్చెయ్యపేట : ఆర్.భీమవరంలో ప్రభుత్వానికి అప్పగించిన డి.పట్టా భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుచ్చెయ్య పేట తహసీల్దార్‌కు ఉత్తర్వులు అందాయి. గాజువాకకు చెందిన పారిశ్రామికవేత్త కడియాల రాజేశ్వరరావు బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరంలో సుమారు 30 ఎకరాల డి.పట్టా భూములను గతంలో కొనుగోలు చేశారు. తెలియకుండా కొనుగోలు చేశామంటూ ఆయన ఆ భూములను తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేశారు. ఈ నెల 3న కలెక్టర్‌ను కలిసి సంబంధిత పత్రాలను అందజేసిన విషయం తెలిసిందే. వీటిని చట్టప్రకారం ప్రభుత్వ స్వాధీనం చేసుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ నుంచి తహసీల్దారుకు ఆదేశాలు వచ్చాయి.



సంబంధిత భూముల్లో బోర్డులను ఏర్పాటు చేసి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా భూముల స్వాధీన ప్రక్రియను పూర్తి చేసి నివేదికను అందజేయాలని ఆదేశించారు.

# డ్వామా.. బది'లీలలు' చూడతరమా

నంద్యాల : జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో గత నెల రాష్ట్ర వ్యాప్తంగా కౌన్సెలింగ్ పద్ధతిలో బదిలీలు జరిగాయి. ఇందులో భాగంగా జిల్లాలో కూడా సాంకేతిక సహాయకులు, ఏపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లను బదిలీ చేశారు. ఈ ప్రక్రియ ముగిసిన కొన్ని రోజులకే జిల్లా డ్వామా కార్యాలయంలో సిఫార్సు బదిలీలు, పరస్పర అంగీకార (మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్) బదిలీలు జరుగుతుండటం విస్తుగొలుపుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రజాప్రతినిధుల సిఫార్సుల పేరుతో ఈ బదిలీలు జరుగుతున్నాయి. క్రమంలో పెద్దఎత్తున నగదు చేతులు మారుతున్నట్లు సమాచారం.

**అక్రమ ఆదాయం పోతుందనే..**

కొందరు ఉద్యోగులు కొన్నేళ్లుగా ఒకేచోట పనిచేస్తూ అక్రమ ఆదాయానికి బాటలు వేసుకున్నారు. అడ్డదారుల్లో పెద్దఎత్తున సంపద కూడబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వారు ప్రస్తుతం ఉన్న ప్రాంతాల నుంచి ఇతర మండలాలకు వెళ్లడానికి ఇష్టపడటం లేదు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకున్నారు. ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తీసుకురావడంతో పాటు పరస్పర అంగీకార పత్రాలు ఉన్నతాధికారుల వద్ద ఉంచి బదిలీలు చేయించుకుంటున్నారు. మరికొన్ని చోట్ల డిప్యుటేషన్ల పేరు మీద బదిలీలు జరిగిపోతున్నాయి. గత మూడు రోజులుగా పదుల సంఖ్యలో బదిలీలు పూర్తవ్వగా ఈ ప్రక్రియ మరికొన్ని రోజుల పాటు కొనసాగించేందుకు ఏర్పాట్లు జరిగిపోయాయి. ఇందులో ఓ ఉన్నతాధికారి, ఇద్దరు కార్యాలయ సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారు. కొందరు సాంకేతిక సహాయకులు (టీఏ) కొన్నేళ్లుగా ఒకే మండలంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలోనే పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. వీరిని గత నెలలో కూటమి ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది. ఈ బదిలీలను జీర్ణించుకోలేని కొందరు ప్రస్తుతం పాత స్థానానికి వెళ్లేందుకు అడ్డదారులను ఆశ్రయిస్తున్నారు. పరస్పర అంగీకార బదిలీల పేరుతో నాటకాలకు తెరతీశారు. ముగ్గురు టీఏలు మిడుతూరు నుంచి గడివేములకు, గడివేముల నుంచి బేతంచెర్లకు, బేతంచెర్ల నుంచి మిడుతూరుకు తిరిగి వెళ్లేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. బేతంచెర్లకు వెళ్లనున్న టీఏపై పలు ఆరోపణలు ఉన్నాయి. బనగానపల్లిలో విధులు నిర్వర్తిస్తూ డిప్యుటేషన్‌పై దొర్నిపాడులో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్‌ను తిరిగి బనగానపల్లిలో చేరాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. కాని సదరు ఉద్యోగి దొర్నిపాడులోనే ఉండాలని కోరుకుంటున్నారు. ఇందుకోసం ఇద్దరు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి దొర్నిపాడులో కొనసాగేందుకు మార్గం సుగమం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**అవసరం లేకున్నా డిప్యుటేషన్లు..**

అడ్డగోలు బదిలీల్లో భాగంగా.. ఉన్నతాధికారి సిఫార్సులతో ఓ సాంకేతిక సహాయకుడిని చాగలమర్రి నుంచి మహానందికి బదిలీ చేశారు.

ఓ మహిళా ఉద్యోగిని బనగానపల్లి నుంచి నంద్యాలకు డిప్యుటేషన్‌పై తీసుకొచ్చారు. ప్రస్తుతం ఇక్కడ పోస్టు ఖాళీగా లేకున్నా సరే డిప్యుటేషన్‌పై తీసుకురావడం గమనార్హం. ఇక్కడ ఆమె అవసరం లేకున్నా సరే ఇప్పటికే ఉన్న ఉద్యోగితో పాటు విధులు నిర్వర్తించనున్నారు.

ఇలా నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లను డిప్యుటేషన్‌పై, ఇద్దరిని పరస్పర అంగీకారంపై బదిలీ చేశారు.

బనగానపల్లి నుంచి దొర్నిపాడుకు మహిళా ఉద్యోగిని బదిలీ చేశారు. గత నెలలో బనగానపల్లి నుంచి అవుకుకు బదిలీ అయిన ఆపరేటర్‌ను తిరిగి బనగానపల్లిలోనే పనిచేసేలా డిప్యుటేషన్ చేశారు. మరో మహిళా సిబ్బందిని ఇదేవిధంగా రుద్రవరం నుంచి గోస్పాడుకు బదిలీ చేశారు.

ఇద్దరు ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు పరస్పర అంగీకారంపై బదిలీలు కోరగా వెంటనే అంగీకరించారు. వీరిని సంజామల నుంచి కోవెలకుంట్లకు, కోవెలకుంట్ల నుంచి సంజామలకు పంపేందుకు మార్గం సుగమం చేశారు. సీనియర్లకు అవకాశం లేకుండా ఇలా పరస్పర బదిలీలకు పచ్చజెండా ఊపడం పట్ల తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గత నెలలో రుద్రవరానికి బదిలీ అయిన జూనియర్ ఇంజినీర్ ఒకరు అక్కడ విధుల్లో చేరి ఒక్కరోజు మాత్రమే పనిచేశారు. ప్రస్తుతం సిఫార్సు లేఖ కోసం ఓ ప్రజాప్రతినిధి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మరో ఇద్దరు ఏపీవోలు కూడా ఓ నాయకుని చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

# నేతలతో బంధాలు.. రియల్ దందాలు

అనకాపల్లి : పంట చేలతో పచ్చగా ఉండే భూములు కాస్తా స్థిరాస్తి లే అవుట్లుగా మారిపోతున్నాయి. ఊరికో వెంచర్ వెలుస్తోంది. కాకపోతే వాటిలో చాలావరకు అనుమతులు లేనివే ఉంటున్నాయి. పైగా కొన్నిచోట్ల పక్కనున్న పంట కాలువలు, గెడ్డలను సైతం ఆక్రమించి దర్జాగా అమ్మకాలకు దిగుతున్నారు. నేతలతో చేతులు కలిపి.. అధికారుల చేతుల తడిపి తమ రియల్ దందాలకు అడ్డులేకుండా చేసుకుంటున్నారు. అనకాపల్లి జిల్లాలో అక్రమ లేఅవుట్లు, ఆక్రమణలకు గురైన సాగునీటి వనరులకు లెక్కేలేదు. వాటిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే కంటితుడుపు చర్యలతో సరిపెట్టేస్తున్నారు.

**లేఅవుట్ల ఆక్రమణ**

లివిగో..: పాయకరావుపేట మండలం పెదరామభద్రపురంలో పది ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేస్తున్నారు. దీనికి ఆనుకుని ఉన్న పల్లపు కాలువ గట్టును వంద మీటర్ల వెడల్పులో చదును చేసి వెంచర్‌లో కలిపేశారు. దీంతోపాటు వంద తాటిచెట్లను నరికేశారు. రైతుల ఫిర్యాదుతో జలవనరులశాఖ అధికారులు పరిశీలించారు. గట్టును



యథావిధిగా వేయాలని ఆదేశాలు ఇచ్చినా ఇప్పటికీ అమలు కాలేదు. పి.ఎల్.పురంలో వైకాపా నాయకుడు వేస్తున్న లేఅవుట్‌కు పక్కనే ఉన్న కొండ గెడ్డ కాలువను కప్పేసి రోడ్డు పనులు చేపట్టారు. రైల్వేట్రాక్‌కు అవతల వైపున పాయకరావుపేట, పి.ఎల్.పురం, అరట్లకోట గ్రామాలకు చెందిన వారికి జగనన్న కాలనీ లేఅవుట్‌లో స్థలాలు కేటాయించారు. వీరికి ప్రత్యేక రహదారి అవసరమంటూ వైకాపా నాయకుని లేఅవుట్‌కు లబ్ధి చేకూరేలా కాలువ కబ్జా చేశారు. కొంతమంది ఫిర్యాదు చేయడంతో పనులు తాత్కాలికంగా నిలిపివేశారు.

దేవరాపల్లి మండలం నర్సింగి పంచాయతీ పరిధిలో ఇటీవల భారీ లేఅవుట్ వేశారు. రహదారిని ఆనుకుని ఉన్న గెడ్డను చాలావరకు కప్పేశారు. ప్రభుత్వ స్థలంలోనే బోరు తవ్వి నీటిని వినియోగించుకుంటున్నారు. దీనిపై కొందరు ఫిర్యాదు చేశాక ఆక్రమణలపై వెనక్కి తగ్గి బోరును పంచాయతీకి అప్పగిస్తామంటూ ముందుకొచ్చారు.

కశింకోట మండలం బయ్యవరంలో వైకాపా ముఖ్యనేతలు 403 ఎకరాల్లో భారీ లేఅవుట్ వేశారు. దీనికోసం కొండ గెడ్డలు, వాగులు ఆక్రమించారు. కొండలను తొలిచేశారు. ఈ లేఅవుట్‌కు వీఎంఆర్‌డీఏ నుంచి అనుమతులు కూడా తీసుకోలేదు. ఇటీవల వారు కూటమి నేతలను మచ్చిక చేసుకుని తమ స్థిరాస్తి వ్యాపారానికి ఆటంకాలు లేకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై సంయుక్త కలెక్టర్ జాహ్నవి వద్ద ప్రస్తావించగా విస్సన్నపేట లేఅవుట్‌లో కార్యకలాపాలను ఇదివరకే నిలిపేసినట్లు చెప్పారు. ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిపై కఠిన చర్యలే తీసుకుంటామన్నారు.

చురకలు



# జనన ధ్రువీకరణ పత్రాలకు నిరీక్షణ

గుంతకల్లు : గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు పొందడానికి నిరీక్షణ తప్పటం లేదు. నెలల తరబడి ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నా పత్రాలు అందక జనం నానా తిప్పలు పడుతున్నారు. ఆసుపత్రిలో నెలకు వందకు పైగా ప్రసవాలు జరుగుతుంటాయని ఆసుపత్రి వైద్యులే చెబుతున్నారు. పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు కోసం దరఖాస్తు చేసుకుంటున్నా జారీ విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుంతకల్లు వాసులే కాకుండా పామిడి, వజ్రకరూరు, తదితర



మండలాలకు చెందిన వారు ఎక్కువగా ఆసుపత్రికి వస్తుంటారు.

**ఆసుపత్రిలో సిబ్బంది కొరత**

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విభాగంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇక్కడ ఒక్కరే ఉండటంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి ఇబ్బందిగా మారింది. ఒక్కొక్కసారి సర్వర్ పని చేయక పోవడంతో దరఖాస్తుల నమోదు ప్రక్రియ జరగటం లేదు. ఇక్కడ పని చేసే ఉద్యోగికి మరో సెక్షన్‌లో అదనపు బాధ్యతలు అప్పగించారు.

**మూడు నెలలుగా తిరుగుతున్నా..** – అంజలి, పామిడి మండలం

గతేడాది డిసెంబరులో పాప పుట్టింది. అదే నెలలో జనన ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నా. నెలలో రెండు మూడు సార్లు ఆసుపత్రికి వచ్చి వెనక్కి వెళ్తున్నా. ఎండలు ఎక్కువగా ఉండటంతో తోడుకు కుటుంబ సభ్యులను పిలుచుకొని ఆసుపత్రికి వస్తున్నా. రవాణా ఖర్చులు భరించలేకపోతున్నాం. ఇప్పుడు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు.

**సకాలంలో ఇవ్వడానికి చర్యలు తీసుకుంటాం..** – డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి, సూపరింటెండెంట్, గుంతకల్లు ఏరియా ఆసుపత్రి

దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త జనన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో ఇస్తున్నాం. గతేడాది జూన్, జులై, ఆగస్టు నెలలకు చెందిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సర్వర్ సమస్య, సిబ్బంది కొరత ఉంది. ఈనెలలో అన్నీ మంజూరు చేస్తాం

# పల్లెసీమలకు రహదారుల శోభ

పుట్టపర్తి : ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణ ప్రాంత రహదారుల రూపురేఖలను ప్రభుత్వం మార్చేసింది. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లలో పల్లెలు, పట్టణాల రహదారుల నిర్వహణ గాలికి వదిలేయడంతో దారుణంగా తయారయ్యాయి. రహదారులపై ప్రయాణం చేయాలంటే ప్రజలు భయాందోళన చెందే పరిస్థితి ఉండేది. కనీస మరమ్మతులు చేయించని పాపానపోలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక రహదారులను బాగు చేయాలని సంకల్పించిం



ది. దీంతో నూతనంగా నిర్మించిన బీటీ, సీసీ రహదారులతో ఆయా ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమానికి గత ఏడాది ఆగస్టులో శ్రీకారం చుట్టింది. గ్రామసభలు నిర్వహించి, ప్రజల అభిప్రాయాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా 1,772 పనులను గుర్తించి రూ.126 కోట్లతో చేపట్టారు. ఇప్పటి వరకు రూ.120.80 కోట్లతో 1,702 పనులు పూర్తి చేశారు. వాటిలో 213 కిలోమీటర్ల సీసీ, బీటీ రోడ్లు నిర్మించారు. దీంతో ప్రగతిలో జిల్లా ఐదో స్థానం ఉందని పంచాయతీరాజ్ ఈఈ మురళీ తెలిపారు. వివిధ దశల్లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

# మరవంక కబ్జా.. నివాసాలకు ముప్పు

కొత్తచెరువు : బుక్కపట్నం చెరువు ప్రధాన మరవ నీరు వెళ్లే మార్గంలో మరవవంక ఆక్రమణకు గురైంది. దీంతో కొత్తచెరువులోని నివాసాలకు ముప్పుగా మారింది. ఒక టీఎంసీ నిల్వ సామర్థ్యం కలిగిన చెరువు ప్రధాన మరవ ప్రవహిస్తే వరద ఉధృతిని అంచనా వేయడం కష్టమే. ఈనేపథ్యంలో గ్రామానికి ఆవలివైపు మరవవంక గట్టునున్న నీటిపారుదల శాఖ భూమిని ఒకరు కబ్జా చేసి ఇటుక బట్టి వ్యాపారం చేస్తున్నారు. కొన్నేళ్లుగా బట్టి నుంచి వెలువడే వ్యర్థాలతో మరవవంకను ఏటా కొంత మేరకు పూడుస్తూ పక్కాగా పునాది నిర్మించేశారు. దీంతో చిత్రావతి వంతెన దిగువకు సాఫీగా సాగాల్సిన ప్రవాహం వంక కబ్జాతో గ్రామంలోని గృహాల



వైపునకు వచ్చి స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. నాలుగేళ్ల క్రితం ప్రధాన మరవ ఉధృతంగా ప్రవహిస్తూ నివాసాలవైపు చొచ్చుకురావడంతో స్థానికులు... నీటిపారుదల, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. పరిశీలించిన అధికారులు భవిష్యత్తులో ప్రమాద తీవ్రతను గుర్తించారు. నీటిపారుదల శాఖ భూమిని సర్వేచేసి హద్దులను గుర్తించాలని రెవెన్యూ అధికారులను కోరారు. సర్వే అనంతరం ఆక్రమణపై చర్యలు చేపడతామని అధికారులు స్థానికులకు హామీ ఇచ్చారు. సర్వే ఏదీ?: నేటికి సర్వే ముందుకు సాగడం లేదు. ప్రమాద తీవ్రతను గుర్తించిన అధికారులు బదిలీ అవుతున్నారే గాని సర్వే ఒక్క అడుగు ముందుకు పడలేదని స్థానికులు వాపోతున్నారు. కబ్జాతో బుక్కపట్నం ప్రధాన రహదారిలో చిత్రావతిపై నిర్మించిన వంతెన ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై నీటిపారుదల శాఖ డీఈ గంగాధర్‌ను వివరణ కోరగా పరిశీలిస్తామన్నారు. హద్దులను గుర్తించి ఆక్రమణలపై చర్యలు చేపడతామని తెలిపారు.

# మేమింతే.!



అనంతపురం : అనంతపురం శారదానగర్‌కు చెందిన పల్లవికి జ్వరం రావడంతో ఓ ప్రైవేటు వైద్యశాలకు వెళ్లింది. వైద్యుడు ఆమెను పరీక్షించారు. వివిధ పరీక్షల కోసం ఓ కేంద్రానికి వెళ్లాలని చీటీ రాసిచ్చారు. చీటీలో చిరునామా ప్రకారం వెళితే అక్కడ పరీక్షలకు రూ.1600వరకు అయింది. రెండు గంటల తరువాత ఇచ్చిన ఫలితాలను తీసుకెళ్లి వైద్యుడికి చూపించగా... ఇబ్బంది ఏమి లేదని మందులు రాసిచ్చారు. వాటిని అక్కడి వైద్యశాల దుకాణంలో కొనుగోలు చేయగా రూ.2 వేలకు పైగా ఖర్చయింది.

పుట్టపర్తి మండలానికి చెందిన వెంకటేశ్ తలనొప్పిగా ఉందని, అప్పుడప్పుడు పొట్టభాగంలో నొప్పిగా ఉందంటూ అనంతపురంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి టోకన్‌కు రూ.400 చెల్లించి వైద్యుడిని కలిశారు. రక్తపరీక్షలు, ఎంఆర్ఐ స్కానింగ్ చేయించి తీసుకురావాలని... అది కూడా సూచించిన కేంద్రంలోనే చేయించుకోవాలన్నారు. ఇందుకు రోగికి రూ.7వేలు ఖర్చు చేశారు. వారి ఇచ్చిన రిపోర్టులను సదరు వైద్యుడికి చూపించగా ఏమీ లేదని.. రూ.2,700 మందులు వాడి.. ఇబ్బంది అయితే నెల తరువాత రావాలని సూచించారు.

ఉమ్మడి అనంత జిల్లాలో కొందమంది వైద్యులు, ఆర్ఎంపీలు నిబంధనలకు నీళ్లొదిలేశారు. జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి, కడుపునొప్పి తదితర చిన్నపాటి ఆరోగ్య సమస్యలతో ప్రైవేటు వైద్యశాలలకు వెళుతున్న రోగులకు అక్కడి వైద్యులు చుక్కలు చూపిస్తున్నారు. చాంతాడంత పరీక్షలు చేయించుకురావాలని.. రక్తపరీక్ష, స్కానింగ్ కేంద్రాలకు పంపుతున్నారు. వైద్యులు చెప్పారన్న కారణంతో రోగులు వారు సూచించిన కేంద్రానికి వెళ్లి... రూ.వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. వారిచ్చే ఫలితాలను సదరు వైద్యుల వద్దకు తీసుకెళ్లి చూపిస్తున్నారు. ఏమి ఇబ్బంది లేదని చెబుతూ రూ.1500 నుంచి రూ.2వేల వరకు మందులు రాసిస్తున్నారు.

కొందరు ఆర్ఎంపీలు తమ ప్రథమ చికిత్సా కేంద్రాల్లోనే రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. వారే సెలైన్ ఎక్కించటం, మందులు రాసివ్వటంతోపాటు అమ్ముతున్నారు. స్కానింగ్, రక్తపరీక్షా కేంద్రాలతో కమీషన్ పొందేందుకు అనవసరంగా పరీక్షలు రాస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అనంతపురంలోని పాతూరు, కళ్యాణదుర్గం రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స కేంద్రాలు నిర్వహిస్తూ.. వివిధ పరీక్షల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు.

**ఇష్టారాజ్యంగా..**

పలు ప్రాంతాల్లోని రక్తపరీక్ష కేంద్రాలు నిబంధనల ప్రకారం నడవటం లేదు. ల్యాబ్ టెక్నీషియన్లు, అర్హత కలిగిన సిబ్బందితో కాకుండా ఇతరులతో పరీక్షలు చేయిస్తున్నారు. ఒక్కోచోట ఒక్కో రిపోర్టు ఇస్తున్నారని కొందరు రోగులు వాపోతున్నారు. కొన్ని పట్టణాల్లో అనధికారికంగా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇలాంటివి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50కి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. వాటిపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. **తనిఖీలు చేసి.. చర్యలు తీసుకుంటాం**– డాక్టర్ ఈ.బి.దేవి, డీఎంహె చ్‌వో, అనంతపురం

ప్రైవేట్ వైద్యశాలలు, ఆర్ఎంపీల ప్రాథమిక చికిత్సా కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. ఇటీవల రాయదుర్గంలో రెండు ప్రాథమిక చికిత్సా కేంద్రాలను సీజ్ చేశాం. స్కానింగ్, రక్తపరీక్ష కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేస్తాం. రోగులపై భారం మోపేలా, నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేసేవారిపై చర్యలు తీసుకుంటాం.

# మద్దిలేరు వంతెన.. అంతేనా?



ముదిగుబ్బ : ముదిగుబ్బ మండలంలోని మద్దిలేరు వంతెన నిర్మాణం కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారు. వంతెన పూర్తిగా కొట్టుకుపోయి ఇప్పటికి ఐదేళ్లు గడుస్తున్నా కొత్తది నిర్మించలేదు. దీంతో వాహనదారులు నరకయాతన పడుతూ ప్రయాణిస్తున్నారు. నల్లమాడ నుంచి పులివెందుల వైపు, తలుపుల మండలానికి ఈ మార్గంలోనే వెళ్లాలి. యల్లనూరు, పుట్లూరు మండలాల నుంచి కదిరికి వెళ్లాలంటే తక్కువ దూరం కలిసొస్తుందని ఈ మార్గంలోనే వెళ్తుంటారు. లో లెవల్ వంతెన కావడంతో మద్దిలేరు వాగు ప్రవహించినప్పుడు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ముదిగుబ్బ, తలుపులలోని 25 గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరో పది కిలోమీటర్లు చుట్టేసుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

**శాశ్వత పరిష్కారాలేవి..**

ముదిగుబ్బ–కదిరి సరిహద్దులో ఉన్న మద్దిలేరు వంతెన అధిక వర్షాలతో 2021లో పూర్తిగా కొట్టుకుపోయింది. తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. ఆ తర్వాత సిమెంటు పైపులు, రాళ్లు, మట్టి వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేసినా మళ్లీ వర్షాలకు కొట్టుకుపోయింది. ఇప్పటికే నాలుగైదుసార్లు కొట్టుకుపోవడంతో సమీపంలోని ఏటిగట్టుతండా దగ్గర పల్లపు ప్రాంతంలో వంతెన ఉండటంతో మద్దిలేరు ప్రవహించినప్పుడు 3–4 అడుగుల ఎత్తులో వెళ్లడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. వంతెన పూర్తయితే సుమారు 30 వేల మందికి ప్రయోజనం చేకూరుతుంది.

**నిధుల్లేక.. పనులు జరగక?**

మద్దిలేరు వాగుపై హై లెవల్ వంతెన నిర్మించేందుకు పంచాయతీరాజ్ అధికారులు ఏడాదిన్నర కిందట రూ.7.50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మలకవేములక్రాస్‌కు వెళ్లే రెండో వంతెన దగ్గర మరో వంతెన నిర్మించేందుకు రూ.4 కోట్లతో ప్రతిపాదించారు. నేటికీ నిధులు మంజూరు కాలేదు. రానున్న వర్షాకాలంలో మద్దిలేరు వాగు ప్రవహిస్తే మళ్లీ వంతెన కొట్టుకుపోయే ప్రమాదముంది. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు వాగుపై వంతెన నిర్మిస్తామని హామీలు ఇస్తున్నా.. అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వంతెన నిర్మించాలని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

**ప్రతిపాదనలు పంపాం..– రాజేంద్ర, పీఆర్ జేఈ, కదిరి**

మద్దిలేరు వాగుపై వాహనాల రాక పోకలకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాం. హై లెవల్ వంతెన నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. నిధులు మంజూరైతే పనులు చేపడతాం.

# వంతెన నిర్మాణానికి అడ్డంకులు తొలగేనా?



కణేకల్లు : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందనంగా తయారైంది కణేకల్లు మండలంలోని వేదవతి హగరిపై ర.భ వంతెన నిర్మాణ పరిస్థితి. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని రూ.48 కోట్లు మంజూరు చేసినప్పటికీ పనుల ప్రారంభంలో అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. శ్రీరామిరెడ్డి తాగునీటి పైపులైనుతోపాటు అటవీశాఖ అనుమతులు ప్రధాన అడ్డంకిగా తయారయ్యాయి. దీంతో పనుల ప్రారంభంలో ఎడతెగని జాప్యం నెలకొని రాకపోకలకు ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం** 60 ఏళ్ల కిందట నిర్మించిన హెచ్చెల్సీ వంతెన శిథిలావస్థకు చేరడంతో గత ఐదేళ్లుగా వేదవతి హగరిపై రాకపోకలు నిలిచిపోయాయి. ప్రత్యామ్నా యంగా వంతెన నిర్మించాల్సి ఉన్నా గత ప్రభుత్వం నిధుల మంజూరులో నిర్లక్ష్యం ప్రదర్శించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో నిధుల మంజూరుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కృషి చేశారు. గతేడాది అక్టోబరులో పనులకు శంకుస్థాపన చేశారు.

**అలైన్‌మెంటు ఖరారులో అనిశ్చితి**

ఇటీవల క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించేందుకు వచ్చిన గుత్తేదారులు వంతెన నిర్మించే ప్రదేశంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పైపులైను ఉన్నట్లు గుర్తించారు. 140 గ్రామాలకు తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందని గ్రహించి అలైన్‌మెంట్ మార్చే యత్నం చేసినప్పటికీ అస్తవ్యస్తంగా వేసిన పైపులైనుతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. దీంతో మరో అలైన్‌మెంటు ఖరారుకు ర.భ అధికారులు సిద్ధమవుతుండగా వేదవతి హగరిలో తమ భూములు ఉన్నాయని అటవీశాఖ అభ్యంతరం చెప్పడంతో పనుల ప్రారంభంలో అనిశ్చితి నెలకొంది. దీనికి తోడు 50సెంట్ల మేర పట్టా భూములు ఉండటంతో భూసేకరణ, పరిహారం చెల్లింపునకు నిధుల అవసరంపై అధికారులు అలైన్‌మెంటు మార్పు, ఖరారులో మల్లగుల్లాలు పడుతున్నారు. చివరగా ప్రతిపాదించిన అలైన్‌మెంటు ఖరారుకు సిద్ధమైతే అటవీశాఖ అనుమతుల మంజూరుకు ఎదురు చూడాల్సిన దుస్థితి తలెత్తుతోంది. అడ్డంకులు అధిగమించి సత్వరమే పనుల ప్రారంభానికి అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **ప్రభుత్వానికి ప్రతిపాదించాం – రవిశంకరరెడ్డి, ర.భ డీఈ**వంతెన నిర్మించే ప్రాంతంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పైపులైను అడ్డుగా రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో సర్వే చేసి ప్రత్యామ్నాయంగా మరో రెండు అలైన్‌మెంట్‌లు సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించాం. అనుమతుల మంజూరు మేరకు క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతాం.

# అడవిలో ఏం జరుగుతోంది..?

కుప్పం : ఒకప్పుడు పచ్చని మొక్కల పెంపకంలో ఆదర్శంగా ఉన్న కార్తీవనాన్ని వైకాపా హయాంలో నగరవనంగా మార్చేశారు. పర్యాటక కేంద్రం పేరుతో రూ.1.40 కోట్లను ప్రభుత్వం నుంచి తెప్పించుకున్నారు. అడవిలోని చెట్లను మాయం చేసి చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునేందుకు అరకొరగా ఆట వస్తువులు అమర్చారు. ఇలా.. కుప్పం మండలం నడుమూరు అటవీ ప్రాంతంలో చిన్నచిన్న పనులు చేసి నిధులన్నీ ఖాళీ చేశారు. ఇదంతా వైకాపా హయాంలో జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అటవీశాఖ అధికారులు తాజాగా రూ.60 లక్షలు మంజూరు చేయించుకున్నారు. ఈ నిధులను వనసంరక్షణ సమితి సభ్యుల పర్యవేక్షణలో పారదర్శకంగా చేపట్టాల్సిన యంత్రాంగం గుత్తేదారుల అవతారమెత్తి సభ్యులకు తెలియకుండానే పనులు చేస్తున్నారు. మరో అడుగు ముందుకేసి అటవీ



అధికారులు రహస్యంగా ఖాళీ చెక్కులపై నడుమూరు వనసంరక్షణ సమితి ఛైర్మన్, వైస్ ఛైర్‌పర్సన్ సంతకాలు చేయించుకున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తోపాటు నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు విచారణకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా చిత్తూరు డీఎఫ్‌వో భరణి నగరవనం చేరుకుని ఇనుప కంచెను పరిశీలించి కొలతలు తీయించారు. అలాగే నగరవనంలో జరుగుతున్న పనులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు.

# పైసా వసూల్..!

విశాఖపట్నం : నగరంలో జనన, మరణ ధ్రువపత్రాలు పొందేందుకు జీవీఎంసీ సిబ్బంది చేతికి పైసలు ఇవ్వక తప్పడం లేదు. డబ్బు లేకుండా ప్రక్రియ ఒక్క అడుగు ముందుకెళ్లే పరిస్థితి లేదు. ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియను పొరుగు సేవల ఉద్యోగులు, సిబ్బందికి అప్పగించారు. తెర వెనుక వాటాలు పంచుకుంటున్న కొందరు అధికారులు తమ చేతికి మట్టి అంటకుండా వ్యవహరిస్తున్నారు.

**వేలల్లో బేరం:** ఇటీవల ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ప్రమాదవశాత్తు మృతి చెందగా, ఆయన కుటుంబీకులు మరణ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేశారు. రూ.50 వేలు ఇస్తేనే, ధ్రువీకరణ పత్రం జారీ చేస్తామని జోన్–5 కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు పొరుగు సేవల ఉద్యోగులు డిమాండ్ చేశారు. చివరకు రూ.40 వేలకు బేరం కుదరగా, రూ.20 వేలు తీసుకుంటూ 'అనిశా'కు చిక్కారు. అయితే డబ్బులు ఇవ్వడం ఇష్టం లేని బాధితులు 'అనిశా'ను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. కానీ, రోజూ జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఇవ్వాల్సి వస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**విచారణ పేరుతో జాప్యం:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే జనన, మరణాలకు అక్కడే ధ్రువీకరణ పత్రాలు ఇస్తుంటారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో, ఇళ్ల వద్ద జరిగే జనన, మరణాల ధ్రువీకరణలకు



జీవీఎంసీని ఆశ్రయించాల్సిందే. ఎవరైనా చనిపోయినా, జన్మించినా... సంబంధిత వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇస్తే... విచారణ చేస్తారు. అలా విచారణ పేరిట చాలాచోట్ల జాప్యం జరుగుతోంది. అలాగే పత్రాల జారీకి డబ్బులు ఇవ్వకపోయినా.. వాయిదాలు వేస్తున్నారు. నిబంధనల ప్రకారం 15 రోజుల్లో ఇవ్వాల్సిన పత్రాలను 30 నుంచి 40 రోజుల వరకు తిప్పించుకుని... ఆ తర్వాత ఇస్తున్నారు.

**వారే కీలకం..!**

ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పొరుగు సేవల్లో విధులు నిర్వహించే కొందరు ఉద్యోగులే బేరగాళ్లు. దరఖాస్తు చేయడానికి వచ్చిన వారితో నేరుగా చర్చలు జరిపి, ఎంత ఇవ్వాలో నిర్ణయించి.. వసూలు చేస్తుంటారు. ఆ విభాగంలో ఒకేచోట 12 ఏళ్లకుపైగా విధులు నిర్వహిస్తున్న వారు ఉన్నారంటే...వారికి పైఅధికారుల మద్దతు ఏస్థాయిలో ఉందో తెలుస్తుంది. ఇప్పటికైనా ఆ విభాగాన్ని ప్రక్షాళన చేసి, పత్రాల జారీ త్వరితగతిన జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

**బదిలీ చేస్తాం..:** జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరులో కొందరు పొరుగు సేవల ఉద్యోగులపై ఆరోపణలు వస్తున్నాయి. వారిని బదిలీ చేయడానికి దస్త్రాన్ని సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతానికి డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఇతర విభాగాలకు బదిలీ చేస్తాం. దశల వారీగా సహాయకులకు స్థానచలనం కల్పిస్తాం.

డాక్టర్ నరేష్‌కుమార్, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి

# ఇంతులు.. రుణ కాంతులు

డోన్ : మహిళల ఆర్థిక స్వావలంబనకు ఏటా రూ.కోట్ల రుణాలు చెల్లిస్తున్నారు. సంఘంలో సభ్యులకు తెలియకుండా అధ్యక్షురాళ్లు నొక్కేస్తున్నారు. గత ఐదేళ్ల వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు పెత్తనం చేశారు. బోగస్ సంఘాలు సృష్టించి నిధులు పక్కదారి పట్టించారు. అక్రమాలకు చెక్ పెట్టేందుకు 'కూటమి' ప్రభుత్వం యత్నిస్తోంది. నగదు రహిత సేవలకు ప్రాధాన్యం ఇస్తోంది.. ఇందులో భాగంగా స్త్రీనిధి పేమెంట్ యాప్‌ను తీసుకొస్తున్నారు. ఈనెల చివరిలోపు ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని వెలుగు సిబ్బంది చెబుతున్నారు. ప్లేస్టోర్‌లోకి వెళ్లి యాప్‌ను డౌన్‌లోడు చేసుకొని సభ్యురాలి ఫోన్ నంబరుతో పాటు సంఘం పేరు, ఇతర వివరాలను నమోదు చేసుకోవాలి. తర్వాత వన్‌టైం పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి. తీసుకున్న రుణానికి సంబంధించి నెలవారీ వాయిదాలు ఆన్‌లైన్‌లో చెల్లించొచ్చు.. దీనివల్ల అక్రమాలకు తావుండదని వెలుగు కార్యాలయాల అధికారులు చెబుతున్నారు. ఒక్కో సంఘానికి గరిష్ఠంగా రూ.5 లక్షలు

మహిళా సంఘాలకు స్త్రీనిధి క్రెడిట్ కో–ఆపరేటీవ్ ఫెడరేషన్ ద్వారా ఏటా రుణాలు ఇస్తున్నారు. ఒక్కో సంఘానికి షార్ట్‌టర్మ్ రుణం రూ.20 వేలు, మైక్రో రుణం రూ.50 వేలు, టినీరుణం రూ.లక్ష చొప్పున సభ్యులు పొందొచ్చు. ఒక్కో సంఘం గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు రుణాన్ని తీసుకోవచ్చు.సంఘానికి రుణాన్ని జమచేసిన తర్వాత వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తారు. రూ.50 వేల రుణాన్ని రెండేళ్ల లోపు, రూ.లక్ష రుణాన్ని మూడేళ్ల లోపు చెల్లించొచ్చు. 11 శాతం (90పైసలు) వడ్డీ వసూలు చేస్తారు. రానున్న రోజుల్లో దివ్యాంగులకు, ట్రాన్స్‌జెండర్లకు అతి తక్కువ వడ్డీతో వారి జీవనోపాధుల మెరుగుకు స్త్రీనిధి రుణాలు ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# కాజల్ ట్రై చేస్తుంది కానీ..?

సౌత్ లో స్టార్ హీరోయిన్ గా కొన్నేళ్ల పాటు తన సత్తా చాటిన కాజల్ అగర్వాల్ దాదాపు తెలుగులో ఉన్న స్టార్ హీరోలందరితో నటించింది. లక్ష్మీ కళ్యాణం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు చందమామతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక మగధీర సినిమాలో మిత్రవింద పాత్రలో అదరగొట్టేసింది అమ్మడు. అప్పటి నుంచి స్టార్ హీరోల సరసన నటిస్తూ టాప్ రేంజ్ కి వెళ్లింది. ఐతే ఎప్పుడూ కెరీర్ ఒకేలా ఉండటం జరగదు. కాజల్ స్టార్ క్రేజ్ వచ్చాక అయితే ఎలాగు బ్యాక్ స్టెప్ లేకుండా వరుస విజయాలతో దూసుకెళ్లింది. కేవలం తెలుగులోనే కాదు తమిళ్ లో కూడా అమ్మడు తన సత్తా చాటింది. అక్కడ కూడా టాప్ హీరోయిన్ రేంజ్ క్రేజ్ సంపాదించింది. ఐతే కాజల్ కెరీర్ ఆఫ్టర్ మ్యారేజ్ కాస్త దూకుడు తగ్గిందని చెప్పొచ్చు. పెళ్లై ఒక బాబు పుట్టిన తర్వాత సినిమాలు చేయడమే కష్టం అనుకునే వారు కానీ కాజల్ ఇప్పటికీ మంచి ప్రాజెక్ట్ లను చేస్తుంది. తెలుగులో ఆమెకు ఉన్న పాపులారిటీకి వెరైటీ కథలు చేస్తే వర్క్ అవుట్ అయ్యే ఛాన్స్ ఉంది. ఆ ప్రయత్నంలో భాగంగానే సత్యభామ అనే సినిమా చేసింది కాజల్ కానీ అది వర్క్ అవుట్



అవ్వలేదు. బాలయ్యతో నటించిన భగవంత్ కేసరి హిట్ పడినా ఆ క్రెడిట్ ఆమెకు దక్కలేదు. ప్రస్తుతం తెలుగులో కాజల్ కి పెద్దగా ఛాన్స్ లు లేవు. ఐతే మళ్లీ తెలుగులో తిరిగి బిజీ అవ్వాలని ట్రై చేస్తున్నా కూడా అవకాశాలు రావట్లేదని తెలుస్తుంది. ప్రస్తుతం కాజల్ తమిళ్ లో కూడా పెద్దగా ఛాన్స్ లు రాబట్టుకోవట్లేదు. బిఫోర్ మ్యారేజ్ వరకు సక్సెస్ రేటు ఎలా ఉన్నా కాజల్ మాత్రం ఎప్పుడు ఖాళీగా ఉన్నట్టు అనిపించలేదు. కానీ ఇప్పుడు మాత్రం అమ్మడు సినిమాలు చేయాలని ఉత్సాహంగా ఉన్నా కూడా సరైన ఛాన్స్ లు రావట్లేదని తెలుస్తుంది. ఐతే కాజల్ ని మళ్లీ ఫాం లోకి తెచ్చేలా మంచి కథలు దొరకాలని ఆమె ఫ్యాన్స్ కోరుతున్నారు. కాజల్ కూడా అందుకు ఎలాంటి రిస్క్ అయినా చేసేందుకు రెడీ అంటుందని తెలుస్తుంది. స్టార్ డైరెక్టర్స్ ఏమో కానీ కాజల్ లాంటి స్టార్ హీరోయిన్ ని తమ సినిమాలో తీసుకోవాలని యువ దర్శకులు కూడా ప్రయత్నించాలి. ఐతే కాజల్ మాత్రం ఇక మీదట కొత్తగా, వెరైటీగా ఉన్న కథలనే చేయాలని గట్టిగా ఫిక్స్ అయినట్టు తెలుస్తుంది.

## 'శుభం' జర్నీ.. డైరెక్టర్ రాజ్ తో సామ్ ఫోటో వైరల్!

ప్రముఖ నటి సమంత.. హీరోయిన్ గా ఎలాంటి క్రేజ్ సంపాదించుకున్నారో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ప్రొడ్యూసర్ గా సత్తా చాటేందుకు రెడీ అవుతున్నారు. సొంత నిర్మాణ సంస్థ ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై రూపొందించిన శుభం మూవీతో ప్రేక్షకుల ముందుకు మరికొద్ది రోజుల్లో రానున్నారు. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి తదితరులు నటించిన శుభం మూవీకి ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించగా, సామ్ తక్కువ బడ్జెట్ తో నిర్మించారు. మే 9వ తేదీన ఆ సినిమా రిలీజ్ అవ్వనుండగా.. కొంతకాలంగా ప్రమోషన్స్ తో బిజీగా గడుపుతున్నారు. ఇప్పుడు ఇన్ స్టాగ్రామ్ పోస్ట్ తో అందరి దృష్టిని ఆకర్షించారు. కొన్ని పిక్స్ పోస్ట్ చేసి.. హార్ట్ ఫెల్ట్ మెసేజ్ రాసుకొచ్చారు. అదొక చాలా లాంగ్ రోడ్.. ఇక్కడ మనం స్ట్రాంగ్ న్యూ బిగినింగ్స్ అంటూ క్యాప్షన్ ఇచ్చారు సామ్. శుభం మూవీని ట్యాగ్ చేసి రిలీజ్ డేట్ ను గుర్తుచేసిన ఆమె.. క్రేజీ పిక్స్ పోస్ట్ చేయడం విశేషం. అందులో శుభం మూవీ క్లాప్ పిక్ కూడా ఉంది. అదే సమయంలో దర్శకుడు రాజ్ నిడిమోరుతో దిగిన



ఫోటోను పోస్ట్ చేసిన సమంత.. ఆయన సింగిల్ పిక్ కూడా యాడ్ చేయడం గమనార్హం. దీంతో ఇప్పుడు సమంత పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇది స్పెషల్ పోస్ట్ అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయితే రాజ్, సామ్ వివాహం చేసుకోనున్నారని కొద్ది రోజులుగా ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడు ఇన్ స్టాగ్రామ్ లో సమంత.. రాజ్ పిక్స్ పోస్ట్ చేయడంతో ఆ మ్యాటర్ మళ్లీ చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో వైట్ అవుట్ ఫిట్స్ లో దిగిన పిక్స్ షేర్ చేయగా.. సూపర్ గా ఉన్నాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మేడమ్ సర్ మేడమ్ అంతే అని కొనియాడుతున్నారు. బ్యూటిఫుల్ ఫోటోస్ అని చెబుతున్నారు. ఇక కెరీర్ విషయానికొస్తే.. శుభం మూవీతోపాటు మా ఇంటి బంగారం సినిమాను నిర్మిస్తున్నారు సామ్. అందులో ఆమె నటిస్తున్నారు కూడా. అదే సమయంలో రక్త్ బ్రహ్మాండ్ వెబ్ సిరీస్ లోనూ యాక్ట్ చేస్తున్నారు. మహారాణి పాత్రలో కనిపించనున్నారని టాక్ వినిపిస్తోంది. మరి వరుస ప్రాజెక్టులతో ఎలాంటి హిట్స్ అందుకుంటారో వేచి చూడాలి.




# వాటర్ యాక్షన్ సీన్స్.. అప్ కమింగ్ మూవీల్లో అవే హైలెట్!



సినీ ప్రియులను ఆకట్టుకునేందుకు మేకర్స్ వినూత్నమైన యాక్షన్ సీన్స్ ను తెరకెక్కించేందుకు ట్రై చేస్తున్న విషయం తెలిసిందే. అందుకోసం పెద్ద మొత్తంలో బడ్జెట్ కూడా కేటాయిస్తున్నారు. ఖర్చు విషయంలో అస్సలు వెనకాడడం లేదు. అలా ఇప్పటికే అనేక సినిమాల్లో వివిధ రకాల యాక్షన్ సీన్స్ ను మనం చూసే ఉంటాం. అయితే వాటిలో వాటర్ యాక్షన్ సీన్స్ చాలా కాస్ట్లీ అనే చెప్పాలి. అవి క్లిక్ అయితే చాలు.. సినిమాకు హైలెట్ గా నిలుస్తాయి. ప్రేక్షకులను ఓ రేంజ్ లో మెప్పిస్తాయి. రిపీట్ మోడ్ లో థియేటర్స్ కు ఆడియన్స్ ను రప్పిస్తాయి. ఇప్పుడు అప్ కమింగ్ భారీ చిత్రాల్లో అలాంటి సీన్సే మేకర్స్ యాడ్ చేస్తున్నారు. ఆడియన్స్ ను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. మెగాస్టార్ చిరంజీవి విశ్వంభరలో బురద నీటిలో ఫైట్ ఉంటుందని తెలుస్తోంది. మూవీకి అదే మెయిన్ హైలెట్ గా నిలవనుందని సమాచారం. జూలై లేదా ఆగస్టులో మూవీ విడుదల అవ్వనుందట. మరోవైపు, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హరి హర వీర మల్లు మూవీలో అదిరిపోయే నీటి పోరాట సన్నివేశం ఉంటుందని సమాచారం. సూపర్ స్టార్ మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్ లో రూపొందుతున్న సినిమాలో భారీ వాటర్ యాక్షన్ సీన్ ఉందని సమాచారం. రీసెంట్ గా హైదరాబాద్ లో వేసిన సెట్ లో మహేష్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్, 3000 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులతో ఆ సన్నివేశాన్ని చిత్రీకరించినట్లు టాక్ వినిపిస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ లైనప్ లో ఉన్న దేవర 2లో క్రేజీ నీటి యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. దర్శకుడు కొరటాల శివ ఆ సీన్స్ ను.. ఫస్ట్ పార్ట్ కు మించిన రీతిలో చిత్రీకరిస్తారని టాక్ వినిపిస్తోంది. ప్రశాంత్ నీల్ తో చేస్తున్న సినిమా కంప్లీట్ అయ్యాక.. ఎన్టీఆర్ దేవర 2ను మొదలుపెట్టనున్నారని తెలుస్తోంది. హనుమాన్ తో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టి సంచలనంగా మారిన హీరో తేజ సజ్జా నటిస్తున్న మూవీ మిరాయ్ లో భారీ వాటర్ యాక్షన్ సీక్వెన్స్ ఉంటుందని సమాచారం.

సూపర్ హీరో జోనర్ లో తెరకెక్కుతున్న ఆ సినిమాకు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నారు. ఆగస్టు 1న వరల్డ్ వైడ్ గా మూవీ విడుదల చేయనున్నారు మేకర్స్. మరి ఆయా చిత్రాల్లోని వాటర్ సీన్స్ ఎలా మెప్పిస్తాయో చూడాలి.

# ఐశ్వర్యకు 'కన్నప్ప' ఓవర్సీస్ రైట్స్.. ఇప్పుడు కల నిజమైందట..



టాలీవుడ్ హీరో మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప.. రిలీజ్ కు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. పాన్ ఇండియా మైథలాజికల్ మూవీగా రానున్న కన్నప్పను ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. భారీ బడ్జెట్ తో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. కీలక పాత్రలో నటిస్తున్నారు కూడా. ఆయనతోపాటు అక్షయ్ కుమార్, ప్రభాస్, మోహన్ లాల్, శరత్ కుమార్, ప్రీతి ముకుందన్ సహా అనేక మంది స్టార్ నటీనటులు కనిపించనున్నారు. అయితే జూన్ 27వ తేదీన వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానున్న కన్నప్ప ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ హక్కులను వసారా ఎంటర్టైన్మెంట్ యూఎస్ ఏ సొంతం చేసుకుంది. ఆ విషయాన్ని గర్వంగా ప్రకటించింది. వసారా ఎంటర్టైన్మెంట్ యూఎస్ ఏను ఐశ్వర్య గుంటిరెడ్డి స్థాపించి.. సినిమా వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. ఆమె.. రాశి మూవీస్ నర్సింహారావుగా ప్రసిద్ధ చెందిన ప్రముఖ నిర్మాత నర్సింహారావు కుమార్తె. సినిమా పట్ల ఎంతో మక్కువ ఉన్న ఆమె.. ఇంటర్నేషనల్ డిస్ట్రిబ్యూషన్ పట్ల దృక్పథంతో ఉన్నారు. తాను చాలా కాలంగా అమెరికాలో భారతీయ చిత్రాలను డిస్ట్రిబ్యూట్ చేస్తున్నట్లు తెలిపారు ఐశ్వర్య. సినిమా నిజంగా తన రక్తంలోనే ఉందని చెప్పారు. కొంతకాలంగా తాను ఒక ప్రత్యేక డిస్ట్రిబ్యూషన్ సంస్థను ప్రారంభించాలని కలలు కన్నానని, ఇప్పుడు VASARAAతో నిజమైందని చెప్పారు. కన్నప్పతో ప్రయాణాన్ని ప్రారంభించడం మరింత గౌరవమని తెలిపారు. ఒక సినిమా ఔత్సాహికురాలిగా మాత్రమే కాకుండా, శివుని నిజమైన భక్తురాలిగా తన హృదయానికి దగ్గరగా ఉన్న కథ కన్నప్ప అని చెప్పారు. ఆ సినిమా కేవలం ఒక వాణిజ్య ప్రయత్నం కంటే ఎక్కువగా వర్ణించారు. ప్రస్తుత తరంలోని ప్రతి బిడ్డ మన చరిత్ర, మన దేవుళ్ళను తెలుసుకోవాలని, కన్నప్పతో అది జరుగుతుందని అన్నారు. అయితే వసారా సంస్థ.. నార్త్ అమెరికాతోపాటు కెనడాలో కన్నప్పను గ్రాండ్ గా రిలీజ్ చేయనుంది. సినిమాను ఓ రేంజ్ లో ప్రమోట్ కూడా చేయనుంది. ఇప్పటికే అందుకు సంబంధించిన షెడ్యూల్ ను విడుదల చేసింది. అందుకోసం మంచు విష్ణు ఇప్పటికే యూఎస్ కు స్టార్ట్ అయ్యారు. మరి ఓవర్సీస్ లో కన్నప్ప ఎలాంటి హిట్ అవుతుందో.. ఐశ్వర్య ఎలాంటి విజయం అందుకుంటారో వేచి చూడాలి.

# నిధి కోసం ఫ్యాన్స్ వెయిటింగ్..!

అందానికి అందం ఉండి ఆల్రెడీ ఆడియన్స్ మనసు గెలిచినా కూడా కెరీర్ విషయంలో నిధి అగర్వాల్ వెనుకబడి ఉంది. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో సూపర్ క్రేజ్ తెచ్చుకున్న ఈ భామ అంతకుముందు మిస్టర్ మజ్ను, సవ్యసాచి చేసినా రాని పాపులారిటీ ఒక్క ఇస్మార్ట్ శంకర్ తో తెచ్చుకుంది. ఇక ఇస్మార్ట్ శంకర్ తర్వాత కూడా కెరీర్ ఒక రేంజ్ లో దూసుకెళ్తుందని అనుకోగా ఆశించిన స్థాయిలో వెళ్లలేదు. ముఖ్యంగా అమ్మడు తీసుకుంటున్న గ్యాప్ ఆడియన్స్ నుంచి ఆమెను దూరం చేస్తుంది. ఇస్మార్ట్ శంకర్ తర్వాత 2022 లో అంటే 3 ఏళ్లు గ్యాప్ తీసుకుని గల్లా అశోక్ తో హీరో సినిమా చేసింది నిధి అగర్వాల్. ఆ గ్యాప్ లో తమిళ్ లో ఈశ్వరన్, భూమి సినిమాలు చేసింది. కోలీవుడ్ లో ఈశ్వరన్ హిట్ అందుకోగా అమ్మడి కోసం అక్కడ గుడి కూడా కట్టే రేంజ్ కి వెళ్లింది. అంతేకాదు నిధి కి అక్కడ అభిమాన సంఘాలు ఏర్పడి ఆమె పుట్టినరోజు మంచి కార్యక్రమాలు చేస్తున్నారు. తెలుగు విషయానికి వస్తే మళ్లీ 3 ఏళ్ల



తర్వాత హరి హర వీరమల్లు, రాజా సాబ్ సినిమాలతో వస్తుంది నిధి అగర్వాల్. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో వీరమల్లు సినిమా గత 4 ఏళ్లుగా జరుగుతూనే ఉంది. ఐతే ఈమధ్యనే ఆ సినిమా మొదటి భాగానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేశారట. జూన్ రెండో వారం రిలీజ్ ఉంటుందని టాక్. ఈ సినిమాలో నిధి హీరోయిన్ గా నటిస్తుంది. పవర్ స్టార్ సినిమాలో ఛాన్స్ అంటే అది మాములు విషయం కాదు. మరోపక్క రాజా సాబ్ లో కూడా నిధి సర్ ప్రైజ్ చేస్తుంది. ఆఫ్టర్ గ్యాప్ నిధి ఈ రెండు సినిమాలతో మళ్లీ తన ఫ్యాన్స్ ని మెస్మరైజ్ చేయాలని చూస్తుంది. నిధి ఫ్యాన్స్ కూడా అందుకే వెయిట్ చేస్తూ ఉన్నారు. రాబోతున్న రెండు సినిమాల్లో నిధి ఖాతాలో ఏ ఒక్కటి హిట్ పడినా టాలీవుడ్ లో అమ్మడు మళ్లీ బిజీ అయ్యే ఛాన్స్ ఉంటుంది. తెలుగులో ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాల హంగామా నడుస్తుండగా నిధి కూడా అలాంటి ఒక ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్నట్టు తెలుస్తుంది. స్టార్ మెటీరియల్ అయిన నిధి ఇలా సైలెంట్ అవ్వడం ఆమె ఫ్యాన్స్ కి నచ్చట్లేదు. అందుకే అమ్మడు కెరీర్ లో దూకుడు చూపిస్తే ఆమెకు సపోర్ట్ గా ఉండాలని చూస్తున్నారు.

## మెగా కోడలు ఇంటికే పరిమితమా!

మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లైన తర్వాత వెండి తెరపై మెరిసింది లేదు. బుల్లి తెరపై ఓటీటీ సిరీస్ ల ద్వారా అలరించింది తప్ప పెద్ద తెర ప్రేక్షకులకు మాత్రం దూరంగానే ఉంది. వరుణ్ తేజ్ తో లావణ్య వివాహం 2023 నవంబర్ లో జరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఒక్క సినిమా కూడా చేయలేదు. పెళ్లికి ముందు %-%హ్యాపీ బర్త్ డే%-% సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అటుపై తెరకే దూరమైంది. తాజాగా లావణ్య గర్భం దాల్చిన విషయాన్ని అధికారికంగా వెల్లడించిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది పండంటి పాపాయికి జన్మనివ్వనుంది. మరి ఇలాంటి పరిస్థితుల్లో లావణ్య కెరీర్ కంటున్యూ అవుతుందా? అంటే అతి కష్టమనే ఫిలిం సర్కిల్స్ లో చర్చకొస్తుంది. బేసిక్ గా లావణ్య సినిమాల విషయంలో ఆచి తూచి వ్యవహరిస్తుంది. కెరీర్ ఆరంభం నుంచి గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటూ డీసెంట్ రోల్స్ మాత్రమే చేసుకుంటూ వచ్చింది. ఈ క్రమంలో చాలా ఫ్లాప్ లు ఎదురైనా ఎక్కడా నిబంధన అతిక్రమించకుండా పని చేసుకుంటూ వచ్చింది. లావణ్య తల్లిదండ్రులు అన్నలు..వదినలు కుటుంబమంతా లాయర్లు...జడ్జ్ లు. చిన్నప్పటి నుంచి ఎంతో



క్రమశిక్షణ. ఇప్పటికీ అదే క్రమ శిక్షణతో ముందుకెళ్తుంది. మెగా ఫ్యామిలీ ఇంట కోడైలన తర్వాత మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తుంది. వివాహం తర్వాత దాదాపు ఇంటికే పరిమితమైంది. కానీ వివాహానికి ముందు కమిట్ అయిన కొన్ని సినిమాలు మాత్రం అనివార్య కారణాలతో ఇప్పటికీ రిలీజ్ కాలేదు. తమిళ్ లో %-%తానల్%-% అనే సినిమా చేస్తుంది. ఈ సినిమా ఎట్టకేలకు చిత్రీకరణ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ స్టేజ్ లో ఉంది. అలాగే %-%సతీ లీలావతి%-% అనే మరో చిత్రం కూడా చేస్తోంది. ఈ రెండు సినిమాల రిలీజ్ అనంతరం లావణ్య కెరీర్ కంటున్యూ అవుతుందా? లేదా? అన్నది క్లారిటీ వస్తుందని సన్నిహిత వర్గాల సమాచారం.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536